epaper.vaartha.com
WWW.VAARTHA.COM
కరీంనగర్
: fb.com/vaartha Digital
9-3-2026 సోమవారం సంపుటి: 32
సంచిక: 37 పేజీలు: 8+16 వెల: 6.50

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

Published from Karimnagar, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

**2026 2024 2007** మూడు సార్లు ప్రపంచ కప్ విజయం

ప్లేయర్ ఆఫ్ ది టోర్నీ సంజూ
5 మ్యాచ్‌ల్లో 321 రన్స్
ఫైనల్లో న్యూజిలాండ్‌పై 89 రన్స్
సెమీస్‌లో ఇంగ్లాండ్‌పై 89 రన్స్
వెస్టిండీస్‌పై అజేయంగా 97 రన్స్

## టి-20 ప్రపంచ కప్
# విజేత భారత్



సంజూ 89

అహ్మదాబాద్‌లో బ్లూ సునామీ ఆవిష్కృతమైంది. బ్లూ బ్రిగేడ్ మొదట బ్యాటింగ్‌లో ధనాధన్ లాడిస్తే.. తర్వాత బౌలింగ్‌లో ప్రత్యర్థిని పేకమేడలా కూల్చారు. టి20 ప్రపంచకప్‌లో చరిత్ర సృష్టించారు. ఫైనల్‌కు ముందు ఉన్న డౌట్స్ అన్నీ పటాపంచలు చేశారు. సౌతాఫ్రికాపై చెలరేగిన కివీస్‌ల ఆటలు బ్లూ బ్రిగేడ్ ముందు సాగలేదు. సూర్యసేన సూపర్ షోతో ముచ్చటగా మూడోసారి టి20 ప్రపంచకప్ అందుకుంది. వరుసగా రెండోసారి కప్ సాధించింది. ఎంఎస్ ధోనీ, రోహిత్ శర్మ తర్వాత భారత్‌కు కప్ అందించిన సారథిగా సూర్యకుమార్ యాదవ్ నిలిచాడు. ఆతిథ్య జట్టు స్వదేశంలో ట్రోఫీ గెలవడం ఇదే మొదటిసారి. బ్లూ బ్రిగేడ్ కప్ సాధించడంతో దేశవ్యాప్తంగా సంబరాలు అంబరాన్ని అంటాయి.

- అహ్మదాబాద్‌లో బ్లూ సునామీ
- చెలరేగిన సంజూ, అభిషేక్, ఇషాన్
- ఫైనల్లో టీమిండియా రికార్డు స్కోరు
- పేకమేడలా కూలిన న్యూజిలాండ్
- తిప్పేసిన అక్షర్, కూల్చిన బుమ్రా
- సొంతగడ్డపై తొలి సారి కప్ సొంతం





ఇరాన్ రాజధాని టెహ్రాన్‌పై ఇజ్రాయెల్ దాడి తర్వాత ఎగసిపడుతున్న పొగలు

# భీకర దాడులు

**కువైట్ భద్రతా మండలి కార్యాలయంపై బాంబుల వర్షం**

**న్యూయార్క్ మేయర్ ఇంటివద్ద దాడి**

**నార్వేలోని అమెరికా దౌత్యకార్యాలయం వద్ద పేలుడు**

**తొలిదాడిలోనే ఖమేనీ కుమారుడికి గాయాలు: ఇజ్రాయెల్**

**టెహ్రాన్ / జెరూసలెం, మార్చి 8:** మధ్యప్రాచ్యదేశాల్లో ఉద్రిక్తతలు, యుద్ధ వాతావరణం రోజురోజుకూ మరింత ఉధృతం అవుతోంది. ఇరాన్‌ను సమూలంగా మట్టుపెట్టేస్తామని అటు ఇజ్రాయెల్ ఇటు అమెరికాలుప్రకటిస్తుంటే ఇరాన్ మాత్రం అమెరికా మిత్రదేశాల్లోని స్థావరాలనే లక్ష్యంగా దాడులు ముమ్మరంచేసింది. తాజాగా ఆదివారం కూడా మరిన్న దాడులుజరిగాయి. గల్ఫ్‌దేశాలపై ఇరాన్ తన దాడులతో విరుచుకుపడుతోంది. కువైట్ పరిధిలో అత్యున్నతస్థాయి భవనం అంటే సామాజిక భద్రత టవర్‌పై దాడులుచేయడంతో మంటల్లో చిక్కుకుంది. డ్రోన్ల శకలాలు పడి టవర్ దగ్ధం అయింది. ఇదిలా ఉంటే ఇరాన్‌కు మరింతగా షాకులు ఇస్తామని, ఆకస్మిక దాడులు చేస్తామంటూ ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు హెచ్చరికలు చేసారు. ఆదేశ ప్రజలే అక్కడి మతఛాందస ప్రభుత్వాన్ని పడగొట్టే రోజులున్నాయన్నారు. ఇలా ఉంటే ఇరాన్ జాతీయ భద్రతా మండలి కార్యదర్శి అలీలారిజాని అమెరికా ట్రంప్‌కు తీవ్ర హెచ్చరికలు చేసారు. తమ నేత ఖమైనీ మృతికి ప్రతీకారం తీర్చుకుంటామని, ట్రంప్ అందుకు మూల్యం చెల్లించాల్సిందేనని ప్రకటించారు. యుద్ధం నేపథ్యంలో అమెరికన్‌సైనికులను తాము బంధించామని జైళ్లలో ఉంచినట్లు తెలిపారు. ఇప్పటికే ఆరుగురు యుఎస్ సైనికులు చనిపోయారని >>2

## రోజురోజుకు గరంగరం
**ఉష్ణోగ్రతలు 45° దాటే ప్రమాదం**

**హైదరాబాద్, మార్చి 8, ప్రభాతవార్త:** మార్చి ఆరంభంలోనే ఎండలు మండి పోతుండడంతో అల్లాడిపోతున్న ప్రజలకు వాతావరణ శాస్త్రవేత్తలు మరో హెచ్చరిక జారీ చేశారు. రానున్న ఎప్రిల్, మే నెలల్లో ఎండలు మరింత



తీవ్రంగా ఉంటాయని హెచ్చరిస్తున్నారు. సాధారణంగా ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు దాటితేనే అల్లాడిపోతాం.. అలాంటిది రాబోయే రెండు నెలల్లో దేశంలో పగటి ఉష్ణోగ్రతలు 45 డిగ్రీల నుండి 48 డిగ్రీల దాకా చేరే ప్రమాదముందని సూచిస్తున్నారు. వేసవి ఉష్ణోగ్రతల దాటికి శరీరం తట్టుకోకపోతే ప్రాణాలకే ముప్పు అని హెచ్చరిస్తున్నారు. గాలిలో తేమ , వేడి కలిసినపుడు శరీరంలోని చెమట ఆవిరి కాదని, దీన్ని వెట్‌బల్బ్ టెంపరేచర్‌గా పేర్కొంటున్న వాతావరణ నిపుణులు ఈ తరహా వాతావరణం మనుషులకు అత్యంత ప్రమాదకరమని పేర్కొంటున్నారు. సాధారణంగా ఎండా కాలం అంటే మధ్యాహ్నం తర్వాత ఎండలు మండి >>2



ఆదివారం హైదరాబాద్‌లో మహిళా దినోత్సవంలో ప్రసంగిస్తున్న సిఎం రేవంత్ రెడ్డి

# మూసీ ప్రక్షాళన చేయొద్దా?

## విపక్షాలు అనుకూలమో, కాదో చెప్పాలి

**అపార్ట్‌మెంట్ల వారికి 7 ఎకరాల భూమి వేరేచోట ఇస్తాం..**

**13న మూసీ రివర్‌ఫ్రంట్‌పై పవర్ పాయింట్**

**కాలేజీ విద్యార్థినులకు త్వరలో ఇవి స్కూటీలు**

**అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో సిఎం రేవంత్‌రెడ్డి**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మార్చి8:** మూసీని ప్రక్షాళన చేయాలని అంటున్నారు..కాని ప్రభుత్వాన్ని ఏమీ చేయనివ్వరు.మూసీ ప్రక్షాళనకు విపక్షాలు అనుకూలమా. వ్యతిరేకమా? అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. ప్రభుత్వం ఏ కార్యాచరణ చేపట్టకుండా ఎలా సాధ్యం అవుతాయని ప్రశ్నించారు. 'అహ్మదాబాద్‌లో 10 వేల కుటుంబాలను తరలించి సబర్మతి రివర్ ఫ్రంట్ కట్టారు..వాళ్లకు సరైన సౌకర్యాలు ఏర్పాటు చేయలేదు.. ఢిల్లీలో యమునా రివర్ ఫ్రెంట్, యూపీలో గంగానది రివర్‌ఫ్రెంట్ చేశారు.. కాని హైదరాబాద్‌లో మూసీ రివర్‌ఫ్రెంట్ మాత్రం వద్దంటున్నారు. నిర్వాసితులకు సరైన సాయం అందించాలన్న దానిపైన స్పష్టత ఉండాలి' పేర్కొన్నారు. ఆదివారం ప్రజాభవన్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జర్నలిస్టులకు అవార్డుల కార్యక్రమంలో ప్రసంగించారు. మూసీని ప్రక్షాళన చేస్తామంటే ప్రతిపక్షాల నేతలు ఎందుకు అడ్డుపడుతున్నారని ఫైర్ అయ్యారు ఇటీవల ఓ అపార్ట్‌మెంట్ విషయంలో రాద్ధాంతం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈసా నదిఒడ్డున 2004లో తొమ్మిది మీటర్ల బఫర్‌జోన్‌లో అపార్ట్‌మెంట్ కట్టారు..నదులకు 50 మీటర్ల బఫర్ జోన్ ఏర్పాటు చేస్తూ 2012లో నిర్ణయం తీసుకున్నారు. దీంతో 50 మీటర్ల లోపుల కట్టడాలపైన నిషేదం ఉంది. అక్కడ నిర్మాణాలు యాభై శాతం బఫర్ జోన్ ఉన్నాయి. అందుకే వాళ్ల పిలిచి మాట్లాడి చెప్పాం..వాళ్లకు వేరోచోట 7 ఎకరాల భూమి ఇచ్చి అందులో అపార్ట్ మెంట్ కట్టుకోవడానికి కావాల్సిన డబ్బును డిపాజిట్ చేస్తామని చెప్పాం.. వారు సొసైటీగా ఏర్పడి నిర్మాణం చేసుకోవచ్చునని పేర్కొన్నారు. కాని రాజకీయ రంగుగా మారి, ప్రతి పార్టీ అక్కడికి వెళ్లి సానుభూతి చూపిస్తున్నారు.. సానుభూతితో సమస్య పరిష్కారం కాదు.. 50 మీటర్ల బఫర్ జోన్ లో ఉన్న అన్ని కట్టడాలు జీరో వాల్యూ అని వివరించారు. ప్రత్యామ్నాయం చూపించాలని మేం ప్రయత్నిస్తుంటే రాజకీయ పార్టీలు అక్కడికి వెళ్తున్నాయి. కన్నీళ్లను ఓట్లుగా మార్చుకునే ప్రయత్నం చేస్తున్నారు అని ఆగ్రహం వ్యక్తం చేశారు.. బఫర్ జోన్ లో ఉన్న వారికి జరిగే నష్టం పైన చర్చిస్తే బాగుంటుంది. మేం చేయలేదు.. మీరు చేయొద్దు అన్న భావనలో >>2

# కౌన్సిల్‌కు కొత్తరూపు

## 113 యేళ్ల భవనానికి అధునాతన ముస్తాబు

**భవనం, హాలును ప్రారంభించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి**



కౌన్సిల్ భవనాన్ని ప్రారంభిస్తున్న సిఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో స్పీకర్ గడ్డం ప్రసాద్, మండలి చైర్మన్ గుత్తా, మంత్రులు కోమటిరెడ్డి, శ్రీధర్‌బాబు తదితరులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మార్చి8:** అసెంబ్లీ ప్రాంగణంలో ఆధునీకరించిన తెలంగాణ శాసనమండలి భవనాన్ని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఆధునిక సౌకర్యాలతో రూపుదిద్దుకున్న ఈ భవనం ప్రారంభోత్సవ కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్ కుమార్, శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు,దామోదర రాజనర్సింహా, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, వివేక్ వెంకటస్వామి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్,రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్‌రెడ్డి, ఎంపీ కడియం కావ్య, మండలి విపక్ష నేత మధుసూదనాచారి, ప్రభుత్వ సలహాదారులు, ప్రభుత్వ విప్‌లు, అన్ని పార్టీలఎమ్మెల్సీలు.మండలి కార్యదర్శి డాక్టర్ వి.నరసింహాచార్యులు, అసెంబ్లీ కార్యదర్శి రెండ్ల తిరుపతి ఇతర ఉన్నతాధఅధికారులు పాల్గొన్నారు. మొదట శాసనమండలి భవనంకు సంబంధించి శిలా ఫలకాన్ని ప్రారంభించిన అనంతరం మండలి సభా హాల్‌లోకి ప్రవేశించారు. తర్వాత మండలిలోని సిఎం తన ఛాంబర్‌లో పూజలు నిర్వహించారు. తర్వాత మండలి చైర్మన్ ఛాంబర్‌లో,వైస్ చైర్మన్ ఛాంబర్‌లో పూజలు >>2

# 30 నెలల్లో పాలమూరు

**వచ్చే మార్చికి కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, కోయిల్ సాగర్ పూర్తి చేస్తాం**

**సాగునీటి పారుదల మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి**



ఆదివారం హైదరాబాద్‌లో అధికారులతో సమీక్ష చేస్తున్న మంత్రి ఉత్తమ్ కుమార్

**హైదరాబాద్, మార్చి 8, ప్రభాతవార్త:** రానున్న 30నెలల వ్యవధిలో పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును పూర్తిచేస్తామని రాష్ట్ర నీటిపారుదల శాఖామంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. అదేవిధంగా 2027 మార్చి కల్లా కల్వకుర్తి, నెట్టెంపాడు ,భీమా, కోయిల్ సాగర్ ప్రాజెక్టులను పూర్తి చేసి సమృద్ధిగా సాగునీరు, త్రాగునీరు అందిస్తామని పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాతోపాటు దక్షిణ తెలంగాణా ప్రాంత రైతాంగానికి సరిపడా సాగునీరు అందించడమే రాష్ట్ర ప్రభుత్వ సంకల్పమని స్పష్టం చేశారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టుల పురోగతిపై ఆదివారం సహచర మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరితోపాటు జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులతో కలసి జలసౌదలో ఆయన ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... నిర్మాణంలో ప్రాజెక్టులను వేగవంతంగా పూర్తి చేసేందుకుగాను రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు కేటాయించిందని చెప్పారు. >>2

**హైదరాబాద్, మల్కాజ్‌గిరి, సైబరాబాద్ కార్పొరేషన్ల వారీగా సంస్థాగత విభజన**

**పార్టీ బలోపేతం దిశగా అడుగులు**

**ఎంపీలకు ఇన్‌చార్జి బాధ్యతలు ఇచ్చే యోచన**

# బిజెపిలో భారీ మార్పులు!

**హైదరాబాద్, మార్చి 8, ప్రభాతవార్త:** గ్రేటర్ హైదరాబాద్‌పై టి.బిజెపి ఫోకస్ పెంచింది. ప్రస్తుతం గ్రేటర్ మూడు కార్పొరేషన్లుగా విడిపోయిన నేపథ్యంలో ఈ మూడింటికి ఎప్పుడు ఎన్నికలు జరిగినా కాషాయ జెండా ఎగరేయాలని కమలనాథులు లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలుస్తోంది. ఇందుకోసం పార్టీలో సంస్థాగత మార్పులకుబిజెపి రాష్ట్ర నాయకత్వం సిద్ధమవుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ మేరకు గ్రేటర్ పరిధిలోని కార్పొరేషన్లలో గెలుపే లక్ష్యంగా హైదరాబాద్, రంగారెడ్డిజిల్లాల్లో భారీ మార్పులకు శ్రీకారంచుట్టేందుకు కమలనాథులు సిద్ధమయ్యారు. గ్రేటర్‌ను హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్లుగా విభజించిన >>2



# ఎపి జలదోపిడిని అడ్డుకోండి

## కెఆర్ఎంబిని కోరిన తెలంగాణ సర్కార్

**హైదరాబాద్, మార్చి 8, ప్రభాతవార్త:** కృష్ణా జలాల్లో ఏపి కేటాయింపులకంటే మించి వినియోగించిందని, ఇకపై ఆ రాష్ట్రం నీటిని వినియోగించుకోకుండా నిలువరించాలని కెఆర్ఎంబి (కృష్ణానదీ యాజమాన్యబోరు)ని తెలంగాణ కోరింది. తక్షణమే శ్రీశైలం, సాగర్‌పై ఉన్న ఏపీ జలవిద్యుత్ కేంద్రాలతోపాటు ఇరు జలాశయాల నుంచి ఏపి నీటిని తరలించుకునే అవుట్‌లెట్లను నియంత్రణలోకి తీసుకోవాలని తాజాగా కోరింది. ఏపి కేటాయింపులకంటే ఎక్కువగా వినియోగించుకున్నందున శ్రీశైలం, నాగార్జున సాగర్ జలాశయాల్లో >>2



టి 20 వరల్డ్ కప్ విజయంతో ఆదివారం రాత్రి సెక్రటేరియట్ వద్ద ప్రజల ఆనందోత్సాహాలు

# 30 నెలల్లో పాలమూరు

>> కల్వకుర్తి ప్రాజెక్టుకు రూ.909 కోట్లు, నెట్టెంపాడుకు రూ.252 కోట్లు, భీమా ప్రాజెక్టుకు రూ.200 కోట్లు, కోయిలసాగర్ ప్రాజెక్టుకు రూ.185 కోట్లు కేటాయింపులు జరిగాయని వివరించారు. అదే సమయంలో రాష్ట్ర వ్యాప్తంగా నిర్మాణంలో ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ, పునరావాస పనులకుగాను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు భూసేకరణకు అత్యున్నత ప్రాధాన్యత ఇస్తూ జూన్ 2 నాటికి రూ. 5000 కోట్లు విడుదల చెయాలని నిర్ణయించినట్లు ఆయన వెల్లడించారు. 2014లో బి.ఆర్.ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ఈ ప్రాజెక్టులు నిర్లక్ష్యానికి గురైయ్యాయని విమర్శించారు. పాలమూరు-రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌లో ఆఫ్‌టేక్ పాయింట్‌ను జూరాల నుంచి శ్రీశైలానికి మార్చడం వల్ల లిఫ్ట్ ఖర్చులు పెరిగి రాష్ట్రానికి నష్టం కలిగిందన్నారు. ఇదే తరహాలో కాళేశ్వరం లిఫ్ట్ ఎత్తిపోతల పథకాన్ని తుమ్మిడి హట్టి నుంచి మేడిగడ్డకు మార్చడం తెలంగాణ రైతులకు అన్యాయం జరిగేలా చేసిందని పేర్కొన్నారు.

రైతులకు వాగ్దానం చేసిన సాగునీటి ప్రయోజనాలను అందించడానికి ఈ ప్రాజెక్టులకు అవసరమైన నిధులను రాష్ట్ర ప్రభుత్వం కేటాయిస్తోందని తెలిపారు. కృష్ణా పరివాహక ప్రాంతంలోని రైతులకు విశ్వసనీయ నీటి సరఫరా, అధిక దిగుబడులు, ప్రత్యక్ష ఆర్థిక మద్దతు అందిస్తామని మంత్రి తుమ్మల హామీ ఇచ్చారు.

పాలమూరు-రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌కు బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.35,200 కోట్ల పరిపాలన అనుమతి తీసుకున్నప్పటికీ, సుమారు రూ.27,000 కోట్లు మాత్రమే ఖర్చు చేసి పనులను నిరక్ష్యంగా వదిలేసిందని విమర్శించారు.

2023 సెప్టెంబర్‌లో ఈ ప్రాజెక్టులో ఒక పంపును కేవలం ఒక గంట మాత్రమే నడిపి, ఒక్క ఎకరానికి కూడా సమర్థంగా నీరు అందించలేకపోయారన్నారు. ప్రస్తుతం సవరించిన అంచనాల ప్రకారం ఈ ప్రాజెక్టు వ్యయం సుమారు రూ.55,000 కోట్లుగా అంచనా వేస్తున్నట్లు తెలిపారు. డిస్ట్రిబ్యూటరీ నెట్‌వర్క్ నిర్మాణ వ్యయం కలిపితే మొత్తం వ్యయం రూ.80,000 కోట్ల వరకు పెరిగే అవకాశం ఉందని చెప్పారు. అయినప్పటికీ ఈ ప్రాజెక్టును పూర్తి చేస్తామని మంత్రి ఉత్తమ్ స్పష్టం చేశారు.

2023 డిసెంబర్ 7 నుంచి ఇప్పటివరకు పాలమూరు-రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌పై రూ.7161 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. ఇందులో ప్రాజెక్టు పనులకు రూ.6718 కోట్లు, భూసేకరణకు రూ.284.71 కోట్లు, పునరావాసానికి రూ.63.65 కోట్లు, ఇతర ఖర్చులకు రూ.94 కోట్లు వినియోగించినట్లు వెల్లడించారు.

జూరాల (ప్రియదర్శిని జూరాల) ప్రాజెక్టులో వెంటనే డీసిల్టింగ్ పనులు ప్రారంభించాలని మంత్రి నీటిపారుదల అధికారులను ఆదేశించారు. ఈ ప్రాజెక్టు రూపకల్పన సమయంలో స్థూల నిల్వ సామర్థ్యం 11.94 టీఎంసీలుగా ఉండగా, మట్టిపొరలు పేరుకుపోవడం వల్ల ప్రస్తుతం ప్రభావవంతమైన సామర్థ్యం సుమారు 9 టిఎంసిలకు తగ్గిందని తెలిపారు. 1995లో ప్రారంభమైన ఈ ప్రాజెక్టులో మూడు దశాబ్దాలుగా సహజంగా పేరుకుపోయిన మట్టి కారణంగా ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రాజెక్టు నుంచి తవ్వి తీసే ఇసుకను గోదావరి పరివాహక ప్రాంతంలోని ప్రాజెక్టు పనులకు ఉపయోగించే అవకాశాన్ని కూడా పరిశీలించాలని సూచించారు.

తెలంగాణకు కృష్ణా నదిపై ఉన్న హక్కులను పూర్తిగా వినియోగించుకుంటామని మంత్రి స్పష్టం చేశారు. ఈ సమీక్షలో నీటిపారుదల శాఖ సలహాదారు ఆదిత్యాదాస్‌నాథ్, ప్రధాన కార్యదర్శి ఈ. శ్రీధర్, ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్‌తోపాటు నీటిపారుదలశాఖ ఇంజినీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# భీకర దాడులు

>> ట్రంప్ తప్పుదోవపట్టిస్తున్నారని, కల్పిత సంఖ్యలతోమృతులను పెంచుతారని దుయ్యబట్టారు. అమెరికా,ఇజ్రాయెల్‌పై తమ ప్రతీకార దాడులు కొనసాగుతూనే ఉంటాయని ఆయన ఆగ్రహం వ్యక్తంచేసారు. అలాగే అమెరికా వైఖరిని వ్యతిరేకించే శక్తులు అట్టుడికిపోతున్నారు. నార్వేరాజధాని ఓస్లోలో ఆదివారం అమెరికా దౌత్యకార్యాలయం పేలుడు సంభవించింది. అయితే నార్వేదేశం ఈసంఘటనపై విస్తుపోయి తక్షణ దర్యాప్తునకు ఆదేశించింది. అలాగే సౌదీలోని అల్‌కర్జ్ ప్రాంతంలో ఇరాన్ చేసిన దాడుల్లో ఒక భారతీయుడు చనిపోయాడు. ఇదిలా ఉంటే ట్రంప్‌ను తీవ్రంగా వ్యతిరేకిస్తున్న న్యూయార్క్ మేయర్ హందాని ఇంటివద్ద బాంబుల కలకలం రేగింది. స్క్రూలు, బోల్టులతో నింపిన స్మోకింగ్ బాంబులు విసరడంతో ఆప్రాంతం ఉద్రిక్తంగా మారింది. ఈ ఘటనపై పోలీసులు ఆరుగురిని అదుపులోనికి తీసుకుని విచారణచేస్తున్నారు. నిరసనకారులక వ్యతిరేకంగా ట్రంప్ మద్దతుదారులు 100మందికిపైగా మేయర్‌కు మద్దతుగా నిరసనలు చేయడం విశేషం. దీనితో ఇరువర్గాలమధ్య ఘర్షణకు దారితీయడంతో హింసపెరిగింది. ఒకరిపై ఒకరు దాడులకు దిగడంతో ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. ఘటన సమయంలో మేయర్ హందాని ఆయన భార్య ఇంట్లో లేరు. ఇరాన్ గల్ఫ్‌దేశాలపై యుద్ధం ప్రారంభించినప్పటినుంచి 1300 డ్రోన్లను ప్రయోగించామని, 210 బాలిస్టిక్ క్షిపణులుప్రయోగించినట్లు వెల్లడించింది. యుఎఇ గగనతలంలో వాటిని అడ్డుకున్నట్లు ప్రకటించింది. దుబాయ్, కువైట్, ఖతార్, బహ్రెయిన్ విమానాశ్రయాలపైనా దాడులు జరుగుతున్నాయి. ఈక్రమంలోనే వీటిని కొద్దిసేపు మూసివేసారు. కువైట్, సౌదీ, ఖతార్, యుఎఇ దేశాలనే లక్ష్యంగాచేసుకుని ఇరాన్ దాడులు ముమ్మరం చేసింది. ఇదిలా ఉంటే అమెరికా ఇజ్రాయెల్ దేశాలు జరుపుతున్న వైమానిక దాడుల్లో ప్రస్తుత తాత్కాలిక చీఫ్ ఖమైనీ కుమారుడు మొజ్తబా ఖమైనీకి గాయాలయినట్లు ఇజ్రాయెల్ ప్రకటించింది. కాగా ఇరాన్ ప్రభుత్వం ప్రజలనున ఇళ్లనుంచి బయటకు రావద్దని హెచ్చరించింది. వాయుకాలుష్యం భారీగా పెరిగిందని, అమెరికా ఇజ్రాయెల్ దాడులకారణంగా వాయుకాలుష్యం వల్ల ప్రజలు తీవ్ర అనారోగ్యం బారినపడతారని హెచ్చరించింది. దాడులనుంచి విషపూరితమైన శకలాలు వస్తాయని నగరం మొత్తం చెల్లాచెదురుగా పడతాయని అందువల్ల బయటకు రావడం పూర్తిగా తగ్గించుకోవాలని ఇరాన్ తన పౌరులకు విజ్ఞప్తిచేసింది. ఇరాన్‌రాజధాని టెహ్రాన్‌లో ఒక ఆయిల్ డిపో, చమురుశుద్ధికేంద్రంపై దాడులుజరిగినతర్వాత పారిశ్రామిక నగరం మొత్తం దట్టమైన పొగతో నిండిపోయింది. ఖరీదైన రాకెట్ల కంటే భారీ తూటాలు పేల్చే నౌకలే మేలని గతంకంటే 100 రెట్లు శక్తివంతమైన 10 యుద్ధనౌకలు తమకు ఉన్నాయని, వీటినిచూస్తే ఎవ్వరికైనా మాపై దాడిచేయాలన్న ఊహకూడా రాదని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పేర్కొన్నారు. ఇపుడు మరో పది భారీ నౌకలు వస్తున్నాయని, గతంకంటే 100 రెట్లు శక్తివంతంగా ఉంటాయన్నారు.

# రోజురోజుకు గరంగరం

>> పోయేవి. కానీ ప్రస్తుతం వారం, పది రోజులుగా ఉదయం 8 గంటల నుంచే సూర్యారావు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. ప్రస్తుతం మార్చి మెదటి వారంలోనే నిప్పుల వర్షం కురిపిస్తున్నాడు. భానుడి భగభగలు, తీవ్ర ఉక్కపోతతో ప్రజలు అల్లాడిపోతున్నారు. ఉదయం పది గంటల తర్వాత కూడా రోడ్లపైకి రావాలంటేనే భయపడే పరిస్థితి నెలకొంది. ఈ వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో రానున్న రెండు రోజులపాటు రాష్ట్రంలో వాతావరణం పొడిగా ఉంటుందని, సాధారణం కంటే 2 నుండి 3 డిగ్రీల మేర ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరిస్తోంది. రానున్న అయిదు రోజులపాటు రాష్ట్రంలో పగటి ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల మార్కును చేరుతాయని అంచనా వేసింది.

ముఖ్యంగా ఖమ్మం, మహబూబ్‌నగర్, నల్గొండ, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది. ఆకాశం పూర్తిగా నిర్మలంగా ఉండటం వల్ల సూర్యరశ్మి నేరుగా భూమిని తాకుతుందని మధ్యాహ్నం 12 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు తీవ్రమైన ఉక్కపోత, వేడి ఎక్కువగా ఉంటుందని హెచ్చరిస్తున్నారు. ఆ సమయంలో బయటకు రాకుండా ఉంటేనే మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.

ఎండల తీవ్రత నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, రక్షణ చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్నపిల్లలు, గర్భిణిలు వడదెబ్బ తగలకుండా జాగ్రత్తగా ఉండాలంటున్నారు. ఆహారం విషయంలోనూ ప్రత్యేక శ్రద్ధ వహించాలని తేలికపాటి త్వరగా జీర్ణమయ్యే ఆహారం తీసుకోవాలని పండ్ల రసాలకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలంటున్నారు.

దాహం వేయకపోయినా తరుచూ నీళ్లు తాగాలని తద్వారా శరీరం డీహైడ్రేషన్‌కు గురి కాదని అంటున్నారు. మసాలా ఫుడ్స్, మద్యం, సిగరెట్లకు దూరంగా ఉండాలని చెబుతున్నారు.

## వారం - వర్జ్యం

09-03-2026, సోమవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
ఫాల్గుణమాసం, ఉత్తరాయణం
శిశిర ఋతువు, కృష్ణపక్షం, పూర్వాభాద్ర కార్తె
షష్ఠి రా.11.28
విశాఖ సా.4.12
వర్జ్యం : రా.8.41-10.29
దు.మ.12.43-1.31,
2)మ.3.06-3.54
రాహుకాలం - ఉ.7.30-9.00

## వార్తాఫలం

**మేషం** : కుటుంబ వ్యవహారాలు కొంత చికాకు కలిగిస్తాయి. కోర్టువ్యవహారాలలో వాయిదాలు చోటు చేసుకుంటాయి.

**వృషభం:** విదేశీయాన యత్నాలు గతంలో కన్నా ఈరోజు ముమ్మరం చేస్తారు. ఆరోగ్యం నలతగా ఉంటుంది.

**మిథునం:** దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని నూతన అంశాలను కూడా పరిగణలోనికి తీసుకుంటారు.

**కర్కాటకం:**విదేశాలలోని మీ ఆప్తుల నుండి ఊరట కలిగించే వార్తలు వింటారు. ఆర్థిక పరమైన సమస్యలు కొంత వరకు తీరతాయి.

**సింహం:**గృహ విషయాలకు, అతిథి మర్యాదలకు ప్రాముఖ్యం ఇస్తారు. సమాజములో కీర్తిప్రతిష్ఠలు పెంపొందుతాయి.ధనలాభం.

**కన్య** : సంతాన విద్యా విషయములకు ఎక్కువ ప్రాధాన్యతనిస్తారు. అన్య భాషల యందు ఆసక్తి కలిగి ఉంటారు.

**తుల** : సులువుగా అవుతుందనుకున్న ఒక పనికూడా ఈ రోజు వాయిదా పడుతుంది. కుటుంబ సమస్యలను అధిగమించ గలుగుతారు.

**వృశ్చికం:**ప్రముఖులతో పరిచయాలు ఏర్పడతాయి. శ్రమకు తగిన ఫలితం దక్కుతుంది. విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు.

**ధనుస్సు:** అంతరంగిక వ్యవహారాలలో కొన్ని రహస్య ఒప్పందాలు కుదుర్చుకుంటారు. విదేశాలకు వెళ్లాలనుకునే కాంక్ష నెరవేరుతుంది.

**మకరం:**ఆత్మీయుల గురించి కొన్ని ముఖ్యమైన వివరాలు తెలుసుకుంటారు. భూ గృహాది విషయాలలోనూ ఆసక్తి చూపుతారు.

**కుంభం:** విద్యా, సాంస్కృతిక కార్యక్రమాలలో ప్రోత్సాహం లభిస్తుంది. చేస్తున్న వృత్తిలో మార్పులు చోటుచేసుకుంటాయి.

**మీనం:** బ్యాంకింగ్ వ్యవహారాలలో ప్రత్యేకమైన శ్రద్ధ కనబరచవలసి వుంటుంది. బంధువులనుండి లేఖలు అందుకుంటారు.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# కౌన్సిల్‌కు కొత్తరూపు

>> నిర్వహించారు. ఆ తర్వాత మండలి కమిటీ హాల్‌లో సమావేశం నిర్వహించారు. ఆధునీకరించిన మండలి భవనం అన్ని హంగులతో కూడి ఉండటంతో మంత్రులు, ఎమ్మెల్సీలు సంతృప్తి వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీల సౌకర్యార్థం వారి సీట్ల ముందు ట్యాబ్‌లు కూడా పొందుపరిచారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఆధునాతన డిజిటల్ టెక్నాలజీతో సీటింగ్ ఏర్పాట్లు చేశారు. సిఎం,చైర్మన్,డిప్యూటీ చైర్మన్‌లకు ఛాంబర్లు,సభ్యుల కోసం ప్రత్యేక లాంజ్‌లు సిద్ధం చేశారు. ఈనెల 16 నుంచి శాసనమండలి సభా నిర్వహణ ప్రారంభం కానుంది. ఈ భవనానికి 113 ఏళ్ల చరిత్ర ఉంది. ఆనాటి నిజాం పాలనా కాలంలో 1905లో ఈ భవన నిర్మాణం ప్రారంభమైంది. రాజస్థాన్, పర్షియన్ శైలిలో ఈ భవనాన్ని అద్భుత సుందరంగా నిర్మించారు. భవనం నిర్మాణంలో ఉండగానే 1911 ఆగస్టు 29న మీర్ మహబూబ్ అలీఖాన్ ఆకస్మికంగా మరణించారు. 1913లో భవన నిర్మాణం పూర్తై అందుబాటులోకి వచ్చింది. మీర్ మహబూబ్ అలీఖాన్ కోసం నిర్మించిన ఈ భవనాన్ని అప్పట్నుంచి టౌన్‌హాల్‌గా ఉపయోగిస్తూ వచ్చారు. టౌన్‌హాల్ పేరిట అప్పట్లోనే ప్రత్యేక స్టాంపును కూడా విడుదల చేశారు. మహబూబ్ అలీఖాన్ కుమారుడైన ఏడో నిజాం మీర్‌ఉస్మాన్ అలీఖాన్ హయాంలో ఈభవనం వినియోగంలోకి వచ్చింది. నిజాం రాజులు, అధికారులు వివిధ సభలు, సమావేశాలకు టౌన్‌హాల్‌ను ఉపయోగించేవారు. అప్పట్నుంచి ఈ భవనం హైదరాబాద్ చరిత్రలో ఓ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంది. 1985లో శాసనసభకు నూతన మందిరం నిర్మించేంత వరకు దీన్నే అసెంబ్లీ సమావేశాల కోసం వినియోగించారు. అసెంబ్లీ ప్రాంగణంలోని టౌన్‌హాల్ భవనం ముందు 1998లో జాతిపిత మహాత్మాగాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. 2005 డిసెంబర్ నుంచి ఏడాది పాటు నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్వర్ణోత్సవాలకూ పాత భవనమే వేదికగా నిలించింది. ఆ సందర్భంగా పాత భవనానికి మరమ్మతులు చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో 2007లో పెద్దల సభ, శాసనసభ పునరుద్ధరించిన అనంతరం ఈ భవనం మళ్లీ వినియోగంలోకి వచ్చింది. ఉభయసభల సభ్యులను ఉద్దేశించి గవర్నర్ చేసే ప్రసంగాల కోసం జరిగే ఉమ్మడి సమావేశాలకు టౌన్‌హాల్ వేదికైంది. ఈ సమయంలోనే రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ విగ్రహాన్ని కూడా టౌన్‌హాల్ ముందు ఏర్పాటు చేశారు. రెండు అంతస్తులతో ఉన్న ఈ భవనానికి 2013లో వందేళ్లు నిండాయి. 2014లో రాష్ట్ర విభజన అనంతరం టౌన్ హాల్ భవనాన్ని ఆంధ్రప్రదేశ్ శాసనసభకు కేటాయించారు. ఏపీశాసనసభా కార్యకలాపాలు ఆభవనంలోనే కొనసాగాయి. ఆంధ్రప్రదేశ్ కార్యాకలాపాలు విజయవాడకు తరలినప్పటి నుంచి భవనం ఖాళీగానే ఉంది. తెలంగాణ శాసనమండలి కార్యాకలాపాలు ఈ భవనంలోనే నిర్వహించాలని చాలా రోజులుగా కోరుతూ వస్తున్నారు. 2023 డిసెంబర్ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భవనాన్ని పరిశీలించి మండలి కార్యాకలాపాలు కొనసాగేలా అవసరమైన మరమ్మతులు చేయాలని ఆదేశించారు. అందుకు అనుగుణంగా ఆగాఖాన్ ఫౌండేషన్‌తో కలిసి రహదార్లు, భవనాల శాఖ మరమ్మతులు చేపట్టింది. ఇందుకోసం దాదాపు రూ.30 కోట్ల వ్యయంతో మరమ్మతులు చేశారు. వారసత్వ భవనం అయినందున పూర్తి స్థాయి జాగ్రత్తలు తీసుకొని, ఏడాదిన్నరగా పనులు చేస్తూ వచ్చారు. మరమ్మతులు పూర్తై పునః ప్రారంభోత్సవానికి సిద్ధం కాగా, సీఎం రేవంత్ రెడ్డి తన చేతుల మీదుగా ప్రారంభించారు. చారిత్రక భవనాన్ని పూర్తి స్థాయిలో పరిరక్షిస్తూనే శాసనసభ, మండలి కార్యకలాపాలు ఒకేచోట జరగాలన్న ఉద్దేశంతో మరమ్మతులు పూర్తి చేశారు. సీఎం ఛాంబర్, ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఛాంబర్, సెక్రటరీ ఆఫీస్, కౌన్సిల్ సెక్రటేరియట్, మీడియాకు హాల్ తయారు చేశారు. మరో 40,50 సంవత్సరాల వరకు భవనానికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. ఈ భవనం ముందు గాంధీ విగ్రహానికి మరోవైపు తెలంగాణ తల్లి విగ్రహాన్ని కూడా ఏర్పాటు చేస్తున్నారు. ఈనెల 16న తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ జరుగనుంది.

## హాకీ టోర్నమెంట్‌ను ప్రారంభించిన సిఎం రేవంత్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మార్చి8:** గచ్చిబౌలి జిహెచ్‌ఎంసీ బాలయోగి స్టేడియంలో ప్రతిష్ఠాత్మక మహిళల హాకీ ప్రపంచ కప్ 2026 క్వాలిఫైయర్స్ టోర్నమెంట్‌ను ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. భారత్‌కు ఉరుగ్వే జట్టుకు మధ్య మ్యాచ్‌ను ముఖ్యమంత్రి లాంఛనంగా ప్రారంభించారు. వచ్చే ఆగస్టులో బెల్జియం,నెదర్లాండ్స్‌లో జరగనున్న ప్రపంచ హాకీ కప్ కోసం క్వాలిఫైయర్స్ మ్యాచ్‌లు హైదరాబాద్‌లో జరుగుతున్నాయి. 8వ తేదీ నుంచి 14వ తేదీ వరకు జరగనున్న ఈ క్వాలిఫైయింగ్ మ్యాచ్‌ల టోర్నమెంట్‌లో 8 దేశాలు పాల్గొంటున్నాయి. గ్రూప్-ఏలో ఆస్ట్రియా,ఇంగ్లండ్,ఇటలీ,కొరియా దేశాలు., గ్రూప్-బిలో ఇండియా,స్కాట్లాండ్, ఉరుగ్వే, వేల్స్ జట్టు పాల్గొంటున్నాయి. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రితో పాటు మంత్రులు వాకిటి శ్రీహరి,పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, తెలంగాణ ప్రభుత్వ క్రీడా సలహాదారు ఏపీ జితేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి,ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.



న్యూఢిల్లీలో ఆదివారం జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి మంత్రి అన్నపూర్ణ దేవి, ఢిల్లీ సిఎం రేఖా గుప్తా తదితరులు

# మూసీ ప్రక్షాళన చేయొద్దా?

>> రాజకీయ పార్టీలు ఉన్నాయి అని విపక్షాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నగరాన్ని కాపాడుకోవడానికి, అంతర్జాయతీ స్థాయి కి తీసుకెళ్లడానికి, దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నుముక కావడానికి నాకు అందరి సహకారం కావాలి.. 13 న మూసీ రివర్ ఫ్రెంట్ పైన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వబోతున్నాం,డీపీఆర్ కూడా ప్రెజెంట్ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. అని వెల్లడించారు. గాంధీ విగ్రహం కట్టడానికి రూ.500కోట్లు అని ప్రతిపక్షాల నేతలు దుష్ప్రచారం చేస్తున్నారని ఆగ్రహించారు. గాంధీ విగ్రహానికి రూ.70కోట్లే ఖర్చవుతుందని స్పష్టం చేశారు. ఈ విగ్రహం దగ్గర విజ్ఞాన కేంద్రానికి రూ.100కోట్లు ఖర్చవుతుందని తెలిపారు.'ప్రతి సారి మహిళా దినోత్సవం సందర్భంగా వేలాది మంది ఆడబిడ్డలను పిలిచి రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలను వివరించేవాళ్లం.. రాష్ట్రపతి, ప్రధాని, లోక్‌సభ స్పీకర్, ముఖ్యమంత్రులు, పార్టీ అధ్యక్షులుగా దేశంలో అన్ని పదవులను కాంగ్రెస్ పార్టీ ఇచ్చింది.. ఉక్కు మహిళా సోనియా స్ఫూర్తితో తెలంగాణ ఏర్పడింది అని పేర్కొన్నారు. 'తెలంగాణలో మహిళలకు సరైన గుర్తింపు ఇవ్వాలని కలెక్టర్లు, ఎస్పీలుగా ఎక్కడ ఏ అవకాశం వచ్చిన మహిళా అధికారులను అవకాశం ఇస్తున్నాం..ముఖ్యమైన శాఖలకు మహిళలు బాధ్యత వహిస్తున్నారు..హైదరాబాద్ లాంటి కీలక జిల్లాకు కలెక్టర్ మహిళ ఉన్నారు.. ఎస్ఐబీలో మహిళా అధికారి 700 మంది మావోయిస్టులు సరెండర్ అయ్యేలా పనిచేశారు' అని పేర్కొన్నారు...అవకాశం ఇచ్చినప్పుడు వాళ్ల సమర్థత బయటకు వస్తుంది.. ఈ ప్రభుత్వం అవకాశం ఇస్తుంది.. సద్వినియోగం చేసుకున్న వాళ్లు ఉన్నత శిఖరాలకు ఎదుగుతారు అని చెప్పారు..ఆర్టీసీలో ఉచిత ప్రయాణం కల్పించాం..మహిళా సంఘాలు కార్పొరేట్ కంపెనీలతో పోటీ పడేలా 1000 బస్సులకు యజమానులను చేశాం.. స్వయం సహాయక సంఘాల మహిళలను 1000 మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్ల యజమానులను చేశాం.. స్వయం సహాయక సంఘాలు ఉత్పత్తి చేసే వస్తువుల విక్రయం కోసం అమెజాన్ తో ప్రభుత్వం ఒప్పందం చేయించింది అని చెప్పారు.మహిళల్లో ఉన్న నైపుణ్యాన్ని గుర్తించి అండగా ఉండటం కోసం హైటెక్ సిటీ పక్కనే రూ.1000 కోట్ల విలువైన మూడున్నర ఎకరాల స్థలంలో 150 స్టాల్స్ ఏర్పాటు చేశామని చెప్పారు. స్థానిక టాలెంట్ ను గ్లోబల్ టాలెంట్‌గా మార్చడం కోసం ప్రయత్నం చేస్తున్నాం.. మహిళల ఆర్థిక శక్తి పెరగడం వల్లనే అభివృద్ధి చెందిన దేశాలుగా మారాయి. మన దేశంలో మహిళలకు సరైన గుర్తింపు లేదు.. మహిళల్లోని నైపుణ్యాలను గుర్తించి ముందుకు తీసుకెళ్లే బాధ్యత సంస్థలపైన ఉందని చెప్పారు.. దేశ స్వాతంత్ర్య పోరాటంలో యంగ్ ఇండియా అనే పత్రికను మహాత్మాగాంధీ పత్రికను నడిపించారు.. నెహ్రు దేశ స్వాతంత్ర్య పోరాటంతో పాటు విధానాల కోసం నేషనల్ హెరాల్డ్ పత్రికను నడిపించారు.. సురవరం ప్రతాప్ రెడ్డి గోల్కొండ పత్రికను నడిపించారు.. గొప్ప పోరాటలను పత్రికల ద్వారా నడిపించడం ద్వారా శాంతియుతంగా యుద్ధాని గెలవవచ్చునని నిరూపించారని పేర్కొన్నారు.

మహిళల మాటలకు విశ్వసనీయత ఎక్కువగా ఉంటుందని చెప్పారు. 2047 నాటికి ట్రిలియన్ ఎకానమీ గా తెలంగాణ ను తీర్చిదిద్దాలని భావిస్తున్నాం.. తెలంగాణలో పెట్టుబడులు తీసుకురావడానికి అనేక అవకాశాలున్నాయి.. 200 బిలియన్ డాలర్ల ఎకానమీ గాఉన్న రాష్ట్రాన్ని 8 యేళ్లలో 1 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ గా మార్చడం కోసం పనిచేస్తున్నామని చెప్పారు. గ్లోబల్ సమ్మిట్ ను ఏర్పాటు చేసి అంతర్జాతీయ సంస్థలను ఆహ్వానించాం.. 1.30 కోటి జనాభా ఉన్న క్యూర్ ప్రాంతాన్ని సర్వీస్ సెక్టర్ గా మారుస్తామని పేర్కొన్నారు. పొలిటికల్ క్యాపిటల్‌గా ఉన్న ఢిల్లీ వాయు కాలుష్యం వల్ల ఇబ్బందిపడుతోంది.. ముంబయి కూడా అనేక సమస్యలతో ఇబ్బంది పడుతోంది.. చెన్నై లో వరదల సమస్య ఉందన్నారు. దేశంలోనే బెస్ట్ సిటీ హైదరాబాద్.. చంద్రబాబు, వైఎస్ రాజశేఖర్ రెడ్డి హైదరాబాద్ ను తీర్చిదిద్దారు.. సౌత్ కొరియా, న్యూయార్క్ ,టోక్యో తో హైదరాబాద్ పోటీ పడేలా ప్రయత్నం చేస్తున్నాం.. రెడ్, అరెంజ్ కేటగిరి పరిశ్రమలను అవుటర్ రింగ్ రోడ్డు బయటకు పంపిస్తామని చెప్పారు.. హైదరాబాద్ లో 2500 ఆర్టీసీ డీజీల్ బస్సులు నిత్యం కాలుష్యం వెదజిల్లుతున్నాయి.. డిసెంబర్ లోపల వాటిని జిల్లాలకు తరలించి ఈవీ బస్సులను తేబోతున్నామన్నారు. ఈవీ వెహికిల్ కు జీరో ట్యాక్స్ అమలు చేస్తున్నాం.. త్వరలో కాలేజీ విద్యార్థినులకు ఈవీ స్కూటీలు అందించబోతున్నాం.. అంతర్జాతీయ స్థాయికి నగరాన్ని తీర్చిదిద్దాల్సిన అవసరం ఉంది.. హైదరాబాద్ ఇప్పుడు ఆరెంజ్ కేటగిరిలో ఉంది.. ఇలాగే వదిలేస్తే రెడ్ జోన్ లోకి వెళ్తుందని చెప్పారు. గతంలో ప్రగతిభవన్ గడీ లోకి మహిళా జర్నలిస్టులు ఎంత మంది అడుగుపెట్టారు..ఇప్పుడు అంతా వస్తున్నారని పేర్కొన్నారు. ఇది ప్రజా వేదిక తెలంగాణ ప్రజలను నిషేధిస్తే, వాళ్లను మనను నిషేధిస్తారు.. గతంలో ఉన్నాయన ఉత్సవ విగ్రహంలా అప్పుడప్పుడు కనిపించేవాడు, నేను మాత్రం రోజూ కనిపిస్తూ రాష్ట్రంలో మహిళలకు రక్షణ కల్పించడంతో పాటు వారి ఉన్నతి స్థాయి కోసం అవకాశాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. సోషల్ మీడియాలో ప్రసారం అయ్యే తప్పుడు కథనాలపైన ఫిర్యాదు చేయడానికి ఒక వేదిక ఏర్పాటు చేస్తామని. జర్నలిస్టుల ముసుగులో కొందరు చేసే పనులను అరికట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఫీల్డ్ జర్నలిస్టులకు, డెస్క్ జర్నలిస్టులకు తేడా లేదు..జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలపైన త్వరలోనే మంచి వార్త చెపుతా.. చట్టం వల్ల ఇబ్బంది లేకుండా ఇళ్ల స్థలాలపైన నిర్ణయం తీసుకుంటాం..ఫ్యూచర్ సీటీలో జర్నలిస్టులకు మంచి కాలనీని డిజైన్ చేద్దామని పేర్కొన్నారు.

# భారీ మార్పులు!

>> సర్కార్ అడ్మినిస్ట్రేషన్ సమస్యలు, న్యాయపరమైన చిక్కులు తొలగిపోయాక ఎన్నికలు నిర్వహించేందుకు సిద్ధమవుతోంది. దీంతో పార్టీ నాయకత్వం, సంస్థాగత నిర్మాణంలో వ్యూహాత్మక మార్పులు చేయడం ద్వారా మూడు కార్పొరేషన్ల పరిధిలో పార్టీ బలోపేతం చేసే దిశగా కాషాయదండు అడుగులు పడుతున్నాయి.

ప్రస్తుతం బిజెపి హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలను సంస్థాగతపరంగా ఎనిమిది జిల్లాలుగా విభజించింది. సంస్థాగత పరంగా ఆ ఎనిమిది జిల్లాలకు ఎనిమిది మంది అధ్యక్షులను నియమించింది. హైదరాబాద్‌లో బిజెపిని మహంకాళి సికింద్రాబాద్, హైదరాబాద్ సెంట్రల్, గోల్కొండ, భాగ్యనగర్‌గా ఉమ్మడి రంగారెడ్డిలో రంగారెడ్డిరూరల్, రంగారెడ్డి అర్బన్, మేడ్చల్‌రూరల్, మేడ్చల్ అర్బన్‌గా విభజించారు. దీంతో ఏదైనా అంశంపై పోరాటం చేయాల్సి వస్తే ఇబ్బందులు ఎదురవుతోందని గ్రేటర్ నేతలు వాపోతున్నారు.

ఒక అసెంబ్లీ నియోజకవర్గం రెండు మూడు జిల్లాల్లో విస్తరించి ఉండటంతో ఆయా నాయకులు ఏ కలెక్టరేట్‌కు వెళ్లి ఎక్కడ ఉద్యమం చేయాలన్న దానిపై స్పష్టత రావడం లేదని చెబుతున్నారు. రంగారెడ్డి రూరల్ జిల్లా శేరిలింగంపల్లి మొదలుకొని ఎల్బీనగర్ వరకు ఉన్న నేపథ్యంలో మధ్యలో పార్టీ పరంగా గోల్కొండ జిల్లా , భాగ్యనగర్ జిల్లా కూడా ఉన్నాయి. దీంతో పార్టీ సమావేశాలు ఉన్న సమయంలో ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వెళ్లడానికి పడుతున్నామని గ్రేటర్ కమలం నేతలు పేర్కొంటున్నారు.

ఈ నాయకత్వ సమస్యలకు తెరదించేందుకు కాషాయదళం కొత్త కార్యచరణ అమలుకు సిద్ధమవుతోంది. హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డిని ఏ విధంగా అయితే రాష్ట్ర ప్రభుత్వం మూడు కార్పొరేషన్లుగా విడగొట్టిందో అదే విధంగా బిజెపిలోనూ సంస్థాగత మార్పులు చేయాలనిపార్టీ నాయకత్వం భావిస్తోంది. ఎనిమిది జిల్లాలను సంస్థాగతంగా విలీనం చేసి మూడు కార్పొరేషన్లుగా విభజించాలని యోచిస్తున్నట్లుగా సమాచారం. జిహెచ్ఎంసి, మల్కాజ్ గిరి, సైబరాబాద్ కార్పొరేషన్లకు అధ్యక్షులను పెట్టాలనే ఆలోచనలో ఉన్నట్టు తెలుస్తుంది. ఈ మూడు కార్పొరేషన్లకు ఎనిమిది బిజెపి ఎంపీల్లో ముగ్గురికి పూర్తిగా ఇంచార్జ్ బాధ్యతలు ఇస్తారని నేతలు చర్చించుకుంటున్నారు. కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండిసంజయ్ మినహా మిగిలిన ఆరుగురు ఎంపిల్లో రఘునందన్, ఈటల రాజేందర్, ధర్మపురి అరవింద్‌ను కార్పొరేషన్ ఇంచార్జ్‌గా బాధ్యతలు అప్పగించే అవకాశం లేకపోలేదన్న చర్చ కూడా బిజెపి వర్గాల్లో జోరుగా సాగుతోంది. మూడు కార్పొరేషన్ల వారిగా పార్టీలో సంస్థాగతంగా విభజన చేస్తే ఆయా కార్పొరేషన్ల పరిధిలోని సమస్యలపై ఆ ప్రాంత నాయకులు కార్యక్రమాలు చేసేందుకు అవకాశం ఉంటుందని ముఖ్యనేతలు చెబుతున్నారు.

సంస్థాగత సమావేశాలు నిర్వహించుకోవడానికి వీలుగా కార్పొరేషన్ అధ్యక్షులు, మిగతా పోస్టులు ఉపయోగ పడతాయని గుర్తు చేస్తున్నారు. ఇలా అటు పార్టీ అధ్యక్షులు, ఇటు ఇంచార్జ్‌ల నియామకంతో పార్టీని గ్రేటర్‌లో బలోపేతం చేసి కార్పొరేషన్లలో పాగా వేయాలనేది కమలం పార్టీ పెద్దల ఆలోచనగా చెబుతున్నారు.

## టీమ్ ఇండియాకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందనలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మార్చి8:** టీ 20 వరల్డ్ కప్ ఫైనల్‌లో అద్భుత విజయం సాధించి.. వరల్డ్ ఛాంపియన్ గా నిలిచిన భారత క్రికెట్ జట్టుకు తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. అహ్మదాబాద్‌లో ఈ రోజు భారత్ -న్యూజిలాండ్ మధ్య జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో టీమ్ ఇండియా అద్భుతమైన ఆటతీరుతో విజయం సాధించింది.

ఈ విజయం దేశ ప్రజలందరికీ గర్వకారణమని సీఎం అన్నారు.మ్యాచ్ ఆరంభం నుంచి చివరి వరకు భారత జట్టు సమన్వయంతో, ధైర్యసాహసాలతో ఆడుతూ అత్యుత్తమ ఆటతీరును ప్రదర్శించిందని ప్రశంసించారు. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ అన్నింటిలోనూ టీమ్ ఇండియా ఆటగాళ్ల ఆల్‌రౌండ్ ప్రతిభను ప్రదర్శించి యువతకు స్ఫూర్తిదాయకంగా నిలిచారని అభినందించారు.టీమ్ ఇండియా సాధించిన విజయం దేశ క్రీడా రంగానికి మరింత గౌరవం తెచ్చిందన్నారు. టీమ్ ఇండియా కెప్టెన్ సూర్యకుమార్‌తో పాటు టీమ్ సభ్యులందరికీ ఆయన ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలియజేశారు,

**మహేశ్‌కుమార్‌గౌడ్ అభినందనలు**

టీ20 వరల్డ్ కప్ 2026ను గెలిచిన కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ నాయకత్వంలోని భారత జట్టుకు టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ గారు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ప్రపంచ క్రికెట్ వేదికపై భారత జట్టు అద్భుత ప్రతిభను కనబరిచి టైటిల్‌ను కైవసం చేసుకోవడం దేశ ప్రజలందరికీ గర్వకారణమని అన్నారు... టోర్నమెంట్ మొత్తం భారత జట్టు సమిష్టి కృషి, పట్టుదల, అద్భుత ఆటతీరుతో అభిమానులను అలరించిందని ఆయన పేర్కొన్నారు.

# ఎపి జలదోపిడిని అడ్డుకోండి

>> మిగిలి ఉన్న నీటి నిల్వలు పూర్తిగా తమ రాష్ట్ర వాటానేనని బోర్డుకు స్పష్టం చేసింది. తమ రాష్ట్ర సాగు, తాగునీటి అవసరాల కోసం ఆ నిల్వలను పరిరక్షించాలని ఇప్పటికే పలుమార్లు లేఖలు రాసింది. ప్రస్తుత నీటి సంవత్సరం 2025-26లో గత నెల 19 నాటికి ఏపీ 697.7 టీఎంసీల (77.84శాతం)ను తరలించుకోగా, తాము కేవలం 198.64 టీఎంసీల (22.16శాతం)ను మాత్రమే తరలించుకున్నట్టు స్పష్టం చేసింది. అప్పటికే ఏపీ తన వాటాకి మించి 28.64 టీఎంసీలను వాడుకున్నట్టు బోర్డుకు తెలంగాణ తెలిపింది. ఈ నేపథ్యంలో శ్రీశైలం, సాగర్ నుంచి తాము 157.239 టీఎంసీలను వాడుకోవడానికి తెలంగాణకు హక్కులు కలిగి ఉందని తేల్చి చెప్పింది. ప్రస్తుతం శ్రీశైలంలో 84 టీఎంసీలు, నాగార్జునసాగర్లో 185 టీఎంసీల నిల్వలు ఉన్నట్టు తెలుస్తోంది.




# నిద్రిస్తున్న స్కూలు పిల్లలపై రాడ్లు, కత్తులతో దాడి

**బెంగళూరు, మార్చి 8:** కర్ణాటకలో దారుణం చోటు చేసుకుంది. ప్రైవేట్ స్కూలు హాస్టల్‌లో 9వ తరగతి విద్యార్థి ఘాతుకానికి ఒడిగట్టాడు. నిద్రిస్తున్న విద్యార్థులపై రాడ్డు, కత్తితో దాడి చేశాడు. అడ్డు వచ్చిన వార్డెన్‌పై కూడా దాడికి పాల్పడ్డాడు. ఈ దాడిలో ఓ విద్యార్థి ప్రాణాలు కోల్పోగా ఏడుగురు విద్యార్థులు తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల్లోకి వెళితే బళ్లారిలోని ఓ ప్రైవేట్ స్కూలు హాస్టల్‌లో నిద్రిస్తున్న విద్యార్థులపై 9వ తరగతి విద్యార్థి రాడ్డు, కత్తితో దాడి చేశాడు. అడ్డు వచ్చిన హాస్టల్ వార్డెన్‌పై కూడా దాడి చేశాడు.

దాడి తర్వాత అక్కడినుంచి తప్పించుకుని పారిపోయాడు. ఈ దాడిలో ఓ బాలుడు చనిపోగా ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడ్డ వారిని బళ్లారిలోని విమ్స్ ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఆస్పత్రికి చేరుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. అన్ని కోణాల్లో కేసును దర్యాప్తు చేస్తున్నారు.

నిందితుడు ఒక్కడే ఇంత మందిపై ఎలా దాడి చేశాడు ఎవరైనా అతడికి సాయం చేశారా అన్న కోణాల్లో విచారణ చేస్తున్నారు. నిందితుడికి మానసిక రోగాలు ఏవైనా ఉన్నాయా లేక డ్రగ్స్ మత్తులో తోటి విద్యార్థులపై ఇలా దాడి చేశాడా అన్న కోణాలలో కూడా విచారణ సాగిస్తున్నారు. దాడికి దారి తీసిన కారణాల కోసం అన్వేషిస్తున్నారు. దాడిలో మృతి చెందిన బాలుడిని కర్నూలుకు చెందిన విద్యార్థిగా గుర్తించారు. బాలుడి తల్లిదండ్రులు స్కూలు యాజమాన్యంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వారి నిర్లక్ష్యం కారణంగానే తమ బిడ్డ ప్రాణాలు కోల్పోయాడని ఆరోపిస్తున్నారు. నిందితుడికి కత్తి ఎక్కడినుంచి వచ్చిందని ప్రశ్నిస్తున్నారు.


# గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మతో సిఎం రేవంత్‌రెడ్డి భేటీ



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మార్చి 8:** మహారాష్ట్ర గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించబోతున్న తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మను ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. గవర్నర్‌గా దాదాపు రెండేళ్ల పాటు తెలంగాణతో ఏర్పడిన అనుబంధం, రాష్ట్రానికి అందించిన సేవలను ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గుర్తుచేశారు. ఈశాన్య రాష్ట్రాలతో తెలంగాణకు మధ్య కళలు, సంస్కృతి, సాంకేతిక పరిజ్ఞానం, క్రీడలు, ఆవిష్కరణల వంటి అంశాల్లో నిరంతర సహకారం, పరస్పర అవగాహన కోసం 'తెలంగాణ - నార్త్ ఈస్ట్ ఇండియా కనెక్ట్' పేరుతో జిష్ణు దేవ్ వర్మ చేసిన కృషి అభినందనీయమని పేర్కొన్నారు.

తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలు వీరిద్దరి మధ్య చర్చకు వచ్చినట్లు తెలుస్తోంది. త్రిపురకు చెందిన జిష్ణుదేవ్ వర్మ.. 2024, జులై 27న తెలంగాణ గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టారు. అయితే తాజాగా పలు రాష్ట్రాల గవర్నర్లను కేంద్రం బదిలీ చేసింది. ఈ నేపథ్యంలో జిష్ణుదేవ్ వర్మ మహారాష్ట్ర గవర్నర్‌గా బదిలీ అయ్యారు. బదిలీ పైన వెళ్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మతో జరిగిన భేటీలో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి కూడా పాల్గొన్నారు.

# జెడియులో చేరిన బీహార్ సిఎం నితీశ్‌కుమార్ తనయుడు



**పాట్నా, మార్చి 8:** బీహార్ రాజకీయాల్లో ఆదివారం కీలక పరిణామం చోటుచేసుకుంది. ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ తనయుడు నిశాంత్‌కుమార్ ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. ఆదివారం మధ్యాహ్నం పట్నాలోని జేడీయూ కేంద్ర కార్యాలయంలో ఆయన అధికారికంగా పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ కార్యక్రమానికి జేడీయూ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ సంజయ్ కుమార్ ఝా, కేంద్ర మంత్రి లలన్ సింగ్, మంత్రులు విజయ్ కుమార్ చౌదరి, బిజేంద్ర ప్రసాద్ యాదవ్, రాష్ట్ర అధ్యక్షుడు ఉమేశ్ సింగ్ కుష్వాహ తదితర సీనియర్ నేతలు హాజరయ్యారు. పార్టీలో చేరిన సందర్భంగా సంజయ్ కుమార్ ఝా నిశాంత్‌కు పార్టీ టోపీ, జ్ఞాపికను అందించగా, కేంద్ర మంత్రి లలన్ సింగ్ సంప్రదాయ తలపాగా చుట్టి ఘనంగా ఆహ్వానించారు. అనంతరం సీనియర్ నేతల కాళ్లకు నమస్కరించి నిశాంత్ ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా నిశాంత్ కుమార్ మాట్లాడుతూ తన తండ్రి మార్గదర్శకత్వంలోనే పనిచేస్తానని స్పష్టం చేశారు. ఈరోజు నేను పార్టీలో చేరడానికి వచ్చాను. మా నాన్న రాజ్యసభకు వెళ్లాలని నిర్ణయించుకున్నారు. అది ఆయన నిర్ణయం. ఆయన సూచనల మేరకు బీహార్ కోసం మేం పనిచేస్తామని పేర్కొన్నారు. నితీశ్ కుమార్ రాష్ట్ర అభివృద్ధికి ఎంతో కృషి చేశారని, ఆ వారసత్వాన్ని ముందుకు తీసుకెళతానని చెప్పారు. కార్యకర్తలు పార్టీపై ఇదే ఉత్సాహం, నమ్మకం కొనసాగించాలని కోరారు.

## రాష్ట్ర సివిల్ సర్వీసెస్ అధికారులకు
# ఐఎఎస్ హోదా

**హైదరాబాద్, మార్చి 8, ప్రభాతవార్త:** రాష్ట్రానికి చెందిన స్టేట్ సివిల్ సర్వీస్ (ఎస్‌సీఎస్) అధికారులు పలువురికి కేంద్ర ప్రభుత్వం ఐఏఎస్ హోదా కల్పించింది. వారి సీనియారిటీ, కేటాయింపు సంవత్సరాలను ఖరారు చేస్తూ కేంద్ర సిబ్బంది, శిక్షణ వ్యవహారాల శాఖ కీలక ఉత్తర్వులు జారీ చేసింది. 2022, 2023, 2024 సెలెక్ట్ లిస్టుల ఆధారంగా ఉద్యోగోన్నతి పొందిన అధికారుల సీనియారిటీని ఐఏఎస్ (సీనియారిటీ క్రమబద్ధీకరణ) రూల్స్ 1987 ప్రకారం నిర్ణయించింది. 2022 సెలెక్ట్ లిస్టులో డీ మధుసూదన్ నాయక్, ఎం సత్యవాణి, జే భవానీ శంకర్, జీ లింగ్యా నాయక్ సహా మొత్తం 11 మంది అధికారులకు 2019ని కేటాయింపు సంవత్సరంగా ఖరారు చేసింది. 2023 సెలెక్ట్ లిస్టులో అబ్దుల్ హమీద్, బీ వెంకటేశ్వర్లు, వైపీ గణేశ్‌కు 2020ని కేటాయింపు సంవత్సరంగా నిర్ణయించింది. అలాగే 2024 సెలెక్ట్ లిస్టులో ఎన్ ఖీమ్యా నాయక్, కే గంగాధర్‌కు 2021ని అలాట్‌మెంట్ ఇయర్‌గా కేటాయించింది. సమాచారం నిమిత్తం ఈ ఉత్తర్వుల ప్రతిని తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి పంపింది.

# అమెరికాను కుదిపేస్తున్న 'హెచ్‌ఎంపివి'

## కరోనా తరహా వైరస్ వంటిదేనంటున్న నిపుణులు

**శాన్‌ఫ్రాన్సిస్కో, మార్చి 8:** అమెరికా పశ్చిమ తీర ప్రాంతాల్లో అందులోనూ ఉత్తర కాలిఫోర్నియాలో హ్యూమన్ మెటాన్యుమో వైరస్ (హెచ్ఎంపీవీ) అత్యంత వేగంగా వ్యాపిస్తోంది. శాన్ ఫ్రాన్సిస్కో, మారిన్, వల్లెజో, నాపా, నోవాటో, శాంటారోసా, సాక్రమెంటో, డేవిస్ వంటి ప్రధాన నగరాల్లో ఈ వైరస్ ఉధృతి ఎక్కువగా ఉన్నట్లు వేస్ట్‌వాటర్ స్కాన్ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. హ్యూమన్ మెటాన్యుమోవైరస్ అనేది శ్వాసకోశ వ్యవస్థపై దాడి చేసే ఒక సింగిల్ స్ట్రాండెడ్ ఆర్ఎన్ఏ వైరస్. దీనిని మొదటిసారిగా 2001లో గుర్తించారు. ఇది మనకు తెలిసిన ఆర్ఎస్‌వీ వైరస్ కుటుంబానికే చెందింది. ఈ ఏడాది జనవరిలో గరిష్ట స్థాయికి చేరిన ఈ కేసులు మార్చి నెలలో కూడా భారీగా నమోదు అయ్యాయి. క్లీవ్‌ల్యాండ్ క్లినిక్ సమాచారం ప్రకారం ఈ వైరస్ సోకిన వారిలో సాధారణ జలుబుకు ఉండే లక్షణాలే కనిపిస్తాయి. ముఖ్యంగా తీవ్రమైన దగ్గు, జ్వరం, ముక్కు కారడం లేదా ముక్కు దిబ్బడ వంటివి వస్తాయి. అలాగే గొంతు నొప్పి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, ఒంటిపై దద్దుర్లు రావడం వంటి లక్షణాలు కూడా కనిపిస్తాయి.



చాలా మందిలో ఈ లక్షణాలు స్వల్పంగానే ఉన్నప్పటికీ రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్నవారు, చిన్న పిల్లలు, వృద్ధుల్లో ఇది తీవ్రమైన శ్వాసకోశ ఇబ్బందులకు దారితీస్తుంది. ప్రపంచవ్యాప్తంగా ఏటా సుమారు 6.5 లక్షల మంది ఈ వైరస్ కారణంగా ఆసుపత్రి పాలవుతున్నారని ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ మార్క్ సీగల్ తెలిపారు. దురదృష్టవశాత్తూ ఈ మెటాన్యుమోవైరస్‌ను నేరుగా నయం చేసే యాంటీ వైరల్ మందులు గానీ, నివారించే టీకాలు గానీ ప్రస్తుతం అందుబాటులో లేవు. బాధితులకు కేవలం సపోర్టివ్ కేర్ మాత్రమే అందించగలరు. పరిస్థితి విషమించకుండా ఉండేందుకు ఆక్సిజన్ థెరపీ, ఐవీ ఫ్లూయిడ్స్, కార్టికోస్టెరాయిడ్స్ వంటి చికిత్సలను వైద్యులు ఉపయోగిస్తున్నారు. ఈ వైరస్ ప్రధానంగా సోకిన వ్యక్తి తుమ్మినప్పుడు, దగ్గినప్పుడు వచ్చే తుంపర్ల ద్వారా లేదా వైరస్ ఉన్న ఉపరితలాలను తాకినప్పుడు వ్యాపిస్తుంది.

# సారీ మమ్మీ.. ఐ లవ్ యు డాడీ

## విద్యార్థి ప్రాణం తీసిన పరీక్షల టెన్షన్, మార్కుల భయం

**మందమర్రి, మార్చి 8, ప్రభాతవార్త:** పరీక్షల ఒత్తిడిని తట్టుకోలేక పదో తరగతి చదువుతున్న ఓ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న విషాద ఘటన మంచిర్యాల జిల్లా మందమర్రి పట్టణంలో చోటుచేసుకుంది. ఈ సంఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం మందమర్రి పట్టణంలోని సీఎస్పీ రోడ్డుకు చెందిన క్యాతన సత్యనారాయణ కుమారుడు క్యాతన్ తనై (16) స్థానిక సింగరేణి హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్నాడు. ప్రస్తుతం వార్షిక పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో తీవ్ర మానసిక ఒత్తిడికి లోనైనట్లు తెలుస్తోంది. ఎంత చదివినా మంచి మార్కులు రావేమోనన్న భయం, కేవలం పాస్ మార్కులు మాత్రమే వస్తాయేమోనన్న ఆందోళనతో గత కొద్ది రోజులుగా తల్లిదండ్రుల వద్ద తన ఆవేదన వ్యక్తం చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆదివారం తెల్లవారుజామున సుమారు 5.48 గంటల సమయంలో తండ్రి సత్యనారాయణ తనైను నిద్రలేపి చదువుకోవాలని చెప్పి వెళ్లినట్లు తెలిపారు. అనంతరం ఉదయం సుమారు 6.45 గంటల సమయంలో కుటుంబ సభ్యులు బయటకు వచ్చి చూడగా ఇంటి ముందు ఉన్న రేకుల షెడ్డు వద్ద ఇనుప పైపుకు నైలాన్ తాడుతో ఉరి వేసుకుని ఉన్నట్లు గుర్తించారు. వెంటనే కిందకు దించి చూడగా అప్పటికే తనై మృతి చెందినట్లు తెలిసింది.

సంఘటన స్థలంలో పోలీసులు ఒక సూసైడ్ నోట్‌ను స్వాధీనం చేసుకున్నారు. అందులో 'సారీ మమ్మీ, ఐ లవ్ యు డాడీ, సారీ శ్రీనిధి' అని రాసి ఉన్నట్లు తెలిపారు. చదువు విషయంలో ఎదురైన మానసిక ఒత్తిడే తన కుమారుడు ఈ అఘాయిత్యానికి పాల్పడటానికి కారణమై ఉంటుందని తండ్రి సత్యనారాయణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతుని తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటనతో కుటుంబ సభ్యులు, బంధువులు, స్థానికులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు.

# మద్యం మత్తు.. ప్రమాదంలో ముగ్గురి మృతి

## అమెరికాకు ఉడాయించిన నిందితుడిపై రెడ్‌కార్నర్ నోటీసు

**హైదరాబాద్ మార్చి 8, ప్రభాతవార్త:** పదేళ్ల క్రితం పంజాగుట్టలో మద్యం మత్తులో వాహనం నడిపి ముగ్గురి మృతికి కారణమైన కేసులో నిందితుడు గా వున్న వ్యక్తి అమెరికాకు ఉడాయించగా అతని కోసం పోలీసులు రెడ్ కార్నర్ నోటీసు జారీ చేశారు. వివరాలు ఇలావున్నాయి. 2016 జూలై ఒక టవ తేదీన ఉదయం వేళ పంజాగుట్ట స్మశానవాటిక మార్గంలో వున్న ఫ్లై ఓవర్‌పై వేగంగా వచ్చిన కారు కింద మార్గంలో వెళుతున్న మరో కారుపై ప డింది. ఈ ఘటనలో తొమ్మిదేళ్ల బాలిక రమ్యతో పాటు ఆ బాలిక తాత మధుసూద నాచారి, రాజేష్ అనే వ్యక్తి మరణించారు. వీరు ప్రయాణిస్తున్న కారుపై పడ్డ కారులో వున్న శ్రావిల్, విష్ణు వినీత్‌లు మద్యం మత్తులో నడుపుతూ అదుపుతప్పి కింది మార్గంలో వెళుతున్న కారుపై పడిపోయారు. దీ నిపై పంజాగుట్ట పోలీసులు కేసు నమోదు చేసి నిందితులను అరెస్టు చేసి జైలుకు తరలించగా బెయిలుపై విడుద లయ్యారు. ఈ కేసు ప్రస్తుతం నాంపల్లి కోర్టులో విచారణ జరుగుతుంది. ఈ కేసు విచారణ ఈ నెల 17న వుండ డంతో నిందితుడికి సమన్లు జారీ చేసేందుకు పోలీసులు అత ని ఇంటికి వెళ్లగా అతను అమెరికా వెళ్లినట్లు తెలియడంతో షాక్‌కు గురయ్యారు. ముగ్గురి మృతికి కారణమైన తీవ్రమైన కేసులో నిందితుడుగా వున్న వ్యక్తికి ఎలా పాస్‌పోర్టు లభించిందనేది తెలియరావడం లేదు. దీనిపై పోలీసు అధికారులు విచారణ చేబట్టారు. మరోవైపు విష్ణు వినీత్‌ను భారత్‌కు ర ప్పించేందుకు పోలీసులు రెడ్‌కార్నర్ నోటీసులు జారీ చేశారు.

# ఎన్డీయె కూటమిలో చేరండి

## టివికెకు బిజెపి ఆఫర్

**చెన్నై, మార్చి 8:** తమిళనాడులో అసెంబ్లీ ఎన్నికల వేడి అప్పుడే మొదలైంది. రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని నటుడు విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీ అన్నాడీఎంకే సారథ్యంలోని ఎన్డీయే కూటమిలో చేరాలని బీజేపీ ఆహ్వానించింది. డీఎంకే వ్యతిరేక ఓట్లు చీలిపోకుండా ఉండేందుకే ఈ ప్రతిపాదన చేస్తున్నామని స్పష్టం చేసింది. రాష్ట్ర బీజేపీ అధికార ప్రతినిధి ఏఎన్ఎస్ ప్రసాద్



ప్రకటన విడుదలచేస్తూ ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ నేతృత్వంలోని డీఎంకే ప్రభుత్వంపై ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోందని ఆయన అన్నారు. శాంతిభద్రతల వైఫల్యం, నిత్యావసరాల ధరల పెరుగుదల, అవినీతి ఆరోపణల వంటి అంశాలతో ప్రజలు విసిగిపోయారని పేర్కొన్నారు. ఈ వ్యతిరేకతను గమనించే డీఎంకే తన కూటమిని విస్తరించేందుకు ప్రయత్నిస్తోందని ఆయన ఆరోపించారు. ఇటీవల డీఎండీకేకు రాజ్యసభ సీటు కేటాయించడంపై డీఎంకే కూటమిలోని వీసీకే, వామపక్షాల వంటి పాత మిత్రపక్షాలు అసంతృప్తితో ఉన్నాయని ప్రసాద్ తెలిపారు. ఈ నేపథ్యంలో, డీఎంకేకు వ్యతిరేకంగా ఉన్న రాజకీయ శక్తులన్నీ ఏకం కావాల్సిన అవసరం ఉందన్నారు. విపక్షాలు విడివిడిగా పోటీ చేస్తే అది అధికార పార్టీకే మేలు చేస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు.

# బాబు పాలనలో మహిళల జీవితాలు చీకట్లోకి: సజ్జల

**విజయవాడ, మార్చి 8, ప్రభాతవార్త ప్రతినిధి:** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చంద్రబాబు పాలనలో మహిళల జీవితాలు చీకట్లోకి వెళ్లిపోయాయని, రామకృష్ణారెడ్డి వ్యాఖ్యానించారు. మళ్లీ మహిళల జీవితాల్లో వెలుగులు రావాలంటే వైయస్ జగన్ సిఎంని చేసుకుంటేనే సాధ్యమన్నారు. తాడేపల్లిలోని వైయస్సార్‌సిపి కేంద్ర కార్యాల యంలో జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. వైయస్ జగన్ పాలనలో మహిళలను రాజకీయం గా, ఆర్థికంగా సామాజికంగా అండగా నిలబడ్డామన్నారు. రిజర్వేషన్లతో సంబంధం లేకుండా కీలకమైన పదవులు మహిళలకు ఇచ్చి గౌరవించామని చెప్పారు.

కానీ చంద్రబాబు సీఎం అయ్యాక మహిళల మానప్రాణాలకే రక్షణ లేకుండా పోయిందని, ఆరేళ్ల చిన్నారి నుంచి 60 ఏళ్ల మహిళ వరకు ఉన్మాదులు మద్యం మత్తులో అత్యాచారాలు చేసి చంపేస్తున్నారని మండిపడ్డారు. అయినా మంత్రులుగా ఉన్న అనిత, సవిత, సంధ్యా రాణిలు ఏమాత్రం స్పందించక పోవడం రాష్ట్ర మహిళల దౌర్భాగ్యమని మాజీ మంత్రి ఆర్కే రోజా ఆగ్రహం వ్యక్తం చేశారు. సుగాలి ప్రీతి పేరును వాడుకుని, ఆ బాలిక తల్లి కన్నీళ్లతో ఎమ్మెల్యేగా గెలిచిన పవన్ కళ్యాణ్ ఎన్నో అబద్ధాలతో మహిళలను మోసగించాడని ధ్వజమెత్తారు. వైయస్ జగన్ గారి నాయకత్వంలో మహిళలంతా ఒక్కటై ఉద్యమిస్తే ఈ అరాచకాలకు చరమగీతం పాడగలమని ధీమా వ్యక్తం చేశారు.

## ఎస్వీ అన్న ప్రసాదం ట్రస్ట్‌కి రూ.70 లక్షలు విరాళం

**తిరుమల, మార్చి 8, ప్రభాతవార్త ప్రతినిధి:** విశాఖపట్నంకు చెందిన ఎన్ ఆర్‌ఐలు త్రిపురనేని వెంకటరత్నం, మాధురి దంపతులు ఆదివారం టిటిడి వేంకటేశ్వర అన్న ప్రసాదం ట్రస్టుకు 50 లక్షలు రూపాయలు విరాళంగా అందించారు. ఆయన కుమారులు త్రిపురనేని విజయ్, త్రిపురనేని వినయ్ లు కూడా వేంకటేశ్వర అన్న ప్రసాదం ట్రస్టుకు 20 లక్షలు విరాళంగా అందించారు. దాతల తరపున ప్రతినిధి పొట్లూరి నరసింహారావు తిరుమల లో అదనపు ఇఒ క్యాంపు కార్యాలయంలో అదనపు చిరుమామిళ్ల వెంకయ్య చౌదరికి విరాళం డిడి అందజేశారు.

## నేడు డయల్ యువర్ ఎస్పిడిసిఎల్ సిఎండి

**తిరుమల, మార్చి 8, ప్రభాతవార్త ప్రతినిధి:** విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం మెట్‌ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 12:30 గంటల వరకు డయల్ యువర్ సిఎండి కార్యక్రమాన్ని ఏపిఎస్పిడిసిఎల్ నిర్వహించనుంది. ప్రతి సోమవారం నిర్వహించే డయల్ యువర్ సిఎండి కార్యక్రమం ద్వారా తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, కడప, అన్నమయ్య, కర్నూలు, నంద్యాల, అబనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల నుంచి వినియోగదారులు మొబైల్ నంబరు: 8977716661కు కాల్ చేసి తమ విద్యుత్ సమస్యలను సిఎండి దృష్టికి తీసుకురావచ్చు. ఈ కార్యక్రమం ద్వారా తమ విద్యుత్ సమస్యలను సిఎండి దృష్టికి తీసుకురాదలచిన వినియోగదారులు తమ వద్ద విద్యుత్ సర్వీసు నంబరు అందుబాటులో ఉండేలా చూసుకోవాలి. సర్కిల్ స్థాయిలో కూడా ప్రతి సోమవారం ఉదయం 8:30 నుంచి 9:30 గంటల వరకు డయల్ యువర్ ఎస్ఇ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. జిల్లాస్థాయిలో విద్యుత్ సమస్యలను సూపరింటెండింగ్ ఇంజనీర్ దృష్టికి తీసుకువచ్చేందుకు వీలుగా వినియోగదారులు ఈ క్రింద పేర్కొన్న నంబర్లకు కాల్ చేయవచ్చు. తిరుపతి: 8712652679, చిత్తూరు: 7993147979, నెల్లూరు: 08612320427, అన్నమయ్య: 9440817449, కడప: 08562242457, కర్నూలు: 7382614308, నంద్యాల: 7382618976, అనంతపురం: 9154790350, శ్రీసత్యసాయి: 9963707847 ఈ అవకాశాన్ని విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# బిజెపి నేత ఫామ్ హౌస్‌లో గంజాయి సాగు!

**నయారాయ్‌పూర్, మార్చి 8:** బీజేపీ నేత తన ఫార్మ్‌హౌస్‌లో అక్రమంగా నల్ల మందు సాగు చేస్తున్నట్లు సమాచారం తెలుసుకున్న పోలీసులు దాడులు చేశారు. బీజేపీ నేతతో సహా ముగ్గురిని అరెస్ట్ చేశారు. ఈ నేపథ్యంలో ఆయనను పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. ఛత్తీస్‌గఢ్‌లోని దుర్గ్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. స్థానిక బీజేపీ నేత, బీజేపీ కిసాన్ మోర్చా రైస్ మిల్ ప్రాసెసింగ్ ప్రాజెక్ట్ రాష్ట్ర కన్వీనర్ వినయ్ తామ్రాకర్‌కు సమోదా గ్రామం లో ఫామ్‌హౌస్ ఉన్నది. అందులో రహస్యంగా నల్లమందు అక్రమంగా సాగుచేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. వినయ్‌తో పాటు ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. పార్టీ ప్రతిష్టకు తీవ్ర నష్టం కలిగినట్లు బీజేపీ పేర్కొంది. రాష్ట్ర అధ్యక్షుడు కిరణ్ సింగ్ డియో సూచనల మేరకు వినయ్ తామ్రాకర్‌ను సంస్థాగత పదవి నుంచి తొలగించింది.

అలాగే ఆయన అరెస్ట్, కేసుపై దర్యాప్తు నేపథ్యంలో పార్టీ నుంచి సస్పెండ్ చేసింది. రాష్ట్ర కార్యాలయం మార్చి 7న సస్పెన్షన్ ఉత్తర్వు జారీ చేసింది. మరో వైపు సమోదాలోని ఆ ఫార్మ్‌హౌస్‌ను భూపేశ్ బాఘేల్ సందర్శించారు. సు మారు 150 ఎకరాల మేర విస్తరించి ఉన్నదని, నిందితులకు రాజకీయ సంబంధాలు ఉన్నాయని బాఘేల్ ఆరోపించారు. ఈ అక్రమ నల్లమందు సాగు లో ఏ మంత్రులు, ఎమ్మెల్యేలకు పాత్ర ఉన్నదో ప్రభు త్వం వెల్లడించాలని డి మాండ్ చేశారు. ఈ సందర్భంగా గ్రామ స్తులు పెద్ద సంఖ్యలో అక్కడ గుమిగూ డటంతో పోలీసులను మోహరించారు.

# భారత్ మాకు ముఖ్యమైన భాగస్వామి

## అందుకే 30 రోజులు వెసులుబాటు: ట్రంప్

**వాషింగ్టన్, మార్చి 8:** భారత్ మాకు ముఖ్యమైన భాగస్వామి అందుకే రష్యా ఆయిల్ కొనుగోలు విషయంలో 30 రోజుల పాటు వెసులుబాటు కల్పించామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పష్టం చేశారు. పశ్చిమ ఆసియా, గల్ఫ్ ప్రాంతాల్లో నెలకొన్న యుద్ధ వాతావరణం, ఉద్రిక్తతల నేప థ్యంలో ప్రపంచ ఆయిల్ మార్కెట్‌పై పడుతున్న ఒత్తిడిని తగ్గించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వెల్లడించారు. ఎయిర్ ఫోర్స్ వన్‌లో విలేక రులతో మాట్లాడిన ట్రంప్ ఈ విషయాన్ని అధికారికంగా ధృవీకరించారు. అమెరికా ఆంక్షల కారణంగా సముద్రంలో నిలిచిపోయిన రష్యన్ క్రూడ్ ఆయిల్ షిప్‌మెంట్‌లను భారతీయ రిఫైనరీలు కొనుగోలు చేసేందుకు ఈ 30 రోజుల గడువు ఉపయోగపడుతుందని ట్రంప్ తెలిపారు. ముఖ్యంగా హోర్ముజ్ జలసంధి సమీపంలో భద్రతా కారణాల రీత్యా ఆయిల్ సరఫరాకు అంతరాయం ఏర్పడే ప్రమాదం ఉండటంతో, అంతర్జాతీయ మార్కెట్లో కొరత రాకుండా ఉండేందుకు ఈ తాత్కాలిక నిర్ణయం తీసుకున్నామన్నారు. ఈ కొనుగోలు ద్వారా రష్యాకు కొత్తగా ఎలాంటి ఆర్థిక ప్రయోజనం ఉండదని ట్రంప్ తేల్చిచెప్పారు. ప్రపంచవ్యాప్తంగా, అమెరికాలోనూ ఆయిల్ నిల్వలు పుష్కలంగా ఉన్నాయని, పరిస్థితి త్వరలోనే సర్దుబాటు అవుతుందని ఆయన వ్యాఖ్యానించారు.

# తిరుపతిలో నకిలీ మద్యం తయారీ గుట్టురట్టు

## కార్డన్ సెర్చ్‌లో అక్రమ మద్యం స్వాధీనం

**తిరుపతిరూరల్, మార్చి 8 ప్రభాతవార్త:** తిరుచానూరు పోలీసు స్టేషన్ పరిధిలో అక్రమంగా మద్యం తయారు చేస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. తిరుపతిరూరల్ డియస్పీ బేతంపూడి ప్రసాద్ ఆదేశాల మేరకు తిరుచానూరు ఎస్సై టి.వి.సుధాకర్ ఆధ్వర్యంలో పోలీసు బృందం శేషాద్రినగర్‌లో కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహించగా ఈ వ్యవహారం బయటపడింది. పాడిపేట పంచాయతీ పరిధిలోని శేషాద్రి నగర్ ఇందిరమ్మకాలనీలో బ్లాక్ నెంబర్-40 ఇంటి నెంబర్ ఎఫ్-8 వద్ద నిర్వహించిన సోదాల్లో ఇంటి నుంచి తీవ్రంగా మద్యం వాసన రావడంతో అనుమానం వచ్చిన పోలీసులు పెద్దల సమక్షంలో తనిఖీలు చేపట్టారు. నిందితుడు విశాఖపట్నం జిల్లా గోపాలపట్నం ప్రాంతానికి చెందిన చింతగుంట రామస్వామి నగేష్‌రెడ్డి (39) గా గుర్తించారు. పోలీసుల విచారణలో నిందితుడు యూట్యూబ్ వీడియోలు చూసి నల్లద్రాక్ష, చక్కెర, గోధుమలు, ఈస్ట్‌తో పాటు దాలిచన చెక్క, యాలకులు, లవంగాలు, సోంపు, జాజి పువ్వు, బిర్యాని ఆకులు వంటి సుగంధ ద్రవ్యాలను



ఉపయోగించి డ్రమ్ములో పులియబెట్టి ఇంట్లోనే వైన్ తయారు చేస్తున్నట్లు ఒప్పుకున్నాడు. ఈ మద్యాన్ని పాత సీసాలో నింపి పరిచయస్తులకు సుమారు రూ.300కు విక్రయిస్తూ తాను సేవిస్తున్నట్లు వెల్లడించారు.

కెమికల్ అనాలిసిస్ నివేదిక ప్రకారం ఈ మద్యంలో ఆల్కహాల్ శాతం 8.12శాతం నుంచి 8.25శాతం వరకు ఉన్నట్లు తెలిందన్నారు. సాధారణంగా మార్కెట్‌లో లభించే మద్యంలో ఇది సుమారు 42శాతం వరకు ఉంటుందని, అయితే అశాస్త్రీయంగా తయారు చేయడం వల్ల ఈ మద్యం కలుషితమై ఆరోగ్య సమస్యలకు దారి తీసే ప్రమాదం ఉందని పోలీసులు తెలిపారు. సోదాలలో భాగంగా నిందితుడి వద్ద నుంచి 1000 మిల్లీలీటర్ల సామర్థ్యం గల నాలుగు బాటిళ్ల నాన్-డ్యూటీ పెయిడ్ లిక్కర్ (ఎన్‌డిపిఎల్) 750 మిల్లీలీటర్ల సామర్థ్యం గల 33 బాటిళ్ల నాటు మద్యం అలాగే ప్లాస్టిక్ డ్రమ్ములో ఉన్న ఆరు లీటర్ల పులియబెట్టిన మద్యం స్వాధీనం చేసుకున్నారు. మొత్తం సుమారు 34.750 లీటర్ల అక్రమ మద్యం, మద్యం తయారీకి ఉపయోగించిన సుగంధ ద్రవ్యాల ప్యాకెట్లును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిన్న ఎక్సైజ్ చట్టంలో సెక్షన్ 34(ఇ) 35 ప్రకారం కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించారు.

# డ్రైవింగ్ లైసెన్స్‌లేని వాహనదారులపై దాడులు

## 1,940 మందిపై కేసులు నమోదు

**హైదరాబాద్ మార్చి 8, ప్రభాతవార్త:** జంట నగరాలలో డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపుతున్న వాహనదారులపై ట్రాఫిక్ పోలీసులు ఈ నెల ఒకటవ తేదీ నుంచి ఏడవ తేదీ వరకు దాడులు నిర్వహించగా మొత్తం 1940 మంది వాహనదా రులు పట్టుబడ్డారు. వీరిపై మోటారు వాహనాల చట్టం 1988 నిబంధ నల అనుసారం కేసులు నమోదు చేసినట్లు ట్రాఫిక్ జాయింట్ పోలీసు కమిషనర్ జోయల్ డేవిస్ ఆదివారం నాడు మీడి యాకు తెలిపారు. రోడ్డు ప్రమాదాలకు డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలను నడుపుతున్న వారు కూడా కారణమ ని ఆయన తెలిపారు. వీరివల్ల ప్రమాదాలు జరిగితే బాధితులకు, మరణించిన వారికి ఎలాంటి బీమా వర్తించడం లేదని ఆయన తెలిపారు. వాహనదారులు ఈ విషయంలో కచ్చిత ంగా నిబంధనలు పాటించాలని, రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలని ఆయన కోరారు.

# ధర్మగిరి వేద విజ్ఞాన పీఠంలో వేంకటేశ్వర ఆగమ విద్వత్ సదస్సు ప్రారంభం

తిరుమల, మార్చి 8 ప్రభాతవార్త ప్రతినిధి: తిరుమలలోని ధర్మగిరి వేద విజ్ఞాన పీఠంలో 29వ శ్రీవేంకటేశ్వర వేద శాస్త్ర ఆగమ విద్వత్ సదస్సు ఆదివారం ఉదయం ఘనంగా ప్రారంభమైంది. ఈ సదస్సు 13వ తేది వరకు ఆరు రోజుల పాటు పండితుల ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. శ్రీవారి దివ్యానుగ్రహంతో భారతదేశ వ్యాప్తంగా ఉన్న వేద, శాస్త్ర, ఆగమ, స్మార్త, ప్రబంధ పండితులను గుర్తించి, వారిని టిటిడి పక్షాన పరీక్షి ంచి, నగదు, శాలువా, విజయ పత్రికను అందించి గౌరవించేందుకుగాను 1969 సంవత్సరంలో వేంకటేశ్వర వేద, శాస్త్ర, ఆగమ, విద్వత్ సదస్సును ప్రారం భించడం జరిగింది. సదస్సుకు దేశవ్యాప్తంగా 800 మందికి పైగా అభ్యర్థు లు హాజరవుతున్నారు. 100 మందికి పైగా సుప్రసిద్ధ పండితులు అభ్యర్థులను పరీక్షి ంచనున్నారు. ఈ కార్యక్రమ ప్రారంభ సభలో తిరుమల చిన్నజీయర్ స్వామి, మైసూరు దత్తపీఠం ఉత్తరాధికారి దత్త విజయానంద

వార్త

ఆకలి రుచి ఎరుగనట్లే, మనకు అత్యవసరమైన దాంట్లో తప్పులు కనిపించవు.

న-ఆస్కార్‌వైల్డ్

# నేపాల్ చరిత్ర కొత్త సిరాతో..

నేపాల్‌లో రాజకీయ అనిశ్చితికి వ్యతిరేకంగా గత యేడాది సెప్టెంబర్‌లో 'జెన్ జీ' తిరుగుబాటు ప్రభావం తాజా ఎన్నికలపై పడింది. గురువారం జరిగిన పార్లమెంట్ ఎన్నికలో జెన్‌జీ మద్దతున్న రాష్ట్రీయ స్వతంత్ర పార్టీ విజయపరంపర కొనసాగుతోంది. నేపాల్ రాచరికం అంతరించాక ఏర్పడిన అన్ని ప్రభుత్వాలూ ఎప్పటికప్పుడు తమ నేతను మార్చుకోవడంలోనే కాలం గడిపేసాయి. సుదీర్ఘకాల రాజకీయ అస్థిరతతో కొనసాగిన నేపాల్ ప్రభుత్వానికి పటిష్ఠ పాలన చేయగల సమర్థుడు, సరైనోడి అవసరముంది. ఎన్నిసార్లు ప్రభుత్వాలు మారినా మళ్లీ మళ్లీ మార్పు కోరుకోవడంతో నేపాల్ రాజకీయాలు భ్రష్టుపట్టాయి. గత 18ఏళ్ల వ్యవధిలో 14 ప్రభుత్వాలు మారాయి. ఒకప్పుడు హిందూ రాజ్యంగా ఉన్న నేపాల్ తరచు రాజకీయ అనిశ్చితిలో ఉండడం భారతదేశానికి కునుకు పట్టని పరిస్థితి. ఈసారి ఎన్నికలు, ఓటింగ్ సరళి, ఓట్లలెక్కింపు ఫలితాలను చూస్తే పటిష్ఠ ప్రభుత్వానికి పట్టం కట్టారన్న విషయం ద్యోతకమవుతోంది. కొత్త రాజకీయ ధోరణులకు జనాదరణ ఎక్కువగా లభించింది. స్ట్రక్చరల్ ఇంజినీర్ బాలేంద్ర షా మంచి గాయకునిగా గుర్తింపు పొందినవ్యక్తి. తన పాట కచేరీల్లో ప్రధానంగా అవినీతి అసమానతలు, యువత ధోరణి వారికి అవసరమైన అంశాలను లేవనెత్తడంతో యువతలో మార్పు వచ్చింది. అంతేగాక ఆయన తలపనితలంపుగా రాష్ట్రీయ స్వతంత్ర పార్టీకి నేతృత్వం వహించడంతోవారికి ఆశాజనకంగా మారింది. సామాజిక మాధ్యమాల్లో పాల్గొంటూ బాలేంద్ర షా ఎంతో చైతన్య శీలిగా యువతను ఆకర్షించారు. ఖాట్మండు మేయర్ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసినా ఘన విజయం అందుకోగలిగారు. దీనికి తోడు మేయర్‌గా షా తీసుకున్న నిర్ణయాలు యువతను ఆకర్షించాయి. నగరంలో అక్రమ నిర్మాణాలను కూలగొట్టడంతో ఆయన 'హీరో' అయ్యాడు. నేపాల్‌లో ప్రాబల్యమున్న కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీలు ఇంతటి వెనుకంజ వేస్తాయని ఎవరూ ఊహించలేరు. చాన్నాళ్లుగా ఇరు పార్టీలు చెరిసగం ఓట్లను పంచకుంటూ రాజకీయ అనిశ్చితికి కారణమవడం 'జెన్ జీ' యువత వైఖరిని మార్చింది. అందుకే వారు ఆయా పార్టీ ప్రభుత్వాల పాలన మీద తిరుగుబాటు బావుటానెగురవేసిన విషయం విదితమే. సంప్రదాయ పార్టీలతో విసిగిపోయిన జెన్‌జి యువతకు ఆర్‌ఎస్‌పి ఆశాజ్యోతిలా కనిపించింది. కాంగ్రెస్, కమ్యూనిస్టుల పాలన నేపాల్ జనం ఎన్నో చేదు అనుభవాలు చవిచూసింది. ఆయా పార్టీలను బాలేంద్ర షాపార్టీ కదిలించగలిగింది. ఆర్‌ఎస్‌పి అభ్యర్థులు అధిక నియోజకవర్గాలో ఆది నుంచీ లీడింగ్‌లో ఉన్నారు. మొత్తం 165 నియోజకవర్గాల్లో 110లో పోటీలోఉన్న అభ్యర్థులుఆధిక్యతలో కొనసాగుతున్నారు. బాలేంద్ర షా కూడా జాపా–5 నియోజకవర్గంలో తన సమీప ప్రత్యర్థి సిపిఎన్–యూఎంఎల్ పార్టీ అధ్య క్షుడు, నాలుగుసార్లు ప్రధానిగా పనిచేసిన కె.పి శర్మ ఓలీపై గెలిచారు. ఆదేశంలో జెన్‌జి నిరసనలు జరిగినప్పు డే ఓలీ ప్రభుత్వం కూలిపోయింది. కానీ ఈ ఎన్నికల్లో ఓలీ కూడా ఓటమి పాలవడం చెప్పుకోదగిన విషయం. ఆయన మీద ప్రజల్లో గూడుకట్టుకున్న వ్యతిరేకతకిదే సాక్ష్యం. 'జెన్‌జీ' తిరుగుబాటు తర్వాత జరిగిన తొలిసాధారణ ఎన్నికలివే. పార్లమెంటులోని ప్రజా ప్రతినిధుల సభలో 275 స్థానాలుండగా వాటిలో 165 స్థానాలకే ప్రత్యక్ష ఎన్నిక జరుగుతుంది. తక్కిన 110 స్థానాలకు దామాషా ప్రాతిపదికన ఎన్నిక ఉంటుంది. నేపాలీ కమ్యూనిస్టు నేత పుష్ప కమల్ 'ప్రచండ' మాత్రం విజయం సాధించారు. ఏక మొత్తంగా ఆర్‌ఎస్‌పి క్లీన్‌స్వీప్ చేసింది. ఆపార్టీ అధ్యక్షుడే ఇప్పుడు ప్రధాని కానున్నారు. ఆయన వయస్సు 35ఏళ్లు కాగా భారత్‌కు షావ్యతిరేకిగా పేరుంది. నేపాల్‌లో స్థిరమైన ప్రభుత్వం ఏర్పడాలని కోరుకున్న భారత్ అక్కడి ఎన్నికల ఫలితాలపై మొదటి నుంచి ఎదురుచూస్తోంది. కొత్త ప్రభుత్వంతో పరస్పర ప్రయోజనాల రీత్యా కలిసి నడవాలని భారత్ ఇప్పటికే సిద్ధమైంది. నేపాల్‌లో స్థిరమైన ప్రభుత్వం ఏర్పడి, శాంతి అభివృద్ధి చెందుతుందన ఆశావాహ దృక్పథంతో ఎన్నికల ప్రక్రియ సజావుగా నడపడం కోసం లాజిస్టిక్ సౌకర్యాన్ని కూడా భారత్ అందచేసింది. కానీ కొత్తపార్టీ కొత్త నేతలు భారత్‌లో కలిసి వచ్చేందుకు ఎలాంటి నిర్ణయం తీసుకుం టుందో వేచిచూడాలి. పూర్తి ఫలితాలు రావడం, ఆ తర్వాత ప్రభుత్వం ఏర్పడ్డాక కానీ వారివైఖరి తెలియదు. రాష్ట్రీయ స్వతంత్ర పార్టీని 2022లో రవిలమిచ్ఛేన్ స్థాపించారు. కాగా ఈ యేడాదిజనవరి 18న అదే పార్టీలో చేరిన బాలేంద్ర షాకు ప్రధాని అభ్యర్థిత్వం జాక్‌పాట్ తగిలినట్లే. నేపాల్ ఎన్నికలు ఆ దేశ రాజకీయాలను మలుపు తిప్పే రోజొచ్చింది. సంప్రదాయ కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీల తరపున పోటీచేసిన పాత ముఖాలు బరిలో ఉన్నా గెలిచే స్థాయి లేదనే విషయం తేలిపోయింది. పాత పాలకుల్లో అవినీతి ఆరోపణలున్నాయి. ఆశ్రిత పక్షపాతం, బంధుప్రీతి పేరుకుపోయిందన్న విమర్శలూ ఉన్నాయి. తొలుత సామాజిక మాధ్యమాలను నేపాలీ ప్రభుత్వం నిషేధించిన తరుణంలో ప్రజాగ్రహం పెల్లుబికిన విషయం తెలిసిందే. అదే 'జెన్‌జీ' మహోద్యమంగా పేరిడింది. ఈ ఉద్యమాన్ని అణచి వేసే సందర్భంలో పోలీసుకాల్పుల్లో దాదాపు వందమంది మృతి చెందారు. ఓలి ప్రభుత్వం కుప్పకూలింది. ఆ సందర్భంగా కొన్ని రాజకీయపార్టీల్లో ప్రముఖులు పలు సంస్కరణలతో తాము పునీతులమయ్యామని చెప్పసాగారు. అయినా దేశంలో పెచ్చుపెరిగిన సామాజిక రుగ్మతల నుంచి కాపాడలేని ఏ సంస్కరణలనూ అంగీకరించబోమని ఆనాడే చెప్పారు. అదే వ్యతిరేకత ఇప్పుడు ప్రతిబింబించింది. బాలేంద్ర షా పాలనను నేపాల్ చూడబోతోంది.

అంతరాయాలు కలుగుతున్న కొద్దీ సంకల్పాన్ని దృఢతరం చేసుకుంటూ పోవాలి.



శ్రీరమణ మహర్షి

అందరిలోనూ శక్తిసామర్థ్యాలు ఎంతో కొంత ఉంటాయి. వాటిని వినియోగించుకోవడంలోనే అసలు సమస్య ఉంటుంది.



రామకృష్ణ పరమహంస

# ప్రజావాక్కు



### కృత్రిమ మేధ ఒక ముప్పు

భారతదేశం ప్రపంచ వేదికపై తన సాంకేతిక ఆధిపత్యాన్ని నిలబెట్టుకోవాలంటే, విస్తృత స్థాయిలో కృత్రిమ మేధ పరిష్కారాలను స్వీకరించడం, మానవ వనరుల నైపుణ్యాలను పెంపొందించడం అత్యంత ఆవశ్యకం. ప్రస్తుత పరిస్థితుల్లో సాఫ్ట్‌వేర్ సేవల రంగానికి కృత్రిమ మేధ ఒక ముప్పు అని భావించడం తప్పు. వాస్తవానికి ఇది ఉత్పాదకతను, ఆవిష్కరణలను సమస్య పరిష్కార సామర్థ్యాలను రెట్టింపు చేసే ఒక శక్తివంతమైన సాధనం. నేడు అనేక సంస్థలు తమ విలువైన కార్యకలాపాల్లో కృత్రిమ మేధను అంతర్భాగం చేస్తున్నాయి. దీనివల్ల పనిలో ఖచ్చితత్వం పెరగడమే కాకుండా, సృజనాత్మకతకు కొత్త ద్వారాలు తెరుచుకుంటున్నాయి. భారతదేశంలో ఇప్పటికే అనేక అంతర్జాతీయ భాగస్వామ్యాలు కృత్రిమ మేధ ఆధారిత అభివృద్ధిపై దృష్టిసారించడం మనసాంకేతిక సామర్థ్యంపై ప్రపంచానికి ఉన్న నమ్మకానికి నిదర్శనం.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### మేకపోతు గాంభీర్యం

శాసనసభ, లోక్‌సభ ఎన్నికలుజరిగిన సమయంలో బిజెపికి చెందిన మహానేతలు, ముఖ్యమంత్రులు తెలంగాణకు వచ్చి పట్టణాల్లో, పల్లెల్లోసందుల్లో గొందుల్లో తిరిగి ప్రచారం చేశారు. అయినా ఆఎన్నికల్లో బిజెపి సింగిల్ డిజిట్‌కే పరిమితమయింది. ఆ తరువాత జరిగిన ఉప ఎన్నికల్లో గెలిచే తీరాలనేపట్టుదలతో పనిచేసినా ఫలితం దక్కలేదు. రెండు ఉపఎన్నికల్లోనూ బిజెపికి డిపాజిట్ పనిచేసినా దక్కని పరిస్థితి. పల్లెపోరు, పట్టణ పోరులోను ఆ పార్టీ అత్యధిక స్థానాల్లో ఓటమిపాలైంది. తెలంగాణలో జరుగుతున్న ఏఎన్నికల్లోనూ బిజెపిప్రభావం చూపలేకపోతోంది.

- శాస్త్రి, హైదరాబాద్

### మారిన తమిళ రాజకీయాలు

తమిళ్నాడులో ఎన్నికలు ముంచుకోస్తున్న వేళ రాజకీయ చిత్రాలుమారిపోతున్నాయి. అమ్మకునమ్మినబంటుగా ఉన్న పన్నీరు సెల్వం ద్రావిడమున్నేట కాజగంలో చేరడం ఒక గొప్పమలుపు జయలలిత ఉన్నప్పుడు నెంబర్ 2గా ఉన్న పన్నీరుపళని రాకతో పలుచబడిపోయాడు. ఇక చిన్నమ్మ పునరాగమానం విజయ్‌రాకతో తమిళనాడు రాజకీయాలు తమిళ పాయసం లాగా మారాయి.

- భారత అవినాష్, జనగామ

### పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

నడుస్తున్న వేసవిలో రాబోయే రోజుల్లో బాగా ఉష్ణోగ్రతలు పెరగనున్నవి. ప్రకృతి ద్వారా వచ్చే సహజ ఇబ్బందులు మన నియంత్రణ ప్రమేయం లేదు. సాధారణ ఉష్ణోగ్రత కన్నా ఆరు డిగ్రీలు అధికంగా నమోదైనవి. బయట పనికి వెళ్లేవారికి ఎక్కువ ఇబ్బంది ఉంటుంది. వారు వ్యక్తిగత జాగ్రత్తతోపాటు నగర కార్పొరేషన్ వారు ప్రతియేటా ఏర్పరిచే చలివేంద్రాలు, వాటికి సరిపడ నీరు ఏర్పాట్లు ముఖ్యం. స్వచ్ఛంద సంస్థలు కూడా భాగస్వాములుగా మరికొన్ని అదనంగా పెట్టవచ్చు. ఇంటిలో త్రాగునీరు మితంగా వాడాలి. వృథా చేయరాదు. రోగులు, వృద్ధులు ఒకరి సహాయంతో బయటకు తప్పనిసరి ఐతే వెళ్ళాలి. ఆరోగ్య శాఖ వారి సూచనలు పాటించాలి. ఇవి సాధారణమే గాని కాస్త ఆచరణ లోపిస్తే దాని దుష్ఫలితం తెలుస్తుంది. నీరు, ఆహారంతోనే ప్రాణం.

- బొల్లోజు మేఘనాదం, విశాఖపట్నం

### దోపిడీయే ప్రధాన అజెండా

అందమైన సూటు వేసుకున్న అస్తిపంజరం లాంటిదే అమెరికా ఆర్థిక పరిస్థితి. ఆయుధాలు అమ్మకం ఆయుధాలు తయారీ, సరఫరామీదవారి ఆదాయం ఆధారపడిఉంటుంది. ఒక తుపాకీ పట్టుకున్న వ్యక్తి ఎదురుగా ఉన్న వ్యక్తులను కాల్చుతాడు. సహనం చచ్చిపోయిన తర్వాతతనకు తానే కాల్చుకుంటాడు. పుట్టిన వారికి మరణం తప్పదు, మరణించిన వారికి జననం తప్పదు. జనన మరణాలు చక్ర భ్రమణాలు. అయితే జనన మరణాలు ప్రకృతి సిద్ధంగా జరగాలి. సహజంగా ఉండాలి. అమెరికా తమ శత్రుదేశాలుగా భావించి, ప్రకటించిన రష్యాపైన, చైనాపైన డైరెక్ట్‌గా యుద్ధం ప్రకటించదు. సహజ వనరులుఎక్కడైతే ఉన్నాయో, ఆదేశాల మీద ఆదేశాల నాయకులు మీద ఆదేశాల ప్రజల మీద దాడి, దోపిడీ చేస్తారు. సహజ వనరుల దోపిడీ మాత్రమే వాళ్ల ప్రధాన ఎజెండా.

- వీరగంట భాస్కర్ రావు, బొబ్బిలి

### భూకబ్జాలను ఆపాలి

తెలంగాణ రాష్ట్రంలోని మండల కేంద్రాలలో ఉన్న ఎస్సీ, ఎస్టీ కాలనీలలో భూకబ్జాలు భూ ఆక్రమణలు అక్రమ కట్టడాలు జరుగుతున్నాయి. న్యాయంకోసం పోలీస్‌స్టేషన్, రెవెన్యూ అధికారులకు, ఎస్సీ, ఎస్టీ కమిషన్, వికలాంగుల సంక్షేమ శాఖ, జిల్లా కలెక్టర్‌లకు కూడా ఫిర్యాదు చేసినా కూడా సమస్యలు పరిష్కారంకావడం లేదు. సంవత్సరాలు గడిచినా కూడా భూ సమస్యలు పరిష్కారం కావడం లేదు.

- ఈదునూరి వెంకటేశ్వర్లు, నెక్కొండ

మన వివి ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# అగ్రరాజ్యం యుద్ధ దాహం తీరేదెన్నడు?

**అమెరికాను ఎదురించిన వీరుడిగా ఖమేనీని కొంతమంది అభివర్ణిస్తే, మానవ హక్కులను హరించి, వేలాది మందిని హతమార్చిన క్రూరమైన నియంతగా మరికొంతమంది విమర్శిస్తూపోస్టులు పెట్టడం జరిగింది. బాలికలను, మహిళలను మత చాంధస వాదంతో నిర్బంధానికి గురిచేసి వారి స్వేచ్ఛను, హక్కులను కాలరాసాడని ఇంకొంతమంది వాదించారు. ఏదిఏమైనప్పటికీ ఇప్పటికైనా ఇరాన్ వైఖరిలో మార్పురావాలి. ఆర్థికంగా బల హీనంగాతయారైన అమెరికా కేవలం టెక్నాలజీ సహాయంతో ప్రపంచదేశాలను బెదిరించడం అనుచితం. ఆయుధ బలం, సాంకేతిక పరిజ్ఞానంతో ప్రపంచాన్ని తమ గుప్పెట్లో పెట్టు కోవాలని అగ్రదేశాలు విశ్వప్రయత్నం చేస్తున్నాయి. యుద్ధా లను ప్రోత్సహిస్తున్నాయి. పలుదేశాలు అమెరికా భజన చేయడం గమనార్హం. ఇతర దేశాలకు తలవంచిన నాడు భవిష్యత్తులో తలదించుకునే పరిస్థితులు ఏర్పడతాయి.**



సుంకవల్లి సత్తిరాజు

స్ట్రయిట్ ఆఫ్ హార్ముజ్ వర్తమాన ప్రపంచాన్ని గజగజా వణికిస్తున్నది. ఇరాన్‌పై అమెరికా ఇజ్రాయిల్ దేశాలు సంయుక్తంగా గతకొద్ది రోజులుగా నిర్వహిస్తున్న 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ' భయోత్పాతాన్ని సృష్టిస్తున్నది. ఈ యుద్ధానికి ఎటువంటి సంబంధం లేని దేశాలు కూడా ఆర్థికంగా అతలాకుతలమైపోతున్నాయి. ప్రస్తుత యుద్ధానికి సంబంధం లేని దేశాలను అమెరికా, ఇజ్రాయిల్‌లు సంక్షోభంలో నెట్టాయి. ప్రపంచంలోని పలు దేశాల చమురు దిగుమతులకు హార్ముజ్ జలసంధి కీలకంగా మారిన నేపథ్యంలో ఇక్కడ చిక్కుకున్న సుమారు 700 నౌకల్లో 37 నౌకలు భారత దేశానికి చెందినవి. అమెరికా, ఇజ్రాయిల్, ఐరోపా దేశాలకు హార్ముజ్ జలసంధిలో ప్రవేశం లేదని ఇప్పటికే ఇరాన్ ప్రకటించింది. ఈవిషయంలో భారత్ పట్ల ఇరాన్ సృహృద్భావాన్నే ప్రదర్శించిందనే చెప్పాలి. ఇక్కడ నుండి భారత్‌కు యథావిధిగా చమురు సరఫరా జరిగే అవకాశాలు న్నాయా?అనే విషయం పరిశీలించవలసి ఉంటుంది. హార్ముజ్ జలసంధి వద్ద చమురు ట్యాంకర్లకు రక్షణ కల్పిస్తామని, ఇన్సూ రెన్స్ పేరుతో ట్రంప్ నాటకాలాడుతున్నాడు. అమెరికా ఇజ్రాయిల్ యుద్ధోన్మాదం వలన పలుదేశాలు చేదు అనుభవాలను చవిచూడవలసి వస్తున్నది. ఇజ్రాయిల్‌తో రక్షణ సంబంధాలున్న దేశాలను సైతం ఇరాన్ వదలడం లేదు. అజర్ బైజాన్ విమానాశ్రయం పైనా ఇరాన్ దాడులు చేసింది. ఇజ్రాయిల్‌తో సంబంధాల కారణంగా తనతో సన్నిహితంగా మెలగిన దేశాలను సైతం ఇరాన్ విడిచిపెట్టడం లేదు. ఇరాన్ అజర్ బైజాన్, టర్కీలపై కూడా దాడులు చేయడం జరిగింది. బహ్రెయిన్ ఆయిల్ రిఫనరీలపై ఇరాన్ దాడులు చేస్తున్నది. దుబాయ్, కువైట్, ఖతార్ లాంటి గల్ఫ్‌దేశాల్లో ఉన్న కోటి మంది భారతీయుల భవిష్యత్తు ఏమిటి? వారంతా క్షేమమేనా?ఇంకా ఉద్రిక్తతలు పెరిగితే వారి పరిస్థితిఏమిటి? ఇప్పటికే వందలాది మందిచనిపోయిన ఈయుద్ధం రానున్న రోజుల్లో మరింత మంది చావుకు దారితీయవచ్చు. అమెరికా స్థావరాలపైన, ఇజ్రాయిల్ పైన, గల్ఫ్ దేశాలపైన గురి పెడుతున్న ఇరాన్ ప్రస్తుతం హార్ముజ్ జలసంధిలో నిలిచిపోయిన చమురు నౌకలకు ముప్పుతేనుందా? అందుకే భారత ప్రభుత్వం ఆలస్యమైనా ఖమేనీ మృతికి సంతాపం తెలిపిందా? హిందూ మహా సముద్రంలో ఇరాన్ నౌకపై అమెరికా పాల్పడిన అరాచకాన్ని ఇరాన్ క్షమిస్తుందా? ఇరాన్ పై అమెరికా, ఇజ్రాయిల్ చేస్తున్న యుద్ధానికి ప్రతీకారంగా ఈ రెండు దేశాలు రక్తాన్ని చిందించవలసి వస్తుందని ఇరాన్ హెచ్చరిక చేసింది. హార్ముజ్ జలసంధిలో నిలిచి పోయిన 700 నౌకల్లో 37 భారత్‌కు చెందినవి. భారత్ వైఖరిని ఇరాన్ సానుకూల దృక్పథంతో అర్థం చేసుకుని విడిచి పెట్టవచ్చు. ఇతర దేశాలపై ప్రతీకారం తీర్చుకునే అవకాశాలే మెండు. ఇరాన్ ప్రజలు కూడా గతంలో మాదిరిగా అమెరికాకు సానుకూల స్పందన తెలియ చేయడం లేదు. ఖమెనీ మృతితో సంబరాలు చేసుకున్న ఇరాన్ ప్రజలు, మహిళల్లో నేడు అదేఉత్సాహం కనిపించడం లేదెందుకని? 13 దేశాలకు విస్తరించిన యుద్ధంవలన చమురు ధరలు పెరిగిపోతున్నాయి. అమెరికా మాదిరిగా సుదీర్ఘ కాలం ఉండే ఆయిల్ రిజర్వ్స్ భారత్‌లో లేవు. భారత ఆర్థిక వ్యవస్థ దెబ్బతినడానికి యుద్ధాలు చేటు. కేవలం ఆపద సమయంలో 20రోజులకు సరిపడే ఆయిల్ నిల్వలు భారత దేశ అవసరాలను తీర్చలేవు. రష్యా ఇప్పటికే భారత్‌కు చమురు సరఫరా చేస్తానని ప్రకటించగా, అందుకు అమెరికా 30రోజుల వరకు భారత్ రష్యా నుండి చమురు



కొనుగోలు చేయడానికి అనుమతినిచ్చింది. భారత్ చమురు కొనుగోలులో అమెరికా పెత్తనమేమిటి?ఈవిషయంలోభారత ప్రజలు కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తున్న మాట వాస్తవం. ఈ ప్రపంచంలో చాలా దేశాలు అమెరికా చేతిలో కీలుబొమ్మగా మారిపోయాయి. చివరికి గల్ఫ్ దేశాలు కూడా అమెరికాకు పాదాక్రాంతమైనాయి. అమెరికాకు ఎదురు చెప్పగల ధైర్యం, ఎదురించగల సాహసం రష్యా, చైనా, ఉత్తర కొరియాలకు మాత్రమే ఉందని అనుకున్నప్పటికీ వారుకూడా కేవలం హెచ్చరికలకే పరిమితమైనారు. ఈ మూడు దేశాలు అమెరికా ఇజ్రాయిల్‌కు వ్యతిరేకంగా పనిచేసి, ఇరాన్‌కు మద్దతుగానిలిస్తే యుద్ధ స్వరూపమే మారిపోయిఉండేది. మూడవ ప్రపంచ యుద్ధమే సంభవించి ఉండేది. పరిస్థితులు అంత దూరం రానందుకు సంతోషించాలి. నాటో మిత్రదేశాలను తూలనాడిన ట్రంప్‌కు ఆయా దేశాల నుండి సరైన స్థాయిలో ప్రతిస్పందన రాలేదు. స్పెయిన్‌ను ట్రంప్ తీవ్ర స్వరంతో హెచ్చరించాడు. తన మాట వినకపోతే ప్రాణాలు పోవడం తప్ప ఏమీ మిగలదని ట్రంప్ ఇరాన్‌ను హెచ్చరించారు. ఇరాన్ సుప్రీం లీడర్‌ని కూడా తానే ఎంపిక చేస్తానని ట్రంప్ పేర్కొనడం భావ్యంగా లేదు. వెనిజులా విషయంలో కూడా ట్రంప్ ఇదే ధోరణి అవలంబించారు. ఇరాన్ యుద్ధం ముగిసాక, క్యూబా తన తదుపరి లక్ష్యమని ట్రంప్ పేర్కొనడం మారని ట్రంప్ యుద్ధోన్మాదానికి పరాకాష్ట. ఇరాన్ ఖమేనీని కోల్పోయినప్పటికీ ఇప్పటి వరకు అమెరికా ఇజ్రాయిల్ దేశాలను ధీటుగానే ఎదుర్కొంటున్నది. అతి తక్కువ ఖర్చు గల డ్రోన్ల సాయంతో ఇరుదేశాల క్షిపణులను, ఇతర ఆయుధాలను ఇరాన్ తుత్తునియలు చేస్తున్నది. ఇప్పటికేఅమెరికా, ఇజ్రాయిల్ లు ఇరాన్ పై దాడికి భారీ మొత్తంలో ఖర్చు చేసినట్టు తెలుస్తున్నది. అమెరికా క్షిపణి నిల్వలు తగ్గుతున్న దృష్ట్యా తక్షణమే యుద్ధానికి అవసరమైన ఆయుధాల ఉత్పత్తిని ప్రారంభించాలని అమెరికా తన రక్షణ శాఖను ఆదేశించినట్టు వార్తలు వెలువడ్డాయి. ఇప్పటికే రష్యా, ఉక్రెయిన్ యుద్ధంతో ఆర్థికంగా కుదేలైన అమెరికా ఇరాన్‌పై దాడులు చేస్తూ ప్రపంచ దేశాలను ఆర్థికంగా దివాలా తీయించడం, పులి మీద పుట్రలా ఇప్పటికే ఆర్థిక మాంద్యంతో అల్లాడుతున్న దేశాల ఆర్థిక స్థితిగతులను అధ్వాన్నంగా మార్చడం తగని పని. గల్ఫ్ దేశాలు తమ ఆహారం కోసం దిగుమతులపై ఆధారపడి ఉన్నందున కోట్లాది మందికి ఆహారసరఫరా ఆగిపోయే పరిస్థితులున్నాయి. యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో భారత ఆర్థిక వృద్ధి రేటు స్వల్పంగా క్షీణంచవచ్చునని, రూపాయి పతనం కూడా పెద్దగా ఉండబోదని రిజర్వ్ బ్యాంకు, ఆర్థిక నిపుణుల అంచనాలు. యుద్ధ ప్రభావం వలన భారత దేశానికి వచ్చే ముప్పేమీ లేదని అంచనా. అయితే ఈ యుద్ధం దీర్ఘకాలం కొనసాగితే భారత్ ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం పడే అవకాశాలున్నాయి. విశాఖలో జరిగిన నౌకా విన్యాసాల్లో పాల్గొని, తిరుగుదశలో ఉన్న ఇరాన్ యుద్ధనౌకను అమెరికా శ్రీలంక సమీపంలో విధ్వంసం చేయడం యుద్ధాన్ని హిందూ సముద్ర జలాలకు విస్తరించడమే కదా? దీనిపై భారత్ స్పందనం ఏమిటి? భారత్‌కువచ్చిన ఇరాన్ నౌకను టార్పెడోతో ముంచేసుమారు 100మందిని చంపే అధికారం అమెరికాకు ఎవరిచ్చారు? ఖచ్చితంగా ఇది భారత పరువు ప్రతిష్ఠలను అంతర్జాతీయంగా మంటపెట్టే ట్రంప్ కుట్రే. భారత్‌ను వివాదంలోకి లాగడమే. ఇరాన్ విషయంలో భారత్ అనుసరిస్తున్న వైఖరికి అనుకూలంగా కొందరు, ప్రతికూలంగా మరికొందరు ప్రతిస్పందిస్తున్నారు. ఇరాన్ సుప్రీం ఖమేనీ అంతమైనతర్వాత కొన్ని చోట్ల నిరసనలు, మరికొన్ని చోట్ల సంబరాలు చేసుకోవడం జరిగింది. ఇరాన్‌ను సమర్థించే వారంతా ఇండియాను వదలిపెట్టి, ఇరాన్ వెళ్లి పోవాలంటూ కొంతమంది, ఇరాన్ మనకు మిత్ర దేశమంటూ కొంతమంది సోషల్ మీడియా వేదికగా ఖర్చులేని మాటల యుద్ధం చేసారు. అమెరికాను ఎదురించిన వీరుడిగా ఖమేనీని కొంతమంది అభివర్ణిస్తే, మానవ హక్కులను హరించి, వేలాది మందిని హతమార్చిన క్రూరమైన నియంతగా మరికొంతమంది విమర్శిస్తూపోస్టులు పెట్టడం జరిగింది. బాలికలను, మహిళలను మత చాంధస వాదంతో నిర్బంధానికి గురిచేసి వారి స్వేచ్ఛను, హక్కులను కాలరాసాడని ఇంకొంతమంది వాదించారు. ఏదిఏమైనప్పటికీ ఇప్పటికైనా ఇరాన్ వైఖరిలో మార్పురావాలి. ఆర్థికంగా బల హీనంగాతయారైన అమెరికా కేవలం టెక్నాలజీ సహాయంతో ప్రపంచదేశాలను బెదిరించడం అనుచితం. ఆయుధ బలం, సాంకేతిక పరిజ్ఞానంతో ప్రపంచాన్ని తమ గుప్పెట్లో పెట్టు కోవాలని అగ్రదేశాలు విశ్వప్రయత్నం చేస్తున్నాయి. యుద్ధాలను ప్రోత్సహిస్తున్నాయి. పలుదేశాలు అమెరికా భజన చేయడం గమనార్హం. ఇతర దేశాలకు తలవంచిన నాడు భవిష్యత్తులో తలదించుకునే పరిస్థితులు ఏర్పడతాయి.

# పసి పిల్లలకు పాలే శాపమా?


మేకిరి దామోదర్

పాలు మనిషి జీవితంలో తొలి ఆహారం. పుట్టిన శిశువు నుంచి వృద్ధుడి వరకూ ప్రతి దశలోనూ పాలు కీలక పాత్ర పోషిస్తాయి. అందుకే వాటిని 'సంపూర్ణ ఆహారం'గా పరిగణిస్తారు. రోజువారీ జీవనానికి కావలసిన శక్తి, ఎదుగుదలకు అవసరమైన ప్రోటీన్లు, ఎముకల దృఢత్వానికి అవసరమైన క్యాల్షియం, ఫాస్పరస్, శరీర క్రియల సమతుల్యతకు కీలకమైన విటమిన్ బి–12 వంటి అనేక పోషకాలు పాలలో సమృద్ధిగా లభిస్తాయి. పిల్లల ఎదుగుదలలో, దంతాలఆరోగ్యంలో, కండరాల నిర్మాణంలో పాలు ప్రధాన పాత్ర పోషిస్తాయని వైద్య నిపుణులు చెబుతారు. నాడీ వ్యవస్థ సక్రమంగా పనిచేయడానికి, రోగనిరోధక శక్తి పెరగడానికి కూడా పాలు దోహదపడతాయి. రాత్రిపడుకునే ముందు గ్లాస్‌పాలుతాగితే నిద్ర బాగా పడుతుందనే విశ్వాసం కూడా సామాన్యప్రజల్లో బలంగా ఉంది. పాలు కేవలం పానీయంగా మాత్రమే కాదు, టీ, కాఫీ, పెరుగు, మజ్జిగ, నెయ్యి, స్వీట్లు వంటి అనేక ఆహార పదార్థాల మూలాధారం. ప్రాంతీయ భోజన అలవాట్లు ఎంత భిన్నంగా ఉన్నా, పాల వినియోగంలోమాత్రం దేశవ్యాప్తంగా ఒక సామాన్యత కనిపిస్తుంది. పౌష్టికాహారంగా పాలను పిల్లలకు తప్పనిసరిగా అందించడం, పెద్దలు రోజువారీ ఆహారంలో భాగం చేసుకోవడం సాధారణం. ఆయుర్వేదంలో కూడా పాలను ఔషధంగా వినియోగిస్తారు. కొన్ని రకాల వ్యాధులను నివారించడంలో పాలు ఉపకరిస్తాయని పరిశోధనలు సూచిస్తున్నాయి. అయితే, ఈ సమగ్ర ఆహారమే నేడు ప్రజారోగ్యానికి ముప్పుగా మారుతోందనే ఆందోళన పెరుగుతోంది. కారణం పాల కల్తీ. పాడి పరిశ్రమలో పెద్దభాగం ఇంకా అసంఘటిత రంగంలోనే కొనసాగుతోంది. సరైన పర్యవేక్షణ లేకపోవడం, నియంత్రణలోపాలు, అధిక లాభాల దాహం స్వార్థంతోడై పాలకల్తీకి మార్గం సుగమం చేస్తున్నాయి. ఇటీవల కొన్ని ప్రాంతాల్లో కల్తీ పాలు తాగి ప్రజలు అనారోగ్యానికి గురైన ఘటనలు వెలుగుచూశాయి. ఈ దారుణాలు సమాజాన్ని కలవరపరుస్తున్నాయి. అధిక ఉత్పత్తి కోసం పశువులకు అనుచితంగా ఆక్సిటోసిన్ ఇంజెక్షన్లు ఇవ్వడం నుంచి, కాలం చెల్లిన పాలపొడి, పామ్ ఆయిల్, యూరియా, నీరు కలిపి కృత్రిమ పాలు తయారు చేయడం వరకు అనేక అక్రమాలు జరుగుతున్నాయి. గంజి పొడి, హైడ్రోజన్ పెరాక్సైడ్, కాస్టిక్ సోడా, వంట సోడా, డిటర్జెంట్లు, మెలమైన్, మాల్టో డెక్స్ట్రిన్ వంటి రసాయనాలను కలిపి పాలను చిక్కగా, తెల్లగా కనిపించేలా చేసి విక్రయించడం ఆరోగ్యానికి తీవ్రమైన ప్రమాదం. ఇటువంటి కల్తీ పదార్థాలు శరీరంలోకి వెళ్లినప్పుడు అజీర్తి, కడుపునొప్పి, వాంతులు వంటి తక్షణ సమస్యలు తలెత్తడమే కాదుదీర్ఘకాలంలో మూత్రపిండాల వైఫల్యం, కాలేయ సమస్యలు, నాడీ సంబంధిత వ్యాధులు, క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులకు దారితీసే అవకాశముంది. అధికారిక గణాంకాల ప్రకారం గత కొన్నేళ్లలో దేశవ్యాప్తంగా వేలాది పాల కల్తీ కేసులు నమోదయ్యాయి. అనేక కేసుల్లో జరిమానాలు, శిక్షలు విధించినా, శిక్షల తీవ్రత తక్కువగా ఉండటం వల్ల నేరగాళ్లకు భయం కలగడం లేదు. లాభాల ఆశతో ప్రజల ఆరోగ్యాన్ని పణంగాపెట్టే ఈ అక్రమవ్యాపారం కొనసాగుతూనే ఉంది. 'తెల్లనివన్నీ పాలు కావు' అన్న జాగ్రత్త స్పృహ ప్రతి వినియోగదారుడిలో కలగాలి. కల్తీ పాలను గుర్తించడం సాధారణ ప్రజలకు సులభం కాదు. కానీ రంగు, వాసన, రుచి, చిక్కదనంలో అనుమానాస్పద మార్పులు కనిపిస్తే అప్రమత్తం కావాలి. అనుమానాస్పద ఉత్పత్తులను సంబంధిత ఆహార భద్రతశాఖలకు ఫిర్యాదు చేయడం ప్రతిపౌరుడి బాధ్యత. సరైన లైసెన్సులు ఉన్న, నాణ్యత ప్రమాణాలు పాటించే సంస్థల నుంచే పాలను కొనుగోలు చేయాలి. ప్యాకేజింగ్‌పై తయారీ తేదీ, గడువు తేదీ, ప్రమాణ చిహ్నాలు పరిశీలించడం అలవాటు చేసుకోవాలి. ఆహార భద్రత విభాగాల్లో ఖాళీలను భర్తీచేయడం, ప్రయోగశాలల సంఖ్య పెంచడం, ఆకస్మిక తనిఖీలు నిర్వహించడం, కఠినశిక్షలు అమలు చేయడం ద్వారా మాత్రమే ఈ కల్తీదందాను అరికట్టవచ్చు. కల్తీ పాల తయారీని తీవ్రనేరంగా పరిగణించి కఠిన కారాగార శిక్షలువిధించేలా చట్టాలను అమలు పరచాలి. పశువుల సంక్షేమా న్ని కాపాడే చర్యలతో పాటు పాడి పరిశ్రమను మరింత పారదర్శకంగా మార్చాలి. కల్తీ ఆహారాల కారణంగా ప్రజలు అనారోగ్యానికి గురైతే వైద్యవ్యయాలుపెరుగుతాయి, ఉత్పాదకత తగ్గుతుంది, కుటుంబాల ఆర్థికస్థితి దెబ్బతింటుంది. ప్రజారోగ్యాన్ని కాపాడడం అంటే కేవలం వ్యక్తిగత ఆరోగ్యమే కాదు దేశఆర్థిక భద్రతను కూడా కాపాడడం.

# బాలల భవితకు కొత్తదారి డిజిటల్ విద్య

వివి రమణ

ప్రస్తుత కాలం డిజిటల్ మయంగా ఎంత వేగంగా తన రూపును మార్చుకుంటూ రోజురోజుకు ఎంత వరకు పరివర్తన చెందగలుగుతుందో అది గమనించే వారికి సైతం ఊహకు అందని విధంగా ఉన్నదనిపిస్తుంది. పూర్వం పారిశ్రామిక విప్లవం అనేది కొన్ని దశాబ్దాల పాటు కొన్ని ప్రాంతాలకే పరిమితమై ఆ ప్రాంతంలోనే వేగంగా తన అభివృద్ధిని చూపించగలిగింది. కానీ నేటి ఈ డిజిటలికరణకు ఎటువంటి సరిహద్దులు లేకుండా యావత్ భూగోళమే ఒక గ్రామంగా మారిపోవటమే కాకుండా ప్రీ ప్రైమరీ, ప్రైమరీ బాల్యానికి సైతం డిజిటల్ విద్యరూపంలో చెంతకు చేరిందనే విషయాన్ని అర్థవంతంగా తెలియపరుస్తున్నది ఈ డిజిటల్ యుగం. ప్రస్తుతం ఇది టెక్నాలజీ యుగం. కాబట్టి ఈ 'టెక్నాలజీ అనేది విద్యతో కలిసినప్పుడు మాత్రమేజ్ఞానం సమాజానికి శక్తిగా మారుతుంది. అని డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం వివరించారు. నెల్సన్ మండేలా సైతం విద్య అనేది ప్రపంచాన్నే మార్చే శక్తివంతమైన ఆయుధం అనే వివరించారు. నేడు ఈ 'విద్య'ను డిజిటల్ సాధనాలే ప్రతి వ్యక్తి దగ్గరకు చేరుస్తుందని మనం ఆశాభావం వ్యక్తపరచవచ్చు. ఆకోవలోనే మన జాతీయ విద్యా విధానం 2020 అనేది నేటి బాలలకు డిజిటల్ విద్యను, దాని శిక్షణకోసం అని ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసి ద్వారా అందుబాటులో తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తుంది. దీని ప్రకారం ప్రీ ప్రైమరీ, ప్రైమరీ వయస్సు నుండే ఐసిటి (ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ)లతో విద్యను అందించడం బోధించడం పిల్లలకు అలవాటు చేయడం లాంటి సరికొత్త విధానాలను అందించేందుకు జాతీయ విద్యా విధానం 2020 సమాయత్తం అవుతుంది. అయితే 'బాలల భవితకు' భద్రత ఆందోళనల దృష్ట్యా యునెస్కో డిజిటల్‌ను ఉపయోగించే విధాన క్రమంలో తగుసూచనలను తెలియపరుస్తుంది. అది ప్రధానంగా నాలుగు విషయాలపై ఫోకస్ చేయడం జరిగింది. సాంకేతిక ఆధారిత ప్రపంచంలో తాజా సమాచారం పొందడానికి ఐసిటి ఉపయోగమనేది ఉపయోగకరం అయినప్పటికీ అధికంగా సాంకేతికతనుఉపయోగించే క్రమంలో విద్యార్థుల శారీరక ఆరోగ్యానికి హానికరమని గమనించబడింది. దీనిని అధిగమించేందుకు డిజిటల్ తీరును అదేవిధంగా పిల్లలు చూసినప్పుడు కంటి సమస్యలు, నిద్ర సమస్యలు, తలనొప్పి, వెన్నెముక సమస్యలు లాంటివి విద్యార్థులు ఎదుర్కోవలసి వస్తుంది. కాబట్టి విద్యార్థులు తల్లిదండ్రులు తగు జాగ్రత్తలను అనుసరించి డిజిటల్



తెరను ఉపయోగించే సమయం తక్కువగాఉండేటట్లు చూసుకోవడం, ఆ సమయంలో ఉపాధ్యాయుల పర్యవేక్షణలో వారి సూచనలతో సమస్యను అధిగమించి నేటి ప్రపంచంతో పాటు నడవవలసి ఉన్నదని తెలియపరుస్తుంది. ఈ మధ్య కాలంలో చాలామంది విద్యార్థులు ఆరుబయట ఆడే ఆటల కన్నా డిజిటల్ తెరపై ఆడే ఆటలకు సమయాన్ని ఎక్కువ కేటాయించటం జరుగుతుంది. ఇది శారీరక అభివృద్ధిని పూర్తిగా కుంటుపరుస్తుందని యునెస్కో ఆందోళన వ్యక్తపరుస్తుంది. అంతేకాకుండా డిజిటల్ తెరకు అలవాటు పడి స్నేహితులతో పరస్పరం భౌతికంగా ఆలోచనత్మక జ్ఞానం పంచుకోకుండా డిజిటల్ చాటింగ్ ద్వారా సమయాన్ని గడుపుతున్నారు. దీని ద్వారా సామాజిక భావోద్వేగాలకు, విలువలకు దూరమై, వారి ప్రవర్తనలో మార్పు వస్తుంది. అందుచే ఇలాంటి వాటిని సైతం యునెస్కో హితువు పలుకుతూ సూచనలు, జాగ్రత్తలు వివరిస్తూ కొన్ని పర్యవేక్షణల మధ్య తగువిధంగా డిజిటల్ విద్యను అందించవచ్చని అభిప్రాయపడుతుంది. ప్రపంచవ్యాప్తంగా కోవిడ్ 19 పరిస్థితుల ప్రభావంగా విద్యార్థుల తరగతులు డిజిటల్ తరగతులుగా మారిన విషయం తెలిసిందే. ఆ సమయంలో మన రాష్ట్రంలో సైతం విద్యార్థులకు ట్యాబ్ల ద్వారా డిజిటల్ విద్యను చేరువ చేయటం జరిగింది. ప్రీ ప్రైమరీ ప్రైమరీ విద్యార్థులు సైతం వినోదం కోసమని పడిన అలవాటు కాస్త ఆన్లైన్ గేమ్ లాంటి హానికరమైన విషయాల వైపు అడుగులు వేసే పరిస్థితులకు లోనవుతున్నారు కాబట్టి ఉపాధ్యాయులు డిజిటల్ విద్య గురించి వివరించే సమయంలో హానికరమైన వెబ్‌సైట్‌ల గురించి, ప్రమాదకరమైన విషయాలను తెలియపరచవలసిన ఆవశ్యకతను యునెస్కో తెలియపరుస్తుంది. యునెస్కో సూచించిన విషయాలలో ఇదొకటి. దీని ప్రకారం మొదటగా ఉపాధ్యాయులు సాంకేతికత వినియోగం అలవాటు పడి, దానిలో ఉన్న ప్రమాదాలను తెలుసుకోవడం కోసం విమర్శణాత్మకంగా ఆలోచన చేయవలసి ఉన్నదని యునెస్కో అభిప్రాయాన్ని వ్యక్తపరిచింది. బయట ఆడటానికి బదులుగా పిల్లలు మొబైల్ ఫోన్లో లాప్టాప్లో లేదాటీవీల ముందు ఇంట్లోనే ఎక్కువ సమయం గడపడం ఇష్టపడుతున్నారు. ఈ విధానం శారీరకంగా మానసికంగా ప్రమాదకరమైనదని తెలుపుతుంది. ఇలాంటి సమస్యలు లేకుండా ఉపాధ్యాయులు కొన్ని విషయాలను గుర్తుంచుకోవలసి ఉన్నదని సూచించింది. విద్యార్థులు ఐసిటి ఉపయోగించేటప్పుడు చూపు, వినికిడి, స్పర్శ మొదలగునవి ఉపయోగించగలగాలి. విద్యా విషయాలను మాత్రమే సపోర్టు చేయాలి, ఆటల ద్వారా నేర్చుకునే విధంగా సపోర్టు చేయాలి, సహకార భాగస్వామ్యాన్ని ప్రోత్సహించాలి, సమగ్రతను మద్దతు ఇవ్వాలి, వ్యక్తిగత భద్రతదేశ భద్రతను కాపాడాలి, హింసను వదిలిపెట్టాలి, బట్టి విధాన ధోరణులను నివారించాలి.

# మమత తీరును ప్రజలు క్షమించరు

## సంతాల్ ఘటన రాజ్యాంగాన్ని అగౌరవ పరచడమే: దేశంలోనే తొలి 'రింగ్‌మెట్రో'ను ప్రారంభించిన ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ, మార్చి 8:** రాష్ట్రపతి ద్రౌపది ముర్మును బెంగాల్ పర్యటనలో మమతా బెనర్జీ సర్కార్ తీవ్రంగా అవమానించింది, ఇది రాజ్యాంగాన్ని అగౌరవ పరచడమే కాదు, సంప్రదాయ ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీసే చర్య అని ప్రధానమంత్రి నరేంద్రమోడీ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఆదివారం ఢిల్లీలో నిర్వహించిన బహిరంగ సభలో ప్రధాని మోడీ మాట్లాడుతూ, అంతర్జాతీయ సంతాల్ సమ్మేళనం వేదికను అకస్మాత్తుగా మార్చడంపై మండిపడ్డారు. "రాష్ట్రపతి పట్ల బెంగాల్ ప్రభుత్వం వ్యవహరించిన తీరు అత్యంత అవమానకరం. ప్రజాస్వామ్యాన్ని, గిరిజన సాధికారతను నమ్మే ప్రతి ఒక్కరూ ఈ ఘటనతో దిగ్భ్రాంతికి గురయ్యారు. స్వయంగా గిరిజన సామాజిక వర్గానికి చెందిన రాష్ట్రపతి వ్యక్తం చేసిన ఆవేదన భారతీయులందరినీ కలిచివేసింది" ప్రధాని మోడీ పేర్కొన్నారు. "శనివారం పశ్చిమ బెంగాల్ టిఎంసి ప్రభుత్వం రాష్ట్రపతి ద్రౌపది ముర్మును తీవ్రంగా అవమానించింది. ద్రౌపది ముర్ము, శాంతల్ కమ్యూనిటీ వేడుకలో పాల్గొనడానికి బెంగాల్‌కు వెళ్లారు. అయితే, రాష్ట్రపతికి స్వాగతం పలకడానికి ముఖ్యమంత్రి లేదా మంత్రివర్గ సభ్యులు కూడా వెళ్లలేదు. అంతేగాక, వేడుకకు సంబంధించిన వేదికను మార్పు చేసి, గందరగోళం సృష్టించారు. ఈ చర్య రాష్ట్రపతికి




స్వల్ప అవమానం మాత్రమే కాదు, భారత రాజ్యాంగానికి కూడా అగౌరవం. ఇది రాజ్యాంగ స్ఫూర్తిని కూడా అగౌరవపరుస్తుంది. అంతేకాకుండా, ఇది ప్రజాస్వామ్యంలోని గొప్ప సంప్రదాయాన్ని దెబ్బతీస్తుంది. జీవితాంతం అట్టడుగు వర్గాల అభ్యున్నతి కోసం ముర్ము పోరాడారు. ఇది అలాంటి ప్రతి సోదరి, కుమార్తెకు అవమానం" అని ఆయన అన్నారు. తృణమూల్ కాంగ్రెస్ "మురికి రాజకీయాలకు" పాల్పడిందని ప్రధాని మోడీ అభివర్ణించారు. ఇందుకు తృణమూల్ కాంగ్రెస్ భారీ చెల్లించుకోక తప్పదని, ఆ పార్టీ "అహంకారం" త్వరలో విచ్ఛిన్నమవుతుందని అన్నారు. "మన దేశంలో ఒక వ్యక్తి ఎంత శక్తివంతుడైనా, చివరికి అతను అహంకారంతో నాశనం అవుతాడని చెబుతారు. దేశ అధ్యక్షురాలి గౌరవాన్ని అవమానించిన టిఎంసి మురికి రాజకీయాలు, అధికార దురహంకారం త్వరలో విచ్ఛిన్నమవుతాయి. పశ్చిమ బెంగాల్‌లోని జ్ఞానోదయం పొందిన ప్రజలు ఒక మహిళను, ఒక గిరిజనుడిని, దేశ అధ్యక్షురాలిని అవమానించినందుకు టిఎంసిని ఎప్పటికీ క్షమించరు. దేశం కూడా వారిని ఎప్పటికీ క్షమించదు. దేశంలోని గిరిజన సమాజం వారిని ఎప్పటికీ క్షమించదు. దేశంలోని మహిళలు వారిని ఎప్పటికీ క్షమించరు" అని ఆయన అన్నారు.

**పేదలను 'ఆప్' గాలికొదిలేసింది**

ఆదివారం ఢిల్లీలో రూ.33,500 కోట్లకు పైగా విలువైన బహుళ అభివృద్ధి పనులను ప్రధాని మోడీ శంకుస్థాపన చేసి ప్రారంభించారు. దాదాపు రూ. 18,300 కోట్ల విలువైన ఢిల్లీ మెట్రో రెండు కొత్త కారిడార్లను కూడా ప్రధాని ప్రారంభించారు. వీటిలో దాదాపు 12.3 కి.మీ.ల మజ్లిస్ పార్క్‌మోజ్‌పూర్ బాబర్‌పూర్ (పింక్ లైన్) కారిడార్, దాదాపు 9.9 కి.మీ.ల దీపాలి చౌక్ మజ్లిస్ పార్క్(మెజెంటా లైన్) కారిడార్ ఉన్నాయి. ఈ సందర్భంగా ప్రధాని మోడీ మాట్లాడుతూ, ఢిల్లీ అభివృద్ధి ప్రయాణానికి కొత్త వేగాన్ని అందించడానికి సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. "ఏడాది క్రితం, అందరి విశ్వాసంతో బిజెపి డబుల్ ఇంజిన్ ప్రభుత్వాన్ని ఎన్నుకున్నారు, ఇప్పుడు, దాని ఫలితాలు ఇప్పటికే ఇక్కడ కనిపిస్తున్నాయి. ఈ అభివృద్ధి ప్రాజెక్టులకు కృషి చేసిన ప్రతి ఒక్కరినీ అభినందిస్తున్నాను" అని ఆయన అన్నారు. "ఢిల్లీ 'ఆప్దా' నుండి విముక్తి పొందడం ఎంత ముఖ్యమో ఈ అభివృద్ధి ప్రాజెక్టులు కూడా నిదర్శనం" అని అన్నారు. ఆప్దా ప్రభుత్వం ఇక్కడ లేకుంటే, ఈ మెట్రో ఫేజ్4 ప్రాజెక్ట్ చాలా కాలం క్రితమే పూర్తయ్యేది. అయితే, రాజకీయ ప్రయోజనం కోసం, ఈ ఆప్దా వ్యక్తులు లక్షలాది ఢిల్లీ వాసులకు సౌకర్యాలను నిలిపివేశారు. "బిజెపి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత, పరిస్థితులు మారిపోయాయి" అని ఆయన అన్నారు, పరిధీయ ఎక్స్‌ప్రెస్‌వే నిర్మాణంతో, లక్షలాది వాహనాలు ఇకపై నగరంలోకి ప్రవేశించాల్సిన అవసరం లేదని ప్రధాని మోడీ అన్నారు.

# మంటల్లో పశ్చిమాసియా

## ఇరాన్‌కు మరిన్ని సర్‌ప్రైజ్‌లు: నెతన్యాహు



**టెల్అవీవ్, మార్చి 8:** ఇరాన్‌పై భీకర దాడులు కొనసాగుతోన్న నేపథ్యంలో ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు కీలక వ్యాఖ్యలు చేశారు. ముందు ముందు ఇరాన్‌కు మరిన్ని సర్‌ప్రైజ్‌లు ఇస్తామన్నారు. ప్రజలు ఆ దేశంలోని ప్రభుత్వాన్ని పడగొట్టే క్షణం దగ్గరలో ఉందన్నారు. ఈ దాడులతో తాము ఇరాన్‌ను విభజించడానికి ప్రయత్నించట్లేదని.. నిరంకుశ పాలన నుంచి ఆ దేశానికి విముక్తి కలిగించడానికి ప్రయత్నిస్తున్నామని చెప్పారు. ఇరాన్ విషయంలో తమ ప్రణాళికలోని తదుపరి దశను త్వరలో చేరుకోబోతున్నామని నెతన్యాహు అన్నారు. ఇజ్రాయెల్ చేస్తున్న దాడులతో కీలక నేతలను కోల్పోయి ఇరాన్ ప్రభుత్వం ఇప్పటికే తీవ్రంగా నష్టపోయిందని నెతన్యాహు అన్నారు. ఆ దేశంలోని ప్రస్తుత పాలనను అస్థిరపర చడానికి ప్రభుత్వంలో మార్పులు తీసుకురావడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. అక్కడి పాలక వర్గాన్ని గద్దె దించడానికి ఇదే సరైన సమయమని తెలిపారు. ఆ దేశ ప్రభుత్వాన్ని అక్కడి ప్రజలే స్వయంగా పడగొట్టాలన్నారు. అప్పుడే ఇరాన్-ఇజ్రాయెల్‌లతో శాంతి నెలకొంటుందని తెలిపారు.

## కువైట్‌పై ఇరాన్ దాడులు.. అగ్నికీలల్లో భారీ టవర్



**కువైట్ సిటీ, మార్చి 8:** పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో అమెరికా, ఇజ్రాయెల్ యుద్ధ విమానాలు ఇరాన్‌పై భీకరంగా విరుచుకుపడుతున్నాయి. ఇరాన్ సైతం ఇజ్రాయెల్‌తో పాటు గల్ఫ్ దేశాలపై దాడులు కొనసాగిస్తోంది. శనివారం రాత్రి ఇరాన్ మరోసారి తమపై క్షిపణులు, డ్రోన్లను ప్రయోగించినట్లు కువైట్ రక్షణ మంత్రిత్వ శాఖ పేర్కొంది. ఈ దాడుల్లో పలువురు ప్రజలు తీవ్రంగా గాయపడగా అనేక భవనాలు దెబ్బతిన్నాయని తెలిపింది. డ్రోన్ల శకలాలు పడడంతో నగరంలోని సోషల్ సెక్యూరిటీ టవర్‌కు మంటలు అంటుకున్నట్లు వెల్లడించింది. దానిలో అనేకమంది ప్రజలు చిక్కుకున్నారని, మంటలు ఆర్పడానికి అగ్నిమాపక దళాలు తీవ్రంగా శ్రమిస్తున్నాయని అధికారులు పేర్కొన్నారు. దాడులు కొనసాగుతున్నందున సురక్షితమైన ప్రదేశాల్లో తలదాచుకోవాలని కువైట్ సైన్యం ప్రజలకు సూచించింది. మరోవైపు ఆ దేశ అంతర్జాతీయ విమానాశ్రయానికి చెందిన ఇంధన ట్యాంకులు, పలు ప్రభుత్వ భవనాలకు అంటుకున్న మంటలను పూర్తిగా అదుపులోకి తీసుకువచ్చినట్లు అగ్నిమాపక దళం పేర్కొంది. సౌదీ అరేబియా, ఖతార్‌లలోనూ దాడులు కొనసాగుతున్నాయి. గల్ఫ్ దేశాలపై దాడులు చేస్తున్నందుకు ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ క్షమాపణలు చెప్పినప్పటికీ.. టెహ్రాన్ ఆయా దేశాలపై దాడులు కొనసాగిస్తుండడం గమనార్హం.

**ఇజ్రాయెల్ హెచ్చరికలు..**

మరోవైపు ఇరాన్‌కు మద్దతిస్తున్న హెజ్‌బొల్లా నేతలే లక్ష్యంగా దాడులు చేపట్టినట్లు ఇజ్రాయెల్ ప్రకటించింది. బీరుట్‌లోని హెజ్‌బొల్లా స్థావరాలను లక్ష్యం చేసుకున్నందువల్ల ఆ ప్రాంతాన్ని వీలైనంత త్వరగా ఖాళీ చేయాలని స్థానిక ప్రజలను హెచ్చరించింది. సెంట్రల్ బీరుట్‌లోని ఓ హోటల్‌పై ఇజ్రాయెల్ జరిపిన దాడిలో నలుగురు ప్రాణాలు కోల్పోయినట్లు బెననాన్ ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది.

# స్కూలుపై దాడి అమెరికా చర్యకాదు!

### అది ఇరాన్ దుశ్చర్య మాత్రమే: ట్రంప్

**వాషింగ్టన్, మార్చి 8:** ఇరాన్‌లోని ఓ ప్రాథమిక పాఠశాలపై జరిగిన ఘోర బాంబు దాడిలో 160 మంది మరణించిన ఘటనపై అమెరికాకు ఎలాంటి సంబంధం లేదని అగ్రరాజ్యం అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తేల్చిచెప్పారు. ఎయిర్ ఫోర్స్ వన్ విమానంలో మయామికి వెళ్తున్న సమయంలో విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఇరాన్‌తో జరుగుతున్న యుద్ధం, తాజా పరిణామాలపై ఆయన సుదీర్ఘంగా స్పందించారు. పాఠశాల దాడి గురించి విలేకరులు ప్రశ్నించగా ట్రంప్ ఆ ఆరోపణలను ఖండించారు. "నేను చూసిన సమాచారం, ఆధారాల ప్రకారం అది కచ్చితంగా ఇరాన్ చేసిన పనే. వారి ఆయుధాలు, మందుగుండు సామాగ్రి చాలా అస్థిరంగా ఉంటాయి. వాటికి లక్ష్యాన్ని ఛేదించే కచ్చితత్వం అస్సలు ఉండదు. గురి తప్పి వారి పాఠశాల మీదే పడి ఉండవచ్చు తప్ప, మేము స్కూల్ పిల్లలపై దాడులు చేయం. ఇది పూర్తిగా వారి తప్పిదమే, అని ట్రంప్ స్పష్టం చేశారు. యుద్ధం పురోగతిపై ట్రంప్ పూర్తి ఆత్మవిశ్వాసాన్ని వ్యక్తం చేశారు. తాము యుద్ధంలో గొప్ప విజయాలు సాధిస్తున్నామని, ఇరాన్ అనే దుష్ట సామ్రాజ్యాన్ని దాదాపు నేలమట్టం చేశామని వ్యాఖ్యానించారు. ఇరాన్ నౌకాదళంలోని 44 ఓడలను, వైమానిక దళంలోని ప్రతి విమానాన్ని మేము ధ్వంసం చేశాం. వారి క్షిపణి తయారీ కేంద్రాలపై, డ్రోన్ల నిల్వలపై తీవ్ర దాడులు జరిపాం. ఫలితంగా ఇప్పుడు ఇరాన్ నుంచి వచ్చే దాడులు నామమాత్రంగా మారాయి. యుద్ధం మొదలైన మొదటి రెండు రోజులతో పోలిస్తే, ప్రస్తుతం వారు కేవలం 9 శాతం సామర్థ్యంతోనే పోరాడుతున్నారు. వారి దగ్గరున్న 70 శాతం లాంచర్లు నాశనమయ్యాయి. అవి చాలా ఖరీదైనవి, తిరిగి సమకూర్చుకోవడం వారికి చాలా కష్టం. వారి నాయకత్వం అంతా దాదాపు అంతమైందని అమెరికా విజయాలను ట్రంప్ వివరించారు. యుద్ధం ఎప్పుడు ముగుస్తుందన్న ప్రశ్నకు ట్రంప్ బదులిస్తూ, తాను కాలపరిమితిని అంచనా వేయనని, ఎంత సమయం పడితే అంత కాలం పోరాడుతామని చెప్పారు. ఇరాన్ సైన్యం దాదాపు తుడిచిపెట్టుకుపోయిందని, వారిపై మరింత



తీవ్రంగా విరుచుకుపడాలా వద్దా అనేది ఇంకా నిర్ణయించలేదని అన్నారు. ఈ పర్యటనలో ట్రంప్ వెంట అమెరికా ప్రత్యేక ఎన్వాయ్ స్టీవ్ విట్‌కాఫ్ కూడా ఉన్నారు. ఆయన మాట్లాడుతూ, దౌత్య పరమైన పరిష్కారం సాధ్యమేనని, అయితే అది పూర్తిగా ఇరాన్ చేతుల్లోనే ఉందన్నారు. గత చర్చల్లో వారు సహకరించలేదు. తమకు యురేనియం శుద్ధి చేసే హక్కు ఉందని, 11 అణుబాంబులకు సరిపడా ఇంధనం తమ వద్ద ఉందని గొప్పలు చెప్పారు. యుద్ధంలో గెలవలేని దాన్ని, చర్చల ద్వారా సాధించలేమని వారికి స్పష్టం చేశాం. కాబట్టి వారి అహంకారం, ధోరణి మారాలని విట్‌కాఫ్ అభిప్రాయపడ్డారు. గతనెల 28న అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా జరిపిన దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ మరణించిన తర్వాత పరిస్థితులు తీవ్రరూపం దాల్చాయి. దీనికి ప్రతీకారంగా ఇరాన్ బహ్రెయిన్, కువైట్, ఖతార్, సౌదీ అరేబియా, యూఏఈ, జోర్డాన్ వంటి దేశాలపై క్షిపణి దాడులు చేసింది.

## ఖమేనీ మృతికి ట్రంప్ మూల్యం చెల్లించుకోవాల్సిందే: ఆలీ లారిజాని



**టెహ్రాన్, మార్చి 8:** ఇరాన్ సుప్రీం లీడర్ ఆయ తుల్లా అలీ ఖమేనీ మృతికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారీ మూల్యం చెల్లించుకోక తప్ప దని ఇరాన్ జాతీయ భద్రతా మండలి కార్యదర్శి డాక్టర్ అలీ లారిజాని తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. ఖమేనీపై జరిగిన దాడికి కచ్చితంగా ప్రతీకారం తీర్చుకుంటామని ఆయన స్పష్టం చేశారు. ఖమేనీకి అత్యంత సన్నిహితుడైన లారిజాని సోషల్ మీడియా వేదికగా అమెరికా తీరుపై నిప్పులు చెరిగారు. ట్రంప్‌ను తాము వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. దాడుల్లో తమ నాయకుడితో పాటు అనేక మంది సామాన్య పౌరులు కూడా ప్రాణాలు కోల్పోయారని, ఇది సాధారణ విషయం కాదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందుకు అమెరికా తగిన మూల్యం చెల్లించుకోవాల్సిందేనని హెచ్చరించారు. మరోవైపు, యుద్ధ వాతావరణం నేపథ్యంలో అనేక మంది అమెరికా సైనికులను తాము బంధించి జైళ్లలో ఉంచామని లారిజాని సంచలన వ్యాఖ్యలు చేశారు. కేవలం ఆరుగురు సైనికులే చనిపోయారంటూ ట్రంప్ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని, వాస్తవానికి మృతుల సంఖ్య చాలా ఎక్కువగా ఉందని ఆరోపించారు. భవిష్యత్తులో కల్పిత ప్రమాదాల పేరుతో ఈ మరణాలను అమెరికా బయటపెట్టే అవకాశం ఉందన్నారు. వెనెజులా అధ్యక్షుడు నికోలస్ మదురోను బందీగా తీసుకెళ్లినట్లే, ఇరాన్‌లో కూడా యుద్ధాన్ని త్వరగా ముగించాలని అమెరికా భావించిందని, కానీ వారి ప్లాన్ బెడిసికొట్టిందని లారిజాని స్థానిక మీడియాతో పేర్కొన్నారు.



## పూజ చేసుకుంటున్న వారిపై బాంబులు

**ఢాకా, మార్చి 8:** బంగ్లాదేశ్ హిందువులపై దాడులు రోజురోజుకూ తీవ్రమవుతున్నాయి. తాజాగా మరో ఘటన చోటుచేసుకుంది. కోమిల్లా ప్రాంతంలో శనివారం పూజ చేసుకుంటున్న హిందువుల బృందంపై గుర్తుతెలియని దుండగులు బాంబులు విసిరారు. భయభ్రాంతులకు గురైన ప్రజలు పరుగులు పెట్టారు. పూజా కార్యక్రమానికి హాజరైన పలువురు ఈ ఘటనలో గాయపడినట్లు స్థానిక మీడియా వర్గాలు వెల్లడించాయి. పూజారి కేశవ్ చక్రవర్తి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. కేసు నమోదు చేసుకొని నిందితుల కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## మహిళల్లో పెరుగుతున్న 'ఇస్కీమిక్ హార్ట్ డిసీజ్'

**న్యూఢిల్లీ, మార్చి 8:** గుండెపోటు అనేది కేవలం పురుషులకు మాత్రమే కాకుండా మహిళల ప్రాణాలకుకూడా ముప్పుతెస్తోందని సర్వేల్లో స్పష్టం అయింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ డేటాను చూస్తే 2021లో భారతదేశంలో కొవిడ్ 19 తర్వాత మహిళల మరణాలకు "ఇస్కీమిక్ హార్ట్ డిసీజ్ "(ఐహెచ్ డీ) రెండో ప్రధాన కారణమని తేలింది. ఆ ఏడాది లక్ష మందిలో 159.9 మంది కొవిడ్ వల్ల మరణించగా, 99.4 మంది ఈ గుండె జబ్బు కారణంగా ప్రాణాలు కోల్పోయారు. ఇస్కీమిక్ హార్ట్ డిసీజ్‌నే కరోనరీ హార్ట్ డిసీజ్ అని కూడా పిలుస్తారు. గుండెకు రక్తాన్ని సరఫరా చేసే ధమనుల గోడలలో కొవ్వు పదార్థం (ప్లాక్) పేరుకుపోవడం వల్ల ఈ సమస్య తలెత్తుతుంది. కాలక్రమేణా రక్తనాళాలు సన్నబడి, రక్త ప్రసరణకు ఆటంకం ఏర్పడుతుంది. ఒకవేళ ఆ ప్లాక్ పగిలి రక్తం గడ్డకడితే గుండెకు ఆక్సిజన్ అందక హార్ట్ ఎటాక్ వచ్చే ప్రమాదం ఉంది. ప్రపంచవ్యాప్తంగా మహిళల మరణాల్లో మూడో వంతు ఈ వ్యాధి వల్లే సంభవిస్తున్నాయని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మహిళల్లో గుండెపోటు లక్షణాలు పురుషులతో పోలిస్తే భిన్నంగా ఉంటాయి. సినిమాటిక్ స్టైల్లో



ఛాతీలో తీవ్రమైన నొప్పి అందరికీ రాకపోవచ్చు. అలసట, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, వాంతులు, దవడ లేదా వీపు భాగంలో నొప్పి వంటివి కనిపిస్తాయి. వీటిని చాలామంది ఒత్తిడి లేదా గ్యాస్ సమస్యగా భావించి నిర్లక్ష్యం చేస్తుంటారు. ఇదే ప్రాణాల మీదకు తెస్తోంది. ముఖ్యంగా మహిళల్లో మెనోపాజ్(నెలసరి ఆగిపోవడం) తర్వాత గుండె జబ్బుల ముప్పు పెరుగుతుంది. శరీరంలో రక్తనాళాలను రక్షించే ఈస్ట్రోజెన్ హార్మోన్ తగ్గడమే ఇందుకు కారణం. దీనికి తోడు అధిక రక్తపోటు, షుగర్, ఊబకాయం, వ్యాయామం లేకపోవడం వంటివి పరిస్థితిని మరింత దిగజారుస్తాయి. పొగతాగే అలవాటు ఉన్నవారిలో రక్తనాళాలు త్వరగా దెబ్బతింటాయి. జాగ్రత్తలు ముఖ్యం గుండెను కాపాడుకోవడానికి ఆరోగ్యకరమైన ఆహారం, రోజువారీ వ్యాయామం, బరువు నియంత్రణ చాలా అవసరమని వైద్యులు సూచిస్తున్నారు. సమస్య తీవ్రతను బట్టి యాంజియోప్లాస్టీ లేదా బైపాస్ సర్జరీ ద్వారా చికిత్స పొందవచ్చు. లక్షణాలు కనిపించిన వెంటనే డాక్టర్‌ను సంప్రదిస్తే ప్రాణాపాయం నుంచి బయటపడవచ్చని నిపుణులు చెబుతున్నారు.

## ఖమేనీ కుమారుడికి క్షిపణి దాడుల్లో గాయాలు



**టెహ్రాన్, మార్చి 8:** ఇరాన్ దివంగత సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ కుమారుడు మోజ్తబా ఖమేనీ ఇజ్రాయెల్ దాడిలో గాయపడ్డారు. ఖమేనీ వారసుడిగా మోజ్తబా పేరు వినిపిస్తోంది. అయితే ఫిబ్రవరి 28న లయన్స్ రోర్‌లో భాగంగా ఇజ్రా యెల్ చేపట్టిన దాడుల్లో అలీ ఖమేనీతో పాటు 40మంది కీలక నాయకులు, జనరల్స్ ప్రాణాలు కోల్పోయారు. ఈ దాడిలో మొజ్తబా భార్య జహ్రా కూడా మరణించారు. ఈ దాడి నుంచి మోజ్తబా మాత్రం ప్రాణాలతో బయటపడినట్లు తెలుస్తోంది. ఇజ్రాయెల్ దాడి చేసిన సమయంలో మోజ్తబా తన తండ్రితో పాటు కాంపౌండ్‌లోనే ఉన్నారా అన్న విషయం వెల్లడి కావాల్సి ఉంది. ఆయనకు గాయాల తీవ్రత కూడా తెలియరాలేదు. ఈ దాడి నుంచి మోజ్తబా ప్రాణాలతో బయటపడ్డారని, కానీ గాయపడ్డారని ఇజ్రాయెల్ భద్రతా అధికారులు కూడా భావిస్తున్నారు. అలీ ఖమేనీ తర్వాత ఇరాన్ తదుపరి నేతగా మోజ్తబా ముందు వరుసలో ఉన్నారు. ఇతనికి ఇరాన్‌లోని శక్తిమంతమైన ఐఆర్జీసీపై పట్టు ఉంది. దీనితో ఆయనే ఖమేనీ స్థానాన్ని భర్తీ చేస్తారని అందరూ భావిస్తున్నారు. అయితే 88 మంది సభ్యులున్న గార్డియన్ కౌన్సిల్‌లో కొందరు మాత్రం అధికారాన్ని వారసత్వంగా మోజ్తబాకు అందించడాన్ని వ్యతిరేకిస్తున్నారని సమాచారం. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కూడా మోజ్తాబాకు అధికారం అప్పగించేందుకు ససేమీరా అంటున్నారు.

## 90 యేళ్ల వృద్ధురాలిపై సామూహిక లైంగికదాడి

**ఖాండ్వా, (ఎంపి), మార్చి 8:** మానవత్వం సిగ్గుతో తలదించుకునే దారుణ ఘటన మధ్యప్రదేశ్‌లో చోటుచేసుకుంది. ఖాండ్వా జిల్లాలో 90 ఏళ్ల వృద్ధురాలిపై నలుగురు దుండగులు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. ప్రస్తుతం బాధితురాలి పరిస్థితి విషమంగా ఉందని, ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని అధికారులు తెలిపారు. ఈ అమానవీయ ఘటన రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపింది. ఖాండ్వా జిల్లాలోని ఓ గ్రామంలో 90 ఏళ్ల వృద్ధురాలు ఒంటరిగా నివసిస్తున్నారు. అర్ధరాత్రి సమయంలో ఆమె ఇంట్లో నిద్రిస్తుండగా ముఖాలకు ముసుగులు ధరించిన నలుగురు వ్యక్తులు ఇంట్లోకి చొరబడ్డారు. ఒంటరిగా ఉన్న ఆ వృద్ధురాలిపై సామూహిక అత్యాచారానికి ఒడిగట్టారు.


## రాష్ట్రపతి ప్రొటోకాల్ అవమానంపై కేంద్రం సీరియస్

**న్యూఢిల్లీ, మార్చి 8:** పశ్చిమ బెంగాల్ పర్యటనకు వెళ్లిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు తగిన గౌరవం ఇవ్వకుండా అక్కడి మమతా బెనర్జీ ఆధ్వర్యంలోని టీఎంసీ ప్రభుత్వం అవమానించింది. ఈ విషయంపై స్వయంగా రాష్ట్రపతి అసహనం వ్యక్తం చేశారు. ఇప్పుడీ అంశం రాజకీయ రంగు పులుముకుంది. టీఎంసీ ప్రభుత్వంపై కేంద్రంలోని బీజేపీ మండిపడుతోంది. మరోవైపు రాష్ట్రపతి పర్యటన కోసం తగిన ఏర్పాట్లు చేయకపోవడంపై, నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై కేంద్ర హోం శాఖ కూడా ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ మేరకు పశ్చిమ బెంగాల్ ప్రధాన కార్యదర్శి నందిని చక్రవర్తిని వివరణ కోరుతూ నోటీసులు జారీ చేసింది. ప్రధానంగా నాలుగు అంశాలపై ప్రభుత్వానికి ప్రశ్నలు సంధించింది. రాష్ట్రపతికి స్వాగతం పలికేందుకు ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, చీఫ్ సెక్రెటరీ, డీజీపీ ఎందుకు రాలేదు, రాష్ట్రపతికి వాష్‌రూమ్‌లో నీళ్లు కూడా ఎందుకు ఏర్పాటు చేయలేదు, రాష్ట్రపతి పర్యటనకు ఎంపిక చేసిన మార్గం మొత్తం చెత్తతో నిండి ఉంది. ఇలాంటి మార్గాన్ని ఎందుకు ఎంచుకున్నారు, ఈ నిర్లక్ష్యానికి బాధ్యులైన డార్జిలింగ్ జిల్లా జడ్జి, కమిషనర్ ఆఫ్ పోలీస్, సిలిగురి జిల్లా అడిషనల్ జడ్జిలపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు, అంటూ ప్రశ్నలు సంధించింది. వీటికి ఈ రోజు సాయంత్రం ఐదు గంటలలోపు సమాధానం చెప్పాలని



ఆదేశించింది. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శనివారం బెంగాల్‌లో పర్యటించారు. సాధారణంగా రాష్ట్రపతి పర్యటనకు వచ్చినప్పుడు సీఎం, చీఫ్ సెక్రెటరీ, మంత్రులు వంటి వారు స్వాగతం పలుకుతారు. కానీ, ద్రౌపది ముర్ము పర్యటనకు వీరు గైర్హాజరయ్యారు.

## యుద్ధంలో గెలిచాక మీ సాయం దేనికి:ట్రంప్



**వాషింగ్టన్, మార్చి 8:** ఇరాన్‌తో యుద్ధం వేళ, బ్రిటన్ ప్రధానమంత్రి తీరుపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పశ్చిమాసియాకు విమాన వాహక నౌకలను పంపించే విషయంపై యూకే ప్రభుత్వం ఇంకా తేల్చుకోకపోవడంపై ట్రంప్ అసహనం వ్యక్తం చేశారు. యుద్ధం గెలిచిన తర్వాత తమతో కలిసే వ్యక్తులు అవసరం లేదని వ్యాఖ్యానించారు. యుద్ధంలో గెలిచాక మీ విమాన వాహక నౌకలను మోహరించాల్సిన అవసరం లేదని యూకే ప్రధాని కీర్ స్మార్టర్‌పై మండిపడ్డారు. ఈ మేరకు ఆయన తన ట్రూత్ సోషల్ మీడియా వేదికగా స్మార్టర్‌పై విమర్శలు గుప్పించారు. బ్రిటన్ రక్షణ మంత్రిత్వ శాఖ హెచ్ఎంఎస్ ప్రిన్స్ ఆఫ్ వేల్స్ విమాన వాహన నౌకను సిద్ధం చేస్తున్నట్లు తెలిపింది. రెండు విమాన వాహక నౌకలలో ఒకదానిని సిద్ధంగా ఉంచామని, అయితే పశ్చిమాసియాకు తరలించే అంశంపై తుది నిర్ణయం తీసుకోలేదని బ్రిటన్‌కు చెందిన ఒక అధికారి మీడియాతో మాట్లాడుతు తెలిపారు. ఈ వ్యాఖ్యలపై ట్రంప్ స్పందించారు. ఒకప్పుడు యూకే తమకు మిత్రదేశమని పేర్కొన్నారు. పశ్చిమాసియాకు రెండు విమాన వాహక నౌకలను తరలించే విషయంపై వారు తీవ్రంగా ఆలోచిస్తున్నారని మండిపడ్డారు. అమెరికా బలగాలకు ఇప్పుడు వాటి అవసరం లేదని స్పష్టం చేశారు. ఈ చర్యను తాము ఎప్పటికీ గుర్తు పెట్టుకుంటామని స్మార్టర్‌కు హెచ్చరిక జారీ చేశారు.

## గల్ఫ్‌దేశాల నుంచి 52 వేలమంది భారత్‌కు




**న్యూఢిల్లీ, మార్చి 8:** పశ్చిమాసియాలో యుద్ధం తీవ్రరూపం దాల్చిన నేపథ్యంలో గల్ఫ్ ప్రాంతం నుంచి 52 వేల మందికి పైగా భారతీయులను సురక్షితంగా స్వదేశానికి తరలించినట్లు కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రకటించింది. మార్చి 1 నుంచి 7వ తేదీ మధ్య ఈ తరలింపు ప్రక్రియ విజయవంతంగా కొనసాగిందని వెల్లడించింది. విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ మాట్లాడుతూ స్వదేశానికి తిరిగి వచ్చిన వారిలో 32,107 మంది భారత విమానయాన సంస్థల ద్వారా, మిగిలిన వారు విదేశీ విమానాల్లో ప్రయాణించారని తెలిపారు. గల్ఫ్ ప్రాంతంలో నెలకొన్న పరిస్థితులను, ముఖ్యంగా అక్కడ చిక్కుకున్న భారతీయుల సంక్షేమాన్ని ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షిస్తోందని ఆయన స్పష్టం చేశారు. బాధితులు, వారి కుటుంబాల సహాయార్థం న్యూఢిల్లీలో ఒక ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను, ప్రభావిత దేశాల్లోని భారత రాయబార కార్యాలయాల్లో 24/7 హెల్ప్‌లైన్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ హెల్ప్‌లైన్ల పూర్తి వివరాలను మంత్రిత్వ శాఖ అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామన్నారు.

## అమెరికా ఎంబసీ వద్ద భారీ పేలుడు



**ఓస్లో, మార్చి 8:** నార్వే రాజధాని ఓస్లోలో తీవ్ర కలకలం రేగింది. ఇక్కడి అమెరికా రాయబార కార్యాలయం సమీపంలో భారీ పేలుడు సంభవించింది. ఒక్కసారిగా పెద్ద శబ్దం రావడంతో ఎంబసీ సిబ్బంది, స్థానికులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. ఈ ఘటనతో నార్వే ప్రభుత్వం అప్రమత్తమైంది. సమాచారం అందుకున్న వెంటనే భద్రతా దళాలు ఘటనా స్థలానికి చేరుకుని ఆ ప్రాంతాన్ని తమ ఆధీనంలోకి తీసుకున్నాయి. ఈ పేలుడులో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదని నార్వే పోలీసులు అధికారికంగా ధృవీకరించారు. అయితే, ఎంబసీ భవనం వెలుపల స్వల్పంగా నష్టం వాటిల్లినట్లు తెలిపారు. ముందుజాగ్రత్త చర్యగా రాయబార కార్యాలయం చుట్టూ భారీగా బలగాలను మోహరించి భద్రతను కట్టుదిట్టం చేశారు. ప్రస్తుతం పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో అమెరికాను లక్ష్యంగా చేసుకుని ఈ దాడి జరిగి ఉండవచ్చన్న వాదనలు కూడా వినిపిస్తున్నాయి. ఇది ఉద్దేశపూర్వకంగా చేసిన చర్య అయ్యుంటుందన్న అనే కోణంలో దర్యాప్తు ముమ్మరం చేశారు.

## గల్ఫ్‌దేశాలపై ఇరాన్ దాడులు ఉధృతం



**టెహ్రాన్, మార్చి 8:** గల్ఫ్ దేశాలపై ఇరాన్ చేస్తున్న దాడులు తీవ్రరూపం దాల్చాయి. ఆదివారంతో ఈ ప్రాంతీయ యుద్ధం రెండో వారంలోకి అడుగుపెట్టింది. కువైట్, సౌదీ అరేబియా, ఖతార్, యూఏఈ దేశాలను లక్ష్యంగా చేసుకుని ఇరాన్ మరోసారి క్షిపణులు, డ్రోన్లతో విరు చుకుపడింది. ఇక సౌదీ అరేబియాలో రాజధాని రియాద్‌లోని దౌత్య కార్యాలయాలు, అమెరికా బలగాలున్న ప్రిన్స్ సుల్తాన్ ఎయిర్ బేస్ లక్ష్యంగా వచ్చిన 15 డ్రోన్లు, 3 బాలిస్టిక్ క్షిపణులను గాల్లోనే ధ్వంసం చేసినట్లు సౌదీ రక్షణ శాఖ తెలిపింది. ఖతార్‌పై ప్రయోగించిన 12 క్షిపణులను కూడా విజయవంతంగా అడ్డుకున్నారు. దుబాయ్ విమానాశ్రయం పరిసరాల్లో గుర్తుతెలియని వస్తువును కూల్చి వేయడంతో, విమానాశ్రయాన్ని కాసేపు మూసి వేశారు.

# అవకాశమిస్తే మహిళలు అసాధ్యాన్ని సుసాధ్యం చేస్తారు

## వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోద రాజనర్సింహ

### మంత్రి సీతక్కతో కలిసి డ్వాక్రా మహిళల హెల్త్ ప్రొఫైలింగ్ కార్యక్రమాన్ని ప్రారంభించిన మంత్రి



హైదరాబాద్, మార్చి 8, ప్రభాతవార్త: మహిళలకు అవకాశం ఇస్తే అసాధ్యాన్ని సుసాధ్యం చేస్తారని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. మహిళ చదువుకుంటే ఒక తరమే ముందుకు వెళుతుందని, మహిళలకు ప్రాధాన్యం ఇచ్చే సమాజమే నిజమైన అభివృద్ధి చెందిన సమాజం అని మంత్రి పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బంజారా హిల్స్‌లోని ఆదివాసీ భవన్‌లో ఆదివారం జరిగిన వేడుకల్లో మంత్రి సీతక్కతో కలిసి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆదివాసీ భవన్‌లో ఏర్పాటు చేసిన డయాగ్నస్టిక్, హెచ్‌పీవీ వ్యాక్సినేషన్, ఫీడింగ్ కియోస్క్ స్టాళ్లను మంత్రులు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అక్కడున్న మహిళలు, బాలికలతో ఆత్మీయంగా ముచ్చటించి వారి ఆరోగ్య స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆడిటోరియంలో మహిళల ఆరోగ్య పరీక్షలు, క్యాన్సర్ టీకాలపై రూపొందించిన షార్ట్ వీడియోస్‌ను ప్రదర్శించారు. ఉద్యోగ రీత్యా వేరే ప్రాంతాల్లో ఉండే మహిళల భద్రత, వసతి కోసం ప్రత్యేకంగా రూపొందించిన వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్ ఆన్‌లైన్ బుకింగ్ పోర్టల్‌ను మంత్రులు ఆవిష్కరించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన మహిళా సంఘాల సభ్యులను మంత్రులు సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ.. మహిళలు ఎదగడానికి ఆకాశమే హద్దని, అవకాశం ఇస్తే వారు అసాధ్యాన్ని కూడా సాధిస్తారని కొనియాడారు. మహిళా సాధికారత కేవలం సంక్షేమ నినాదం కాదని, అది దేశ అభివృద్ధికి పునాది అన్నారు. అదే లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ మహిళా శక్తి కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. మహిళా ప్రయాణికులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, గృహజ్యోతి కింద 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళా శక్తికి గుర్తింపుగా ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ వంటి పథకాలను చిత్తశుద్ధితో అమలు చేస్తున్నామని తెలిపారు. మహిళల ఆర్థిక స్వావలంబన కోసం.. మహిళా సంఘాలకు రికార్డు స్థాయిలో రుణాలు మంజూరు చేయడంతో పాటు, సుమారు రూ.1,200 కోట్ల వడ్డీ రాయితీని అందించిన ఘనత తమ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. మహిళలు ఆర్థికంగానే కాదు, ఆరోగ్యంగానూ బలంగా ఉండాలనే ఉద్దేశంతో వారి కోసం అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఇందులో భాగంగా డ్వాక్రా మహిళల కోసం ఉచిత హెల్త్ స్క్రీనింగ్ కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు. రాష్ట్రంలోని 32 జిల్లాల్లో ఉన్న 4.37 లక్షల స్వయం సహాయక సంఘాల్లోని దాదాపు 46 లక్షల మంది మహిళలకు సమగ్ర ఆరోగ్య పరీక్షలు (హెల్త్ ప్రొఫైలింగ్) నిర్వహిస్తామని మంత్రి వెల్లడించారు. సెర్ప్ సహకారంతో మహిళలను సమీప పీహెచ్‌సీలకు తీసుకెళ్లి బీపీ, షుగర్, థైరాయిడ్ వంటి 30 రకాల కీలక పరీక్షలు ఉచితంగా చేయిస్తున్నామన్నారు. ఆరోగ్య పరీక్షల అనంతరం ప్రతి మహిళకు క్యూఆర్ కోడ్‌తో కూడిన డిజిటల్ హెల్త్ రికార్డును సృష్టించి, హెచ్ఎంఐఎస్ పోర్టల్‌లో భద్రపరుస్తారని మంత్రి వెల్లడించారు. దీనివల్ల భవిష్యత్తులో వారి ఆరోగ్య సమస్యలను సులభంగా గుర్తించి చికిత్స అందించవచ్చని మంత్రి వివరించారు. దేశంలో మహిళల్లో రొమ్ము క్యాన్సర్ తర్వాత అత్యధికంగా వేధిస్తున్న సర్వైకల్ (గర్భాశయ ముఖ ద్వార) క్యాన్సర్ కేసులని మంత్రి తెలిపారు. తెలంగాణలో ఏటా సుమారు 3,200 సర్వికల్ క్యాన్సర్ కేసులు నమోదవుతున్నాయని, దీని నివారణకు హెచ్‌పీవీ టీకా పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నామన్నారు. 14 ఏళ్లు నిండిన సుమారు 4లక్షల మంది బాలికలకు ఈ టీకా వేయనున్నట్టు తెలిపారు. బయట మార్కెట్లో రూ.3 వేల నుంచి రూ.4 వేల విలువ చేసే గార్డాసిల్4 టీకాను ప్రభుత్వ ఆసుపత్రుల్లో కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తు దృష్ట్యా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సంజయ్ కుమార్, ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టినా జడ్ చొంగ్తూ, హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ సంగీత సత్యనారాయణ, మహిళా శిశు సంక్షేమ శాఖ సెక్రెటరీ అనితా రామచంద్రన్, సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్ పాల్గొన్నారు.

## మహిళల శక్తి, సహనం, ప్రేమ, త్యాగం అపూర్వమైనవి

### ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శుభాకాంక్షలు

ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,మార్చి8: మహిళలందరికీ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆదివారం సామాజిక మాధ్యమం ట్విట్టర్(ఎక్స్) వేదికగా సీఎం ట్వీట్ పెట్టారు. కుటుంబానికి ఆధారం, సమాజానికి స్ఫూర్తిగా నిలుస్తున్న మహిళల శక్తి, సహనం, ప్రేమ, త్యాగం అపూర్వమైనవని అభినందించారు. సమాజాభివృద్ధికి మహిళా సాధికారత ప్రమాణంగా ఆడబిడ్డల కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందని సిఎం రేవంత్‌రెడ్డి గుర్తుచేశారు.

## పెరుగుతున్న రసాయన ఎరువుల ధరలు

### ఖరీఫ్‌లో భారీగా పెరగనున్న నత్రజని ఎరువుల ధరలు

### ఆందోళన వ్యక్తం చేస్తున్న వ్యవసాయ నిపుణులు

హైదరాబాద్, మార్చి 8, ప్రభాతవార్త: మధ్యప్రాచ్యంలో ఇరాన్‌తో అమెరికా–ఇజ్రా యెల్ చేస్తున్న యుద్ధం రోజురోజుకు తీవ్రమవుతుండడం, ఇప్పట్లో యుద్ధం ముగిసే పరిస్థితులు కనిపించకపోవడం, యుద్ధం కారణంగా పెద్ద ఎత్తున గల్ఫ్ దేశాల్లో పారిశ్రామిక, మౌళిక వసతుల విధ్వంసం కొనాసగుతుండడం రైతన్నల గుండెల్లో గుబులు రేపుతోంది. ఈ పోరు కేవలం ఆయుధాలకే పరిమితం కాకుండా, పొలాల్లో పండాల్సిన పంటలపై తన ప్రతాపాన్ని చూపుతోంది. ముఖ్యంగా రసాయన ఎరువుల ధరలు ఆకాశాన్నంటుతుండటంతో సాగు భారమై రైతులు దిక్కుతోచని స్థితిలో పడిపోయే ప్రమాదం నెలకొంది. రానున్న ఖరీఫ్ సీజన్‌లో ఎరువుల ధరలు భారీగా పెరుగుతాయని వ్యవసాయ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత ఉద్రిక్తతల కారణంగా ఎరువుల తయారీకి అత్యంత కీలకమైన సహజ వాయువు సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. యూరియా, అమోనియం, ఇతర కాంప్లెక్స్ ఎరువుల ఎరువుల తయారీలో గ్యాస్ ప్రధాన ముడి పదార్థం కావడంతో ఉత్పత్తి గణనీయంగా పడిపోయింది. దీని ప్రభావం ఎరువుల ధరలపై స్పష్టంగా కనిపిస్తోంది. యుద్ధం మొదలైన కొన్ని రోజుల వ్యవధిలోనే ప్రపంచ మార్కెట్లలో టన్ను యూరియా ధర 470 డాలర్ల నుంచి ఏకంగా 550 డాలర్ల మార్కును దాటేసింది. సాధారణంగా ఒక రైతు సాగు ఖర్చులో ఎరువుల వాటా 50 శాతం వరకు ఉంటుంది. ఇప్పుడు ఈ ధరల పెరుగుదల నేరుగా రైతుల ఆర్థిక వెన్నుముకను విరుస్తోంది. ప్రపంచ ఎరువుల సరఫరాలో మూడో వంతు వాటా కలిగిన హార్ముజ్ జలసంధి గుండా నౌకల రాకపోకలు నిలిచిపోవడం ఎరువుల ధరల పెరుగుదల సంక్షోభాన్ని మరింత జఠిలం చేస్తోంది. వ్యవసాయ నిపుణుల అంచనా ప్రకారం ఈ సరఫరా గొలుసులో అంతరాయం ఇలానే కొనసాగితే రానున్న ఖరీఫ్‌లో నత్రజని ఎరువుల ధరలు రెట్టింపు అయ్యే ప్రమాదం ఉంది. అలాగే ఫాస్ఫేట్ ఎరువుల ధరలు కూడా 50 శాతం మేర పెరగవచ్చన్న ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి.

### అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా

## ఆర్టీసీ మహిళా సిబ్బందికి మంత్రి పొన్నం శుభాకాంక్షలు

హైదరాబాద్, మార్చి 8, ప్రభాతవార్త: రాష్ట్రంలోని అక్కా, చెల్లెలకు అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు మంత్రి పొన్నం ప్రభాకర్. ఆర్టీసీ మహిళా సిబ్బందికి అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు చెప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన 48 గంటల్లో మహిళలకు ఆర్టీసీలో ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభించామన్నారు. మహిళలను బస్సులకు యజమానులను చేశామని, మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు అందిస్తున్నామన్నారు. ప్రజా పాలన ప్రభుత్వంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో మహిళలు అన్ని రంగాల్లో రాణించేలా మహిళా సాధికారత దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. మహిళలు ఎదగాలని, మహిళలకు శుభం జరగాలని ఆకాంక్షి స్తున్నట్టు చెప్పారు. ఇప్పటివరకు మహిళలు రూ.282 కోట్ల జీరో టికెట్ ప్రయాణాలు ఆర్టీసీలో జరిగాయని, మహిళలు రూ.9700 కోట్లు జీరో టికెట్ ద్వారా ఆదా చేసుకున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. మహిళా సాధికారత కోసం మండల మహిళా సమైక్యల ద్వారా కొత్త బస్సులు కొనుగోలు చేసిందని, రాష్ట్ర ప్రభుత్వం కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో అనేక పథకాలు అమలు చేస్తుందన్నారు. అన్ని రంగాల్లో రాణించి ఆర్థిక వృద్ధి సాధించేలా మహిళా సాధికారత దిశగా ప్రభుత్వం ముందుకు వెళ్తుందని చెప్పిన మంత్రి పొన్నం ప్రభాకర్ సోదరీమణులకు మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

## రాష్ట్రంలో ఎన్ఇపి-2020ని అమలు చేయొద్దు

### ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ డిమాండ్

హైదరాబాద్, మార్చి 8, ప్రభాతవార్త: రాష్ట్రంలో జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ)–2020ని అమలు చేయొద్దని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) తెలంగాణ రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఉన్నత విద్యలో ఎన్ఈపీ–2020 అమలు పేరుతో విద్యను వాణిజ్యీకరణ దిశగా నెట్టొద్దని సంఘం రాష్ట్ర అధ్యక్షులు రజనీకాంత్, రాష్ట్ర కార్యదర్శి టి నాగరాజు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఉన్నత విద్యా రంగంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జాతీయ విద్యావిధానం ఎన్ఈపీ–2020 అమలు ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం వేగవంతం చేయడం ఆందోళనకరమన్నారు. విద్యా వ్యవస్థను సమానత్వం, ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం అనే విలువలపై నిర్మించాల్సిన అవసరం ఉన్న సమయంలో, ఎన్ఈపీ–2020 మాత్రం విద్యను కార్పొరేట్ ప్రయోజనాలకు అనుగుణంగా మార్చే ప్రమాదకర మార్గాన్ని సూచిస్తోందన్నారు. అలాంటి విద్యా విధానం కాంగ్రెస్ నాయకత్వంలో ప్రభుత్వం అమలుకు పూనుకోవడం దుర్మార్గపు చర్య అన్నారు. ఎన్ఈపీ–2020 అమలు పేరుతో మల్టిపుల్ ఎంట్రీ–ఎగ్జిట్, నాలుగేళ్ల డిగ్రీ, అకాడెమిక్ బ్యాంక్ ఆఫ్ క్రెడిట్స్ వంటి విధానాలను ప్రవేశపెట్టడం ద్వారా విద్యార్థుల విద్యా ప్రయాణాన్ని అస్థిరంగా మార్చే ప్రయత్నం జరుగుతోందన్నారు. మధ్యలో ఎగ్జిట్ అనే పేరుతో విద్యార్థులను బయటకు నెట్టే విధానమే దీనిలో దాగి ఉందని.. మరీ ముఖ్యంగా పేద, గ్రామీణ, అట్టడుగు వర్గాల విద్యార్థులు ఆర్థిక ఒత్తిడితో చదువు మధ్యలో వదిలేయాల్సిన పరిస్థితులు మరింత పెరిగే ప్రమాదం ఉంటుందన్నారు. ఈ విధానం విద్యార్థులకు అవకాశాలు పెంచేలా కాకుండా .. అసమానతలను పెంచేలా పనిచేస్తుందన్నారు.

ఇప్పటికే ఉన్నత విద్యలో ఫీజులు భారీగా పెరుగుతున్నాయి. ఫీజు రీయింబర్స్‌మెంట్‌లు, స్కాలర్‌షిప్‌లు సకాలంలో విడుదల కాకపోవడంతో వేలాది మంది విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఎన్ఈపీ–2020 పరిశోధన, స్వయం ప్రతిపత్తి పేరుతో ప్రభుత్వ బాధ్యతలను తగ్గించి కార్పొరేట్ రంగానికి విద్యను అప్పగించే దిశగా తీసుకెళ్తోందన్నారు. రాష్ట్రంలో ఎన్ఈపీ–2020కు బదులుగా ప్రజా విద్యను బలోపేతం చేసే ప్రత్యామ్నాయ విధానం అవసరమన్నారు.

## జూడాల అధ్యక్షుడిగా డాక్టర్ విక్రమ్, జనరల్ సెక్రటరీగా డాక్టర్ చంద్రకాంత్ నరహరి

### 2026 సంవత్సరానికి కొత్త ప్యానల్ ఏకగ్రీవ ఎన్నిక

హైదరాబాద్, మార్చి 8, ప్రభాతవార్త:తెలంగాణ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ (టిజూడా) 2026 సంవత్సరానికి నూతన ప్యానల్ ఏకగ్రీవంగా ఎన్నికైంది. రాష్ట్ర అధ్యక్షులుగా గాంధీ మెడికల్ కాలేజీకి చెందిన డాక్టర్ విక్రమ్ ఎన్నిక కాగా.. సెక్రటరీ జనరల్‌గా ఉస్మానియా మెడికల్ కాలేజీకి చెందిన డాక్టర్ చంద్రకాంత్ నరహరి ఎన్నికయ్యారు. 2025 సంవత్సరానికి టిజూడా ప్యానెల్ పదవీకాలం విజయవంతంగా పూర్తయిన నేపథ్యంలో ఆదివారం ఎన్నికలు నిర్వహించబడ్డాయి. ఈ ఎన్నికలో 2026 సంవత్సరానికి కొత్త రాష్ట్ర ప్యానెల్‌ను ఎన్నుకున్నారు. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న జూనియర్ వైద్యుల ప్రయోజనాలను కాపాడానికి కొత్త ప్యానల్ కృషి చేస్తుందని నూతన అధ్యక్షులు, సెక్రటరీ జనరల్ ప్రకటించారు. తెలంగాణ అంతటా ఉన్న అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ మెడికల్ కాలేజ్‌ల నుండి జూనియర్ డాక్టర్లకు టిజూడా ప్రాతినిధ్యం వహించనుంది. వారిలో అండర్ గ్రాడ్యుయేట్ ఇంటర్న్‌లు, పోస్ట్ గ్రాడ్యుయేట్ రెసిడెంట్లు, సూపర్‌స్పెషాలిటీ రెసిడెంట్లు, సీనియర్ రెసిడెంట్లతోపాటు రాష్ట్ర ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలో పనిచేస్తున్న వైద్యులు కూడా కొనసాగుతారు. జూనియర్ డాక్టర్లకి సంబంధించిన విద్యా, వృత్తిపరమైన సమస్యలతోపాటు సంక్షేమ సమస్యలను పరిష్కరించడానికి అసోసియేషన్ పనిచేస్తూనే.. రాష్ట్రంలో ఆరోగ్య సంరక్షణ సేవలు సజావుగా పనిచేయడానికి కూడా కృషి చేస్తుందని కొత్త ప్యానల్ ప్రకటించింది. జూనియర్ వైద్యులు, ఆసుపత్రి పరిపాలన, ప్రభుత్వ అధికారుల మధ్య నిర్మాణాత్మక సమన్వయాన్ని టిజూడా కొనసాగిస్తుందని ప్రకటించారు. కొత్తగా ఎన్నికైన ప్యానెల్ త్వరలో తెలంగాణ అంతటా జూనియర్ వైద్యుల సంక్షేమం, అభివృద్ధి కోసం చురుకుగా పనిచేయడం ప్రారంభిస్తుందన్నారు.

# మహిళలు సాధికారత, స్వేచ్ఛతో ఎదగాలి

## అంతర్జాతీయ మహిళాదినోత్సవ సాహిత్య సమ్మేళనంలో వక్తలు

హైదరాబాద్ (రవీంద్రభారతి), మార్చి 8, ప్రభాతవార్త : రాష్ట్ర ప్రభుత్వ సాహిత్య అకా డమీ ఆధ్వర్యంలో రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో అకాడమీ కార్య దర్శి డా. నామోజు బాలాచారి సభాధ్యక్షతన సాహిత్యవారంలో భాగంగా అంతర్జాతీయ మహిళాదినోత్సవంలో సాహితీవేత్తల సమ్మేళనం వైభవంగా జరిగింది. ఈ సంవత్సరం అంతర్జాతీయ మహిళాదినోత్సవ నినాదం అవకాశమిస్తే సాధిస్తాం అనుసరించి సమ్మేళనాన్ని మూడు సదస్సులుగా విభజించి నిర్వహిస్తున్నట్లు బాలాచారి తెలిపారు. మొదటిది స్త్రీవాద సాహిత్యం దశ–దిశ; రెండోది ఆధునికయుగంలో స్త్రీల సాధికారత; మూడవది డిజిటల్ యుగంలో స్త్రీలు ఎదుర్కొంటున్న సవాళ్లు. ఈ సదస్సులకు రాష్ట్ర వ్యాప్తంగా వివిధ రంగాలకు చెందిన ప్రముఖ మహిళలను ఆహ్వానించినట్లు పేర్కొన్నారు. మొదటి సదస్సు లో జుపాక సుభద్ర మహిళలు సాధికారికంగా స్వేచ్ఛగా ఉండాలి.. కొందరు మహిళలు అంట రాని, కులం లాంటి ప్రాతి పదికనే ఉనికి కొన సాగు తుంది.. పెద్ద కంపెనీల్లో ఉన్నత స్థాయిలో మహిళల సంఖ్య పెరగాలన్న అభిప్రాయాన్ని వెలిబు చ్చారు. ఆచార్య త్రివేణి సమాజంలో స్త్రీలే సృష్టికి మూలమన్న విషయాన్ని మర్చి పోరాదన్నారు. హసీనా మాట్లాడుతూ మాతృ స్వాతంత్రం నుండి పితృ స్వాతంత్ర వ్యవస్థ రాడానికి కందు కూరి, రాజారామ్ మోహన్‌వంటి మహనీ యుల కృషి గుర్తుచేసుకోవాలన్నారు.

శిలాలోలిత మాట్లాడుతూ మహిళా సాధికారిత ఇంకా సాధించాల్సి ఉందన్నారు. దేవనపల్లి వీణావాణి భారత స్వాతంత్ర్యం అనంతరం స్త్రీల విద్యకోసం కృషిచేసిన వారిలో పురుషులే ముందున్నా రన్నారు. స్వాతిశ్రీపాద మాట్లాడుతూ స్త్రీమూర్తు లను సమాజం భద్రంగా చూసుకున్నప్పుడే ఆత్మవిశ్వాసం పెంచి స్వేచ్ఛ ఇచ్చినట్లవుతుందని స్పష్టం చేశారు. గోగుశ్యామల వందలేళ్లుగా ఎందరో మహనీయులు స్త్రీవాదాన్ని ఆవిష్కరించి అనేక హక్కులు కల్పించారని అన్నారు. శాంతిప్రబోధ మాట్లాడుతూ అలనాటి అచ్చమాంబ కాలం నుండి స్త్రీవాద సాహిత్యం ఉందన్నారు. రెండో సదస్సులో కాళోజీ అవార్డు గ్రహీత నెల్లుట్ల రమాదేవి సమన్వయకర్తగా ఆధునికయుగంలో స్త్రీల సాధికారతపై వివిధ రంగాల మహిళలు సాధికారికంగా సాదించిన అనేక విషయాలపై, సమాజ నిర్మాణంలో స్త్రీలకు సమాన అవకాశాలు కలిగివుండే మహిళా హక్కులు, విద్యావ్యవస్థపై చర్చ జరిగింది. సిహెచ్. ఉషారాణి సమన్వయకర్తగా డిజిటల్ యుగంలో స్త్రీలు ఎదు ర్కొంటున్న సవాళ్లపై చివరి మూడవ సదస్సు జరిగింది. కార్యక్రమాల్లో పాల్గొన్న మహిళలందరినీ సాహిత్య అకాడమీ కార్యదర్శి డా. నామోజు బాలాచారి జ్ఞాపికలు, శాలువాతో ఘనంగా సత్కరించి శుభాభినందనలు తెలిపారు.



మహిళాదినోత్సవ సంబరాల్లో పాల్గొన్న సత్కార స్వీకర్తలైన మహిళా మూర్తులతో అకాడమీ కార్యదర్శి నామోజు బాలాచారి

### సింగరేణి సిఎండి బుద్ధప్రకాష్ జ్యోతి

## కార్మిక సంక్షేమం అత్యంత ముఖ్యం

హైదరాబాద్, మార్చి 8, ప్రభాతవార్త: కార్మిక సంక్షేమం తమ సంస్థకు అత్యంత ముఖ్యమని సింగరేణి సిఎండి బుద్ధప్రకాష్ జ్యోతి స్పష్టం చేశారు. కార్మికుల ఆరోగ్యం, విద్య, నివాస సదుపాయాల మెరుగుదలకు సంస్థ యాజమాన్యం కట్టుబడి ఉందన్నారు. కొత్తగూడెం ఏరియాలోని ఉపరితల, భూగర్భ గనులకు సంబంధించి వికె కోల్ మైన్స్‌లో మొదటిసారిగా ఉత్పత్తి అయిన బొగ్గు రవాణా చేయు లారీకి పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం వారు వికే సిఎం వ్యూ పాయింట్ నుండి వీకే కోల్ మైన్స్ యొక్క భౌగోళిక స్థితి, ఉత్పత్తి ఉత్పాదకత పనీతీరు, భద్రతా చర్యలు, ఉత్పత్తి పరిస్థితులను పరిశీలించారు. అనంతరం గనుల ప్రాంతాలను పరిశీలిస్తూ కార్మికుల పనితీరును, భద్రతా ప్రమాణాలను తెలుసుకున్నారు. గనులలో భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన అధికారులకు సూచించారు.

కార్మికులు సురక్షి తంగా పని చేయడానికి అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించాలన్నారు. ఆయన గనుల ఉత్పత్తి లక్ష్యాలు, భవిష్యత్ ప్రణాళికలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగంపై చర్చించారు. సింగరేణి సంస్థ అభివృద్ధికి అధికారులు, కార్మికులు సమన్వయంతో పని చేయాలని కార్మిక సంఘ నాయకులు కూడా సహకరించాలని పేర్కొన్నారు. ఉత్పత్తి పెంపు, ఖర్చుల తగ్గింపు, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. సింగరేణి ప్రాంత అభివృద్ధికి సంస్థ పలు సంక్షేమ కార్యక్రమాలు చేపడుతోందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సింగరేణి సంస్థ డైరెక్టర్లు ఎల్.వి. సూర్య నారాయణ, కొప్పుల వెంకటేశ్వర్లు, ఎం. తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

## కెజిబివి, యుఆర్ఎస్, సమగ్ర శిక్ష ఉద్యోగుల ఆందోళనలు

### నేడు నల్లబ్యాడ్జిలతో నిరసన.. 20న చలో అసెంబ్లీ

హైదరాబాద్, మార్చి 8, ప్రభాతవార్త, రాష్ట్రంలోని కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాలు(కెజిబివి), అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్స్(యుఆర్ఎస్), సమగ్ర శిక్ష ఉద్యోగులు తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నేడు(సోమవారం) నల్లబ్యాడ్జిలతో నిరసన కార్యక్రమాలను చేపట్టనున్నారు. తదుపరి ఈ నెల 16న జిల్లా కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహించి.. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఈ నెల 20న ఛలో అసెంబ్లీ కార్యక్రమాన్ని నిర్వహించాలని నిర్ణయించినట్టు టిఎస్ యుటిఎఫ్ ప్రకటించింది. కెజిబివి, యుఆర్ఎస్, సమగ్రశిక్ష ఉద్యోగుల సమస్యలపై మూడు దశల పోరాటం చేయాలని నిర్ణయించినట్టు సంఘం రాష్ట్ర అధ్యక్షులు చావ రవి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్ తెలిపారు. కెజిబివి, యుఆర్ఎస్‌ల్లో పనిచేస్తున్న బోధన, బోధనేతర సిబ్బంది, సమగ్రశిక్షా ఉద్యోగుల సమస్యల పరిష్కారం పట్ల రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న తాత్సార వైఖరికి నిరసనగా దశలవారీ పోరాటం చేయాలని తమ రాష్ట్ర కమిటీ నిర్ణయించిందని తెలిపారు. కెజిబివి, యుఆర్ఎస్, సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలు దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్నాయని, రెండు దశాబ్దాలుగా పనిచేస్తున్నప్పటికీ వేతనాలు అరకొరగానే ఉన్నాయన్నారు. గతంలో చేసిన అనేక పోరాటాల సందర్భంలో సర్వీసు కండీషన్లకు సంబంధించి అధికారులు ఇచ్చిన హామీలు అమలు జరగకపోగా, గత ఏడాది 29 రోజులు సమ్మెచేసిన సమయంలో ఉపముఖ్యమంత్రి భట్టితో జరిగిన చర్చల సందర్భంగా అంగీకరించిన అంశాలు కూడా ఇప్పటివరకు అమలుకు నోచుకోలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సమస్యలను పరిష్కరించక పోగా.. పోరాడితే కక్షగట్టి మరింత ఇబ్బందులకు గురి చేయడం తగదని హెచ్చరించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వారి శ్రమకు తగిన వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎస్‌వోలను ప్రిన్సిపల్స్‌గా, పిజిసిఆర్‌టిలకు జేఎల్‌గా, సిఆర్‌టి, పిఈటి, సిఆర్‌పిలను ఎస్ఏలుగా పరిగణించి కనీస మూలవేతనాన్ని చెల్లించాలని, ఆరోగ్య భద్రత కల్పించడం కోసం హెల్త్ కార్డులు జారీ చేయాలని డిమాండ్ చేశారు. కేర్ టేకర్లను నియమించి, రాత్రి కాపలా డ్యూటీల నుండి విముక్తి చేయాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారానికి మూడు దశల పోరాటంలో భాగంగా నేడు(సోమవారం) పాఠశాలల్లో నల్ల బ్యాడ్జీలతో భోజన సమయంలో నిరసన ప్రదర్శనలు చేపట్టాలని, ఈ నెల 16న జిల్లా కేంద్రాల్లో, డివిజన్ కేంద్రాల్లో నిరసన ప్రదర్శనలు చేయాలని.. అప్పటికి ప్రభుత్వం స్పందించకపోతే ఈ నెల 20న అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభమవుతున్న సందర్భంగా చలో అసెంబ్లీ నిర్వహించనున్నట్టు రాష్ట్ర అధ్యక్షులు చావ రవి, ప్రధాన కార్యదర్శి ఎ వెంకట్ తెలిపారు.

## 81 మంది ప్రభుత్వ డిగ్రీ లెక్చరర్లకు ప్రొఫెసర్లుగా పదోన్నతి

### మల్టీజోన్-1లో 38 మంది, మల్టీజోన్-2లో 43 మంది

### ప్రభుత్వానికి టిజిసిటిఎ ధన్యవాదాలు

హైదరాబాద్, మార్చి 8, ప్రభాతవార్త: రాష్ట్రంలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో అసోసియేట్ ప్రొఫెసర్లుగా కొనసాగుతున్న వారికి ప్రొఫెసర్లుగా పదోన్నతులు కల్పిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీంతో 81 మంది ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులకు ప్రొఫెసర్లుగా పదోన్నతి లభించింది. రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అసోసియేట్ ప్రొఫెసర్లుగా పనిచేస్తున్న అధ్యాపకులకు ప్రొఫెసర్లుగా పదోన్నతి లభించింది. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సుదీర్ఘమైన బోధన సేవలను, పరిశోధన అనుభవాన్ని గుర్తించి ఇచ్చే ప్రొఫెసర్ పదోన్నతికి మల్టీ జోన్–1 నుండి 38 మంది, మల్టిజోన్–2 నుండి 43 మంది ఉన్నారు. ప్రొఫెసర్లుగా పదోన్నతులు కల్పించిన ప్రభుత్వానికి తెలంగాణ రాష్ట్ర డిగ్రీ కళాశాలల అధ్యాపకుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఇ బ్రిజేష్, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాల్ సంఘం అధ్యక్షులు డాక్టర్ సంగి రమేష్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ విజయకుమార్ హర్షం వ్యక్తం చేశారు.

డాక్టర్ బ్రిజేష్ మాట్లాడుతూ.. బోధనా రంగంలో పవిత్రమైన అధ్యాపక వృత్తిలో ప్రొఫెసర్ అనేది ఉన్నతమైన పదోన్నతి అని.. విశ్వవిద్యాలయాల్లో మాదిరిగా తెలంగాణ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పనిచేస్తున్న అధ్యాపకులకు ప్రొఫెసర్‌గా పదోన్నతి అందించడం తొలిసారని సంతోషాన్ని వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కళాశాల విద్యాశాఖ అందించిన ఈ సదవకాశానికి కృతజ్ఞతలు తెలియజేస్తూ, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పనిచేస్తున్న అధ్యాపకులు సైతం అత్యంత ప్రామాణికమైనటువంటి జర్నల్స్ లో పరిశోధనా వ్యాసాలను ప్రచురిస్తూ జాతీయ, అంతర్జాతీయ సదస్సులలో పాల్గొంటూ తమ బోధన సేవలతో పాటు పరిశోధన అభిరుచిని కూడా చాటుకుంటూ పని చేస్తున్న కళాశాలలకు ఉత్తమమైన న్యాక్ గ్రేడ్ సాధించడంలో తమ తోడ్పాటు అందిస్తున్నారని తెలిపారు.


సీనియర్ అధ్యాపకులకు సకాలంలో ప్రొఫెసర్ పదోన్నతి అందించిన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి, విద్యాశాఖ సెక్రటరీ యోగితా రాణాకి, కళాశాల విద్య కమిషనర్ శ్రీదేవసేనకి ధన్యవాదాలు తెలిపారు.

## త్రిబుల్ సెంచరీ కొట్టిన కిలో చికెన్ ధర

### భారీగా పెరుగుతున్న రేట్లు

### ఎండలు తీవ్రమవడంతో పెద్దసంఖ్యలో కోళ్లు మృత్యువాత

హైదరాబాద్, మార్చి 8, ప్రభాతవార్త: రాష్ట్రంలో చికెన్ ధరలు కొండెక్కి కూర్చున్నాయి. ప్రస్తుతం తెలంగాణ వ్యాప్తంగా కిలో చికెన్ ఏకంగా మళ్లీ రూ. 300కి చేరుకుంది. సాధారణంగా ఆదివారం నాన్ వెజ్ తినేందుకు ప్రతీఒక్కరూ ఆసక్తి చూపిస్తూ ఉంటారు. ప్రధానంగా తక్కువ ధరకు దొరికే చికెన్ ఎక్కువమంది తింటూ ఉంటారు. అయితే పెరిగిన చికెన్ ధరలను చూసి సామాన్య, మధ్యతరగతివర్గానికి చెందిన మాంసాహారులు బెంబేలెత్తిపోతున్నారు. మొన్నటివరకు ప్రాంతాలను బట్టి కేజీ స్కిన్‌లెస్ చికెన్ రూ. 250 నుంచి రూ.260 వరకు ఉండగా ఇప్పుడు ఏకంగా పలు ఏరియాల్లో రూ.300కి చేరుకుంది. హైదరాబాద్‌లో కేజీ స్కిన్‌లెస్ చికెన్ రూ.290 నుంచి రూ.300 మధ్య విక్రయిస్తున్నారు. ఇక డ్రెస్‌డ్ చికెన్ రూ. 260గా ఉండగా రిటైల్ లైవ్ బర్డ్ రూ.177గా ఉంది. ఇక ఫామ్స్‌లో లైవ్ బర్డ్ రూ.150గా కొనసాగుతోంది. వరంగల్‌లో కిలో స్కిన్‌లెస్ రూ.290, ఆసిఫాబాద్‌లో రూ.300, కామారెడ్డిలో రూ.280–300కు లభిస్తోంది. కొద్దిరోజుల క్రితం వరకు బర్డ్‌ఫ్లూ వల్ల కోళ్ల ఉత్పత్తి తగ్గిపోవడంతోపాటు రాష్ట్రంలో ఎండలు తారాస్థాయికి చేరుకోవడంతో కోళ్లు మృత్యువాత పడుతున్నాయి. ఫలితంగా చికెన్ ఉత్పత్తి తగ్గిపోవడం, డిమాండ్ ఎక్కువగా ఉండటంతో ధరలు పెరుగుతున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు. మరికొంతకాలం పాటు ధరలు ఇలాగే కొనసాగే అవకాశముందని పౌల్ట్రీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. అయితే చికెన్ ధరలు పెరిగినప్పుడు సాధరణంగా కోడి గుడ్ల ధరలు కూడా పెరుగుతుంటాయి. కానీ ఈసారి కాస్త భిన్న పరిస్థితులు నెలకొన్నాయి. చికెన్ ధరలు పెరుగుతుండగా కోడి గుడ్ల ధరలు మాత్రం పడిపోతున్నాయి. 30 గుడ్ల ట్రే ధర రూ.130 నుంచి రూ.140 మధ్య పలుకుతోంది. 12 గుడ్ల రిటైల్ ధర రూ.60గా ఉంది. ఇరాన్– ఇజ్రాయెల్ మధ్య యుద్ధ ప్రభావంతో ఇండియా నుంచి విదేశాలకు గుడ్ల ఎగుమతులు పూర్తిగా నిలిచిపోయాయి. దీని వల్ల ఇండియాలో నిల్వలు ఎక్కువగా ఉండటం వల్ల ధరలు పతనమయ్యాయి. ఇది సామాన్యులకు ఊరటగా చెప్పవచ్చు. మొన్నటివరకు ఒక్కో గుడ్డు ధర రూ.5 నుంచి రూ.6 వరకు పలకగా ఇప్పుడు రూ.4కే వస్తోంది.



బిసి సంఘాల నాయకులతో అభివాదం చేస్తున్న ఆర్.కృష్ణయ్య. చిత్రంలో గుజ్జ సత్యం, రాజేందర్, పగిళ్ల సతీష్, జి.అనంతయ్య తదితరులు

## 30, 31 తేదీల్లో ఢిల్లీలో 'ఒబిసిల జాతీయ సదస్సులు'

### పాల్గొనాలని ఎంపి ఆర్.కృష్ణయ్య పిలుపు

హైదరాబాద్ (సైఫాబాద్), మార్చి 8, ప్రభాతవార్త: బిసిలకు అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో 50 శాతం రిజర్వేషన్‌లు కల్పించాలని డిమాండ్ చేస్తూ 'హలో బిసి–చలో ఢిల్లీ' పేరిట ఈ నెల 30, 31 తేదీల్లో 'ఒబిసిల జాతీయ సదస్సులను' నిర్వహిస్తున్నామని రాజ్యసభ సభ్యుడు జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ప్రకటించారు. రెండురోజులపాటు ఢిల్లీలో జరిగే జాతీ య సదస్సుల్లో కేంద్ర మంత్రులతోపాటు వివిధ రాజకీయ పార్టీల అధ్యక్షులు, ఎంపిలు, ఎపి, తెలంగాణ, కర్ణాటక, ఒడిశా, మహారాష్ట్ర తదితర రాష్ట్రాలకు చెందిన వేలాది మంది ఒబిసిలు పాల్గొంటారని చెప్పారు. ఈ మేరకు ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన పలు బిసి సంఘాలు ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ఈ సదస్సులకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. సమావేశంలో అమోదించిన పలు తీర్మానాలను ఆయన వెల్లడించారు. సమావేశంలో సంఘం బిసి నాయకులు గుజ్జ సత్యం, సి.రాజేందర్, పగిళ్ల సతీష్, జి.అనంతయ్య, నిఖిల్‌పటేల్, మోర పాక సతీష్, మొగిలి కృష్ణయ్య, చిక్కుడు బాలయ్య ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ సాధన ఉద్యమంలో మహిళల పాత్ర గొప్పది: మాజీ సిఎం కెసిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,మార్చి8:** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి, బిఆర్ఎస్ అధినేత కేసిఆర్ మహిళాలోకానికి శుభాకాంక్షలు తెలిపారు.మహిళలు సామాజిక సంపద సృష్టికర్తలని, దేశాభివృద్ధిలో పురుషుడితో సమానంగా స్త్రీ భాగస్వామ్యం ఇమిడివున్నదని కేసీఆర్ తెలిపారు. సంతానోత్పత్తి అనే అనివార్యమైన ధర్మాన్ని పాటించాల్సిన బాధ్యత స్త్రీకి ప్రకృతి కేటాయించిందని, మానవ మనుగడను కొనసాగించే ప్రత్యేక కర్తవ్యాన్ని అనేక కష్టాలతో నిర్వర్తిస్తున్న మహిళ త్యాగశీలి అని కేసీఆర్ కొనియాడారు. ఆకాశంలో సగమై, అపారమైన శక్తి సామర్థ్యాలు కలిగివున్న మహిళా లోకానికి అన్ని రంగాల్లో పురుషునితో సమానమైన అవకాశాలను మరింతగా అందించినపుడు మాత్రమే, కుటుంబాభివృద్ధి సంపూర్ణ మవుతుందని, తద్వారా సమాజ, దేశ, ప్రపంచాభివృద్ధి ఫరిడవిల్లుతుందని కేసీఆర్ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమంలో,అనంతర స్వయంపాలనలో తెలంగాణ మహిళల పాత్ర గొప్పదని వివరించారు. మహిళా సాధికారత దిశగా, వారి సంక్షేమం, ప్రగతికోసం పదేండ్ల బిఆర్ఎస్ పాలనలో అమలు చేసిన పలు కార్యక్రమాలను ఈ సందర్భంగా కేసీఆర్ స్మరించుకున్నారు. మహిళా సాధికారతను మరింతగా పెంచే దిశగా ప్రభుత్వాలు కృషి చేయాల్సిన అవసరమున్నదని కేసీఆర్ అభిప్రాయం వ్యక్తం చేశారు.

## ప్రభుత్వ సంస్థలను రాజకీయ కమీషన్లకు అడ్డాగా మారిస్తే చూస్తూ ఊరుకోం: హరీశ్‌రావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,మార్చి8:**సింగరేణి ఓవర్ బర్డెన్ (ఓబీ) టెండర్లలో రేవంత్‌రెడ్డి సర్కార్ సాగిస్తున్న దోపిడీ ఆధారాలతో సహా బట్టబయలైందని మాజీమంత్రి, బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు తెలిపారు. సైట్ విజిట్ సర్టిఫికెట్ ముసుగులో కాంట్రాక్టర్ల రింగ్ ఏర్పాటు చేసి, తెలంగాణ ప్రజల ఆస్తిని ఎలా లూటీ చేస్తుందో బీఆర్ఎస్ బయటపెట్టిందని అన్నారు. బీఆర్ఎస్ అడుగడుగునా నిలదీయడంతోనే శ్రీరాంపూర్ ఎస్ఆర్పి ఓసీ-2 టెండర్ ఫైనాన్షియల్ బిడ్ల అసలు బాగోతం బయటపడిందని అన్నారు.టెక్నికల్ బిడ్ అయిన తర్వాత కూడా ఫైనాన్షియల్ బిడ్‌ను దేశంలో ఎక్కడా లేనివిధంగా ఏడుసార్లు ఎందుకు వాయిదా వేశారని నిలదీసి సింగరేణి కార్మిక లోకాన్ని బీఆర్ఎస్ పార్టీ చైతన్యపరిచిందని హరీశ్‌రావు తెలిపారు. ఆ నిరంతర ఒత్తిడికి తలొగ్గి, ఎట్టకేలకు సిండికేట్ ప్రమేయం లేకుండా పారదర్శకంగా బిడ్లు తెరిచేసరికి.. ఈ టెండర్ ఏకంగా మైనస్ 12 శాతం (-12 ) కు క్లోజ్ అయిందని పేర్కొన్నారు. కొత్త నిబంధనలు తెచ్చాక సింగరేణిలో నమోదైన తొలి నెగెటివ్ బిడ్ ఇదే అని చెప్పారు. ముఖ్యమంత్రి బావమరిది సృజన్ రెడ్డి సిండికేట్‌ను బద్దలు కొడితే అసలైన పోటీ ఎలా ఉంటుందో, ధరలు ఎలా దిగి వస్తాయో ఈ ఒక్క టెండర్ నిరూపించిందని అన్నారు. గతంలో సింగరేణిలో ఓబీ టెండర్లు పారదర్శకంగా ఆన్‌లైన్‌లో జరిగేవని గుర్తుచేశారు. అప్పట్లో -7 నుంచి -20 తక్కువకే పనులు పూర్తయ్యి, సంస్థకు వందలాది కోట్లు ఆదా అయ్యేవని తెలిపారు. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బావమరిది సృజన్‌రెడ్డి కనుసన్నల్లో ఈ దోపిడీకి స్కెచ్ గీశారని విమర్శించారు.

## కాంగ్రెస్ నిర్ణయంతో ఇరాన్‌తో భారత్ సంబంధాలు దెబ్బ తిన్నాయి

### బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మార్చి 8:** 2005లో యూపీఏ ప్రభుత్వం ఇంటర్నేషనల్ అటామిక్ ఎనర్జీ ఏజెన్సీలో ఇరాన్‌కు వ్యతిరేకంగా ఓటు వేసిందని, దీనితో 2012లో మనకు ఇరాన్ ఆయిల్ సరఫరా నిలిపి వేసిందని తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు అన్నారు. యూపీఏ ప్రభుత్వం ఆరోజు తీసుకున్న నిర్ణయం భారత్, ఇరాన్ సంబంధాలను దెబ్బతీసిందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ దేశానికి అనుకూలంగా మాట్లాడకపోయినా పర్వాలేదు కానీ ప్రజల్లో భయాందోళనలు కలిగించే తప్పుడు ప్రచారం చేయవద్దని హితవు పలికారు. ఆదివారం మహేశ్వరం నియోజకవర్గం నుంచి ఇతర పార్టీలకు చెందిన కార్యకర్తలు బిజెపిలో చేరిన సందర్భంగా ఆయన మాట్లాడారు.

## కామారెడ్డిలో ముగ్గురు కూతుళ్లను చెరువులోకి తోసేసిన తండ్రి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మార్చి 8:** కామారెడ్డిలో దారుణం వెలుగులోకి వచ్చింది. మహిళ దినోత్సవానికి ముందు రోజే పోషించే స్తోమత లేక ముగ్గురు కూతుళ్లను తండ్రి చెరువులోకి తోసేశాడు. ఈ ఘటనలో ఇద్దరు మృతి చెందగా మరొకరు గల్లంతయ్యారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి పట్టణం ఆర్పీనగర్ ప్రాంతంలో ఇస్మాయిల్-షబీనా అనే భార్యభర్తలు నివసిస్తున్నారు. ఈ దంపతులకు ముగ్గురు కూతుళ్లు షీఫత్(8), ఆయత్(7), మరియమ్(5) ఉన్నారు. ఇస్మాయిల్ ఆటో నడుపుతూ, షబీనా కూలీ పనులు చేస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. శనివారం కూలీ పనులకు వెళ్లి తిరిగి వచ్చాక పిల్లలు కనిపించకపోవడంతో భర్తతో కలిసి పోలీసులకు షబీనా ఫిర్యాదు చేసింది. పిల్లలకు దోశ తినిపించేందుకు తీసుకెళ్లాలని, ఆటో గిరాకీ రావడంతో వారిని ఇంటికి వెళ్లమని చెప్పి తాను వెళ్లిపోయానని విచారణలో పోలీసులకు తండ్రి వివరించాడు. సిసిటివి దృశ్యాలకు, ఇస్మాయిల్ సమాధానాలకు పొంతన లేకపోవడంతో అతడిని పోలీసులు అదుపులోకి తీసుకొని తనదైన శైలిలో ప్రశ్నించడంతో ముగ్గురు పిల్లలను పెద్దచెరువులో తోసేశానని చెప్పాడు. వారంతా చనిపోయారని నిర్ధారించుకునేందుకు అరగంట సేపు అక్కడే ఉన్నానని తండ్రి ఒప్పుకున్నాడు. వెంటనే పోలీసులు సహాయక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టారు. ఇద్దరు చిన్నారుల మృతదేహాలను వెలికితీశామని, మరో చిన్నారి మృతదేహం కోసం గాలిస్తున్నామని వెల్లడించారు. తండ్రిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని చెప్పారు.

## గ్యాస్ సిలిండర్ బుకింగ్‌లో స్వల్పమార్పులు

### ఇక 21 రోజుల తర్వాత రెండో సిలిండర్ బుకింగ్‌కు అనుమతి

**హైదరాబాద్, మార్చి 8, ప్రభాతవార్త:** సిలిండర్ బుకింగ్ విధానంలో గ్యాస్ కంపెనీలు చిన్న మార్పులు చేస్తూ నిర్ణయం తీసుకున్నాయి. ఇప్పటి వరకు ఒక సిలిండర్ తీసుకున్న 15 రోజుల తర్వాతే రెండోది బుక్ చేసుకునే అవకాశం ఉండేది. కానీ ఇప్పుడు ఆ సమయాన్ని 21 రోజులకు కంపెనీలు పెంచాయి. తాజా నిబంధనల ప్రకారం ఒక సిలిండర్ డెలివరీ అయిన తర్వాత రెండోది రావాలంటే కనీసం 21 రోజుల వ్యవధి ఉండాలి.ఇందుకోసం గ్యాస్ ఏజెన్సీల సాఫ్ట్‌వేర్‌ను కూడా అప్‌డేట్ చేశారు. ఒక సంవత్సరంలో (ఏప్రిల్ 1 నుంచి మార్చి 31 వరకు) ఒక్కో కనెక్షన్‌పై మొత్తం 15 సిలిండర్లు మాత్రమే తీసుకోవచ్చు. ఇందులో 12 సిలిండర్లు సబ్సిడీతో వస్తాయి. మిగిలిన 3 సిలిండర్లకు సబ్సిడీ ఉండదు. అదేవిధంగా బుకింగ్ చేసిన 24 గంటలలోపే సిలిండర్ డెలివరీ చేయాలని డీలర్లను గ్యాస్ కంపెనీలు ఆదేశించాయి.

# లేక్ సిటీగా హైదరాబాద్

### నగరంలోని చెరువులకు ఎంతో చరిత్ర

### పూర్వవైభవం తేవాలన్నదే లక్ష్యం

### బమ్మృకున్‌ఉద్‌దౌలా చెరువును ప్రారంభించిన సిఎం రేవంత్‌రెడ్డి



**హైదరాబాద్ (అత్తాపూర్) మార్చి 8, ప్రభాతవార్త :** నగరంలోని చెరువులకు ఎంతో చరిత్ర ఉందని వాటిన్ని అభివృద్ధి చేసేందుకు చెరువుల సుందరీ కరణను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని చెరువులకు పూ ర్వవైభవం తీసుకురావడానికి ఎంతో కృషి చేస్తున్నామని మళ్లీ హైద రాబాద్‌ను లేక్ సిటీగా తీర్చిదిద్దుతామని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం రాజేంద్ర నగర్‌లోని శివరాంపల్లిలో హైడ్రా అభివృద్ధి చేసిన బమ్మృకున్ ఉద్‌దౌలా చెరువు ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొంగు లేటి శ్రీనివాస్‌రెడ్డి,ఎంపీ ఓవైసీ అసదుద్దీన్ హాజరై బమ్మృకున్ ఉద్ దౌలా చెరువును ప్రారంభిం చారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ... నిజాం కాలం నాటి చెరువులను కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. నిజాం సర్కారు హైదరాబాద్ ప్రజలు, రైతుల కోసం ఎన్నో ప్రాజెక్టులు నిర్మించిందని అదేవిధంగా చరిత్ర కట్టడాలను కట్టారని వాటన్నిటిని కాపాడుకోవాలని పేర్కొన్నారు. ప్రపంచంలోనే అద్భుత నగరంగా హైదరాబాదును తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టేమని అందులో భాగంగా హైడ్రాతో చెరువులకు పూర్వ వైభవం తీసుకొస్తున్నా మన్నారు. మొన్న బతు కమ్మ కుంట నేడు బమ్మృకున్ ఉద్ దౌలా చెరువును అద్భుతంగా తీర్చిదిద్దుకొని ప్రారంభించుకున్నా మన్నారు. హైదరాబాద్ చెత్తతో అక్రమలతో నిండి పోయిందని ఇప్పుడు నగరాన్ని కాపాడుకోకపోతే మరి ఎప్పటికీ కాపాడు కోలేమని పేర్కొన్నారు. నగర అభివృద్ధికి ఎంపీ ఓవైసీ అసద్దిన్ సహకారం అందిస్తున్నారని మీరాలం ట్యాంక్, ఓల్డ్ సిటీ మెట్రో అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందని మరి న్ని అభివృద్ధి పనులు చేపట్టు కోవా లంటే ప్రజల సహకారం తప్పని సరన్నారు. ఒకప్పుడు హైదరాబాదును లెగ్ సిటీగా పిలుచుకునే వారని మళ్లీ వాటికి పూర్వవైభవం తీసుకొచ్చి హైదరాబాద్‌ను లేక్‌సిటీగా రూపొం దించుకో వాలన్నారు. అభివృద్ధి చేసిన చెరువులలో మహిళలకు ఉపాధి కల్పించడానికి స్టాల్స్‌ను ఏర్పాటు చేయాలని హైడ్రాధికారులకు ఆదేశించారు. మూసి ని అభివృద్ధి చేసి నైట్ టూరిజాన్ని డెవలప్మెంట్ చేయడానికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఇందులో భాగంగా మూసి పక్కన ఉన్న పేదలు ఇల్లు కోల్పోవాల్సి వస్తుందని వారికి అన్ని విధాలుగా అండగా ఉంటామని వారికి పూర్తి సహకారం అందించి ఇల్లు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. దేశంలోనే హైదరాబాదు నగరాన్ని నెంబర్ వన్ గా నిలిపేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుం టుందని ప్రజల సహకారం కూడా అవసరమని పేర్కొ న్నారు. అంతకుముందు ఎంపీ ఓవైసీ అసద్దీన్ మాట్లాడారు. నగర అభివృద్ధికి సీఎం రేవంత్ రెడ్డి అన్ని విధా లుగా సహకారం అందిస్తున్నారని వారి కృషితో మీరా లంట్యాంక్, మెట్రో, చెరువుల అభివృద్ధి చేపట్టడం జరుగు తుందని వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, హైడ్రా కమిషనర్ రంగనాథ్, హైదరాబాద్ జిహెచ్ఎంసి కమిషనర్ కర్ణన్, తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమంలో ఫేస్ రికగ్నిషన్

### ఆధార్ ఆధారిత ఫేస్ ఆథెంటికేషన్

### అంగన్‌వాడీల్లో పోషకాహారంలో తప్పనిసరి

### ఆసరాలో 3 లక్షల మంది అనర్హుల తొలగింపు

### రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు

**హైదరాబాద్, మార్చి 8, ప్రభాతవార్త:** రాష్ట్రంలో అమలు జరుగుతున్న అన్ని ప్రభుత్వ పథకాలకు ఇకపై ముఖ గుర్తింపు (ఫేస్ రికగ్నిషన్) తప్పనిసరి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆధార్ ఆధారిత ఫేస్ అథెంటికేషన్ యాప్‌ల ద్వారా ఈ గుర్తింపు ప్రక్రియ జరిగే అవకాశం ఉంది. ఈ విధానం ద్వారా అనర్హులను తొలగించడం, నకిలీలను అరికట్టడం మరియు పింఛన్లు, రేషన్ వంటి పథకాలలో లీకేజీలను అడ్డుకోవడం ప్రధాన ఉద్దేశం. ఈ మేరకు జిల్లా అధికారులకు ఆదేశాలు జారీ అయ్యాయి. అంగన్వాడీలలో గర్భిణీలు, పాలిచ్చే తల్లులు మరియు 3 నుండి 6 ఏళ్ల పిల్లలకు పోషకాహార పంపిణీ లో కూడా ఈ విధానాన్ని కేంద్రం తప్పనిసరి చేసింది. ఇక ఈ విధానం ద్వారా పథకాల లబ్ధిదారుల గుర్తింపులో పారదర్శకత పెరగనుంది. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాల కింద ఒకే వ్యక్తి పలుమార్లు అనర్హంగా లబ్ధి పొందడాన్ని అరికట్టేందుకు ఈ చర్యలు చేపట్టినట్లు అధికవర్గాలు వెల్లడించాయి. లబ్ధిదారుల గుర్తింపు ప్రక్రియను మరింత పటిష్టంగా మార్చేందుకు ఫేస్ రికగ్నిషన్ విధానాన్ని ప్రవేశపెడుతోంది. ఈ ప్రక్రియను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. దీనివల్ల పథకాల అమలులో అవకతవకలకు తావులేకుండా ఉం టుందని అధికా రులు భావిస్తున్నారు. కొత్త విధా నం అమలుతో అర్హులైన లబ్ధిదారులకు మాత్రమే ప్రయో జనాలు చేరేలా చూడవచ్చని, ప్రభుత్వ నిధుల దుర్వినియోగాన్ని అరికట్టవచ్చని అంచనా వేస్తున్నారు. ఈ మార్పు వల్ల లబ్ధిదారుల నమోదు ప్రక్రియలోనూ మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉంది. ప్రభుత్వ నిర్ణయంపై వివిధ వర్గాల నుంచి స్పందనలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆసరా పింఛన్లలో ప్రవేశ పెట్టాలని నిర్ణయించారు. ఇప్పటికే ఆసరా పింఛన్లలో ఈ విధానాన్ని అమలు చేయడం ద్వారా సుమారు 3 లక్షల మంది అనర్హులను తొలగించడం సంచలనం అయింది. సాంకేతికతను సక్రమంగా వినియోగించుకపోవడం వల్ల గతంలో జరిగిన పొరపాట్లను సరిదిద్దుతూ, అర్హులైన ప్రతి పేదవాడికి న్యాయం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోంది. ఈ విధంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి పథకాల అమలును మెరుగుపరచాలనే ప్రభుత్వ ప్రయత్నాన్ని కొందరు స్వాగతిస్తుండగా, అమలులో ఎదురయ్యే సవాళ్లపై మరికొందరు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# రామగుండంలో పడిపోయిన యూరియా ఉత్పత్తి

### యుద్ధం కారణంగా గ్యాస్ సరఫరాలో కోత

**హైదరాబాద్, మార్చి 8, ప్రభాతవార్త:** ఇరాన్ యుద్ధ ప్రభావంతో రాష్ట్రంలోని రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ (ఆర్ఎఫ్‌సీఎల్)లో యూరియా ఉత్పత్తి సగానికి పడిపోయింది. యుధం కారణంగా గ్యాస్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్(గెయిల్) ఎల్ఎన్‌జీ సరఫరాలో కోత పెట్టడంతో ప్రస్తుతం ప్లాంట్‌ను 50 శాతం సామర్థ్యంతోనే నడుపుతున్నారు. రోజుకు 3,850 టన్నుల యూరియా ఉత్పత్తి జరుగాల్సి ఉండగా ప్రస్తుతం 1,600 నుంచి 1,900 టన్నులు మాత్రమే ఉత్పత్తి జరుగుతున్నది. పరిశ్రమలో స్టాక్ లేకపోవడంతో సరఫరాను యాజమాన్యం నిలిపివేసింది. పరిశ్రమ నుంచి రాష్ట్రానికి, ఇతర రాష్ట్రాలకు యూరియా సరఫరా నిలిచిపోయింది. ఆర్ఎఫ్‌సీఎల్‌లో యూరియా ఉత్పత్తికి, 33మెగావాట్ల క్యాప్టివ్ పవర్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తికి రోజుకు 2 మెట్రిక్ మిలియన్ క్యూబిక్ మీటర్ల గ్యాస్ అవసరం ఉంటుంది. ఇరాన్ యుద్ధ ప్రభావంతో ఖతార్ నుంచి ఎల్ఎన్‌జీ దిగుమతి కాకపోవడంతో యూరియా సరఫరాను సగానికి తగ్గించింది.
ఆర్ఎఫ్‌సీఎల్‌లో ప్రస్తుతం 50శాతం సామర్థంతో పరిశ్రమను నడుపుతోంది. ఇప్పటికే హెచ్‌టీఆర్ వైఫల్యంతో 110రోజులకు పైగా ప్లాంట్ షట్‌డౌన్ అయ్యింది. ఇప్పుడు సామర్థ్యాన్ని ఏకంగా 50శాతానికి తగ్గించడం ద్వారా సాంకేతిక సమస్యలు ఎదురవుతాయని భావిస్తున్నారు. మరో వైపు గెయిల్ ఎల్ఎన్‌జీ సరఫరాను మరింత తగ్గిస్తే ప్లాంట్ పూర్తిగా షట్‌డౌన్ అయ్యే అవకాశాలున్నాయి. ఒకటి రెండు రోజుల్లో ప్లాంట్‌కు ఇలాంటి పరిస్థితి ఎదురయ్యే అవకాశాలు లేకపోలేదు. 5వ తేదిన 15శాతం ఉత్పత్తిని తగ్గించిన యాజమాన్యం 6వ తేది సాయంత్రం వరకే 50శాతం తగ్గించడంతో అధికారుల్లో ఆందోళన వ్యక్తమవుతుంది.

# మహిళా రైతులకు ప్రభుత్వం పెద్దపీట

### మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, శ్రీధర్‌బాబు, సీతక్క

### వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఘనంగా ఆరువేల మందితో మెగా మహిళా రైతు మేళా

**హైదరాబాద్ (అత్తాపూర్), మార్చి 8, ప్రభాతవార్త :** మహిళా రైతులకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని రైతాంగ సంక్షేమ కోసమే నిరంతరం పని చేస్తున్నామని రాష్ట్ర మంత్రులు పేర్కొన్నారు. రాజేంద్ర నగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణా వ్యవసాయ విశ్వవిద్యాలయం క్రీడా ప్రాంగణంలో రెండు రోజుల పాటు జరిగే మెగా రైతు మేళా ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని, 2026ని అంతర్జాతీయ మహిళా రైతు సంవత్సరంగా ఐక్యరాజ్యసమితి ప్రకటించిన నేపథ్యంలో ఈ మేళాని ఏర్పాటు చేసారు. ఈ కార్యక్రమానికి మంత్రులు తుమ్మల నాగేశ్వర రావు, దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు,సీతక్కలు ముఖ్య అతిథులుగా హాజరై రైతు మేళాను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తమ ప్రభుత్వం వ్యవసాయం, రైతాంగ సంక్షేమమే ఊపిరిగా నిరంతరం పని చేస్తోందన్నారు. 500 కోట్లతో పునరుద్దరించిన వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో మహిళా రైతులకే పెద్ద పీటవేస్తున్నామన్నారు. భవిష్యత్తులో మహిళలకే డ్రోన్‌లు అందిస్తామని తెలిపారు. పంటమార్పిడి, సహజ వ్యవసాయ విధానాలని విరివిగా ప్రోత్సహిస్తున్నామన్నారు. ప్రతి జిల్లాలో ఆయిల్ పాం పరిశ్రమని ఏర్పాటు చేయడానికి కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం రాగానే మూడు కొత్త వ్యవసాయ కళాశాలలు ఏర్పాటు చేసామని తెలిపారు. రైతు వేదికల ద్వారా రైతులకి అధునాతన టెక్నాలజీలపై అవగాహన కలిపిస్తున్నామని వివరించారు. అధునాతన నైపుణ్యాలు, టెక్నాలజీ లని ఉపయోగించుకొని ప్రజల అవసరాలకి సరిప డా అహారధాన్యాలని రైతులు పండించాలని రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పిలుపు నిచ్చా రు. భూసార పరిరక్షణ, పంటల వైవిధ్యీకరణలపై రైతులు ప్రత్యేక దృష్టి పెట్టా లని సూచిం చారు. కొత్త వంగడాలు, టెక్నాలజీలని అందుబా టులోకి తీసుకొని వచ్చి వ్యవసాయ విశ్వవిద్యాల యం రైతులకి అసమాన సేవ చేస్తున్నదని ప్రశంసించారు.
మెగా రైతుమేళా నిర్వహిస్తున్నందుకు యూనివర్సిటీని సీతక్క అభినందించారు. విత్తనా లు నాటిన నుంచి పంట కోసి ఇంటికి చేర్చే దాకా ఆడబిడ్డలు చెమటోడ్చుతారని వివరించారు. రైతాంగ సంక్షేమానికి తెలంగాణా ప్రభుత్వం అసమాన కృషి చేస్తున్నదని ఎం.ఎల్.జాట్ అన్నారు. భారతదేశ వ్యవసాయ రంగంలో మహిళల వాటా సుమారు 58 శాతం అని పీజేటీఏయూ ఉపకులపతి అల్దాస్ జానయ్య అన్నారు.తమ విశ్వవిద్యాలయంలో బోధన సిబ్బందిలో 50 శాతం మహిళలున్నారని, వ్యవసాయ విద్యనభ్యసించే విద్యార్థులలో 70 శాతం అమ్మాయేలనని జానయ్య వివరించారు. ఈ సందర్భంగా 30 మంది మహిళా రైతులకి, ఆరుగురు వ్యవసాయ పాత్రికేయులకి మంత్రులు అవార్డులు అందచేశారు.




## సింఘ్వీ ఆస్తులు రూ.2,869 కోట్లు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మార్చి 8:**తెలంగాణ నుంచి రాజ్యసభ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన సుప్రీంకోర్టు న్యాయవాది, కాంగ్రెస్ నేత అభిషేక్ మను సింఘ్వీ ఎన్నికల అఫిడవిట్‌లో ఆస్తుల వివరాలు వెల్లడించారు. మార్చి 2026 నాటి నివేదికల ప్రకారం, ఆయన, ఆయన భార్య ఉమ్మడిగా రూ. 2,869 కోట్ల (సుమారుగా) విలువైన ఆస్తులను కలిగి ఉన్నారు. గత ఐదు ఆర్థిక సంవత్సరాల్లో ఆయన ఆదాయంలో భారీ పెరుగుదల నమోదైంది, 2024-25లో రూ. 374 కోట్లకు పైగా ఆదాయాన్ని ప్రకటించారు.ఆస్తుల రకాలు: ఆయన నికర ఆస్తులలో షేర్లు, మ్యూచువల్ ఫండ్స్, డిబెంచర్లు మరియు విదేశీ ఆస్తులు ఉన్నాయి. ట్రస్ట్ కంట్రిబ్యూషన్: ఆదినాథ్ ఫ్యామిలీ ట్రస్ట్‌కు భారీగా (సుమారు రూ. 330 కోట్లు) సహకారం అందించినట్లు అఫిడవిట్‌లో పేర్కొన్నారు. అటు మరో అభ్యర్థి వేం నరేందర్‌రెడ్డి తనకు రూ.80 కోట్ల ఆస్తులు ఉన్నాయని వెల్లడించారు.

## హైదరాబాద్‌లో భారీ సింథటిక్ డ్రగ్స్ రాకెట్ గుట్టురట్టు

### రాజస్థాన్‌కు తరలించి విక్రయాలు

### ఆ రాష్ట్రంలో పట్టుబడిన నిందితుల విచారణలో షాద్‌నగర్ డ్రగ్ తయారీ నెట్‌వర్క్ బట్టబయలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మార్చి 8:** నగరంలో భారీ సింథటిక్ డ్రగ్స్ రాకెట్ గుట్టు రట్టయ్యింది. షాద్‌నగర్‌లో మెఫెడ్రోన్ తయారు చేస్తున్న అంతర్రాష్ట్ర గ్యాంగ్‌పై హైదరాబాద్ నార్కోటిక్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. తెలంగాణ ఈగల్ టీం సమాచారంతో ఆదివారం షాద్‌నగర్‌లోని సింథటిక్ డ్రగ్స్ తయారీ కేంద్రంపై దాడి చేసిన పోలీసులు భారీగా డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఆర్ ఇన్నోవేషన్స్ ఇండియా సంస్థ ద్వారా డ్రగ్స్ తయారికి ఉపయోగించే ప్రికర్సర్ కెమికల్స్ సరఫరా చేస్తున్నట్లు గుర్తించామని 2బోమో 4మిథైల్ప్రొపియోఫెనోన్‌వంటి కెమికల్స్‌ను ఆన్ లైన్లో విక్రయిస్తున్నట్లు గుర్తించామని పోలీసులు వెల్లడించారు. ఈ కెమికల్స్‌తో నిషేధిత డ్రగ్ మెఫెడ్రోన్ తయారు చేస్తున్నట్లు అనుమానిస్తున్నామని తెలిపారు. ప్రధాన నిందితుడు వీరేంద్ర స్వామి అలియాస్ గిరీష్ తాపర్ సహా పలువురు నిందితులు డ్రగ్స్ తయారీలో ఉన్నట్లు తెలిపారు. నిందితులు నకిలీ అడ్రస్‌లతో కెమికల్స్ ఆర్డర్ చేసి షాద్ నగర్‌లో ల్యాబ్ ఏర్పాటు చేసి డ్రగ్స్ తయారు చేస్తున్నారని తెలిపారు. మొత్తం 300 కిలోల వరకు కెమికల్ కొనుగోలు చేసినట్లు విచారణలో వెల్లడైందని తెలిపారు. నగరంలో తయారైన డ్రగ్స్‌ను రాజస్థాన్‌కు తరలించి అమ్ముతున్నట్లు గుర్తించామని తెలిపారు. రాజస్థాన్‌లో పోలీసులు వీరేంద్ర స్వామి, మనీష్ బిష్ణోయ్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా, ఈ విచారణలో షాద్‌నగర్ డ్రగ్ తయారీ నెట్‌వర్క్ బయటపడిందని హైదరాబాద్ నార్కోటిక్స్ పోలీసులు వెల్లడించారు.

## విద్యుత్ సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ 10న దేశవ్యాప్త సమ్మె

### ఆల్ ఇండియా పవర్ ఇంజినీర్స్ ఫెడరేషన్ పిలుపు

**హైదరాబాద్, మార్చి 8, ప్రభాతవార్త :** ప్రస్తుత బడ్జెట్ సమావేశాల్లోనే కేంద్ర ప్రభుత్వం విద్యుత్ (సవరణ) బిల్లు 2025ను పార్లమెంటులో ప్రవేశపెట్టి, ఆమోదించాలని చూస్తుండటంపై అల్ ఇండియా పవర్ ఇంజినీర్ల ఫెడరేషన్ ఆగ్రహం వ్యక్తం చేసింది.ఈమేరకు ఆదివారం ఏఐపీఈఎఫ్ ఫెడరల్ ఎగ్జిక్యూటివ్ సమావేశం డెహ్రాడూన్‌లో జరగగా ఛైర్మన్ శైలేంద్ర దూబె మరియు సెక్రటరీ జనరల్ పి. రత్నాకర్ రావు మాట్లాడుతూ కేంద్రం ప్రవేశపెట్టే బిల్లును వ్యతిరేకిస్తూ మార్చి 10న దేశ వ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చారు. విద్యుత్ ఉద్యోగులు, ఇంజనీర్లు, రైతులు మరియు వినియోగదారుల సంఘాలు పెద్ద ఎత్తున అభ్యంతరాలు వ్యక్తం చేసినప్పటికీ, ఎటువంటి పారదర్శక చర్చలు లేకుండా ప్రభుత్వం ఈ బిల్లును ముందుకు తీసుకెళ్లడం విచారకరం అన్నారు. కేవలం ప్రభుత్వ విద్యుత్ రంగ వ్యవస్థను నిర్వీర్యం చేసి, కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ఈ సందర్భంగా ఉత్తరప్రదేశ్‌లో పూర్వాంచల్, దక్షిణాంచల్ డిస్కామ్‌ల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా 466 రోజులుగా సాగుతున్న పోరాటానికి మద్దతు ప్రకటించారు.ఉత్తరాఖండ్ జల విద్యుత్ నిగమ్ పరిధిలోని భూములను ప్రైవేట్ రంగానికి కట్టబెట్టడాన్ని పంజాబ్ ప్రభుత్వ చర్యలను తీవ్రంగా వ్యతిరేకించారు. ప్రభుత్వం మొండిగా బిల్లును పార్లమెంటులో ప్రవేశపెడితే, మార్చి 10 న దేశవ్యాప్తంగా విద్యుత్ ఇంజనీర్లు మరియు ఉద్యోగులు విధులను బహిష్కరించి, కార్యాలయాలు మరియు ప్రాజెక్ట్ సైట్‌ల వద్ద భారీ నిరసనలు చేపడతారని ప్రకటించారు.

## యాదగిరిగుట్టలో చిలుక జ్యోతిష్యం పేరిట అన్యమత ప్రచారం

### ఆగ్రహం వ్యక్తం చేస్తున్న భక్తులు



**యాదగిరిగుట్ట, మార్చి 8, ప్రభాతవార్త :** ప్రముఖ పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహా స్వామి దేవస్థానంలో చిలుక జ్యోతిష్యం పేరుతో కొందరు వ్యక్తులు భక్తులను ఆకర్షిస్తూ ఆదివారం అన్య మత ప్రచారం నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా చిలుక జ్యోతిష్యం చెప్పే కార్డులలో యేసు ప్రభువు చిత్రాలను ఉపయోగిస్తూ మత ప్రచారం చేస్తున్నారని స్థానికులు, భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. చిలుక జోష్యం చెప్పే నెపంతో కార్డులలో హిందూ దేవతల చిత్రాలకు బదులు యేసు ప్రభువు చిత్రాలు ఉంచి ప్రచారం చేస్తున్నారు. యేసు ప్రభువే మీకు మార్గం చూపుతాడు, ప్రభువును నమ్మితే మీ సమస్యలు తొలగుతాయి వంటి మాటలు చెబుతూ మత ప్రచారం చేస్తున్నారని భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఆలయానికి వచ్చిన భక్తుల విశ్వాసాన్ని ఉపయో గించుకొని ఈ విధంగా ప్రచారం చేయడం అనైతికమని విమర్శిస్తున్నారు. స్థానికుల మాటల్లో, ఇలాంటి ఘటనలు అప్పుడప్పుడు జరుగుతున్నప్పటికీ వాటిపై ఎలాంటి కఠిన చర్యలు తీసుకోకపోవడం వల్ల ఇలాంటి వ్యవహారాలు మళ్లీ మళ్లీ జరుగుతున్నాయని చెబుతున్నారు. ఆలయ పరిసర ప్రాంతాల్లో అనధికారికంగా వ్యాపారాలు చేసే వారిపై అధికారులు మరింత కఠినంగా వ్యవహరించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

## ద్రాక్ష సాగుకు పూర్వవైభవం వచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేసిన ప్రభుత్వం

### గతంలో 15వేల నుండి 20వేల ఎకరాల్లో ద్రాక్ష సాగు

### నేడు 660 ఎకరాలకు పడిపోయిన వైనం

**హైదరాబాద్, మార్చి 8, ప్రభాతవార్త:** తెలంగాణలో ద్రాక్ష సాగు కనుమరుగైపోతున్న వేళ ఈ పంట సాగు పట్ల రైతుల్లో అవగాహన కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ప్రెసిషన్ ఫార్మింగ్ ఖచ్చితమైన వ్యవసాయంలో ద్రాక్ష అత్యంత యోగ్యమైన పంట. దీని దృష్ట్యా పంట మార్పిడిలో భాగంగా రైతులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఒకప్పుడు హైదరాబాద్ పరిసర ప్రాంతాలు(శంషాబాద్, తుక్కుగూడ, బొల్లారం, శామీర్‌పేట తదితర), రంగారెడ్డి, మహబూబ్‌నగర్ తదితర జిల్లాల్లో పెద్ద ఎత్తున ద్రాక్ష సాగయ్యేది. అయితే హైదరాబాద్ చుట్టు పక్కల జ్యూస్, వైన్, సీడ్ సెల్ రకాల కోసం వేల ఎకరాల్లో సాగైన ద్రాక్ష పంట కాలక్రమేణా తగ్గిపోయింది. నగరం శరవేగంగా అభివృద్ధి చెందుతుండటం, స్థిరాస్తి వ్యాపారం, కూలీల కొరత, పెట్టుబడి వ్యయం పెరగడం, చీడపీడలు, తెగుళ్లు, ఆశించి దిగుబడులు రాకపోవడం, సరైన మార్కెటింగ్ సదుపాయాలు లేకపోవడం, ప్రభుత్వ ప్రోత్సాహం కొరవడటం ఇవన్నీ ద్రాక్ష పంట సాగుకు ఆటంకాలు సృష్టించాయి. ఫలితంగా రాష్ట్రంలో ద్రాక్ష సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గి ప్రస్తుతం ఈ పంట సాగు కనుమరుగైపోతోంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ద్రాక్ష సాగుకు పూర్వ వైభవం తీసుకురావడమే లక్ష్యంగా పెట్టుకుంది. వాతావరణ మార్పుల నేపథ్యంలో అనువైన ప్రాంతాల రైతుల్లో ద్రాక్ష పంట సాగు ప్రోత్సహించడం ద్వారా ఉత్పత్తి, ఉత్పాదకత పెంపొందించేందుకు ప్రణాళికలను సిద్ధం చేసింది.ఈ క్రమంలో ద్రాక్ష పండ్ల వినియోగం పట్ల అన్ని వర్గాల ప్రజలు, పంట సాగు పట్ల రైతుల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు వ్యవసాయ విశ్వవిద్యాలయంలోని ఉద్యాన కళాశాల పక్కన పరిశోధన క్షేత్రంలో 54 మేలిమి రకాల ద్రాక్షను సాగు చేస్తున్నారు. 1980-90 దశకంలో రాష్ట్రంలో హైదరాబాద్‌తోపాటు శివారు జిల్లాల్లో ద్రాక్ష సాగు దాదాపు 15000 నుండి 20000 ఎకరాల్లో సాగయ్యేది. అయితే ఇటీవలి కాలంలో గణనీయంగా తగ్గిన సాగు 2024-25 కు వచ్చే సరికి కేవలం 660 ఎకరాల విస్తీర్ణానికి పడిపోయింది. ఇందులో 406 ఎకరాల్లో మేడ్చల్ మల్కాగిరిజిల్లాలో, 135 ఎకరాలు సిద్ధిపేటలో, 103 ఎకరాల్లో రంగారెడ్డిలో, 9 ఎకరాల్లో జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో సాగవుతోంది. రాష్ట్రంలోని దాదాపు 22 జిల్లాల్లో ద్రాక్ష సాగు విస్తీర్ణం సున్నానే కావడం గమనార్హం. ప్రస్తుతం చాలా కొద్ది మంది రైతులు మాత్రమే ద్రాక్షను సాగు చేస్తున్నారు. పొరుగున ఉన్న కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాలు ప్రత్యేకంగా ద్రాక్ష సాగును ప్రోత్సహించేందుకు ప్రత్యేక పాలసీని అమలు చేస్తున్నాయని, తెలంగాణలో అలాంటిదేమీ లేదని ద్రాక్ష రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# మనదే టీ20 ప్రపంచకప్

## అహ్మదాబాద్‌లో బ్లూ సునామీ ●న్యూజిలాండ్‌ను చిత్తు చేసిన సూర్యసేన ● ముచ్చటగా మూడో కప్




ఇషాన్ కిషన్ 25 బంతుల్లో 54 రన్స్

అభిషేక్ శర్మ 21 బంతుల్లో 52 రన్స్

సంజూ శాంసన్ 46 బంతుల్లో 89 రన్స్

అక్షర్ పటేల్ 27 రన్స్‌కు 3 వికెట్లు

**అహ్మదాబాద్:** టీ20 ప్రపంచకప్ ఫైనల్లో టీమిండియా రికార్డు స్కోరు సాధించింది. 256 లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్ మరో ఓవర్ ఉండగానే 159 రన్స్‌కు కుప్పకూలింది. టీమిండియా 96 పరుగులతో చిత్తుచేసి ముచ్చటగా మూడోసారి పొట్టి ప్రపంచకప్ అందుకుంది.

టాస్ ఓడి మొదట సూర్యసేన బ్యాటింగ్‌కు దిగింది. న్యూజిలాండ్ బౌలింగ్‌ను చితక్కొడుతూ భారత టాపార్డర్ బ్యాటర్లు ఆకాశమే హద్దుగా చెలరేగారు. గత మ్యాచ్‌లలో విఫలమైన అభిషేక్ శర్మ.. టైటిల్ పోరులో బ్యాట్ ఝుళిపించాడు. కేవలం 18 బంతుల్లోనే 50 పరుగుల మార్కు అందుకున్నాడు. మొత్తంగా 21 బంతుల్లో 6 ఫోర్లు, 3 సిక్సర్లు బాది 52 పరుగులు సాధించాడు.

ఇక మరో ఓపెనర్ సంజూ శాంసన్ సూపర్ ఫామ్ కొనసాగిస్తూ మరోసారి విజృంభించాడు. కేవలం 46 బంతుల్లోనే 5 ఫోర్లు, 8 సిక్సర్లు బాది 89 పరుగులు సాధించాడు. మరోసారి సెంచరీ మిస్సయ్యాడు. ఇషాన్ సైతం23 బంతుల్లో హాఫ్ సెంచరీ చేశాడు. మొత్తంగా 25 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్సర్లు బాది 54 పరుగులు సాధించాడు. మిగిలిన వారిలో సూర్యకుమార్ డకౌట్ కాగా.. హార్దిక్ పాండ్యా (13 బంతుల్లో 18) నిరాశపరిచాడు. తిలక్ వర్మ 6 బంతుల్లో 8 పరుగులతో అజేయంగా నిలవగా.. శివం దూబే 8 బంతుల్లోనే 3 ఫోర్లు, 2 సిక్స్‌లు బాది 26 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. ఫలితంగా నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి టీమిండియా 255 పరుగుల భారీ స్కోరు సాధించింది. న్యూజిలాండ్ బౌలర్లలో జేమ్స్ నీషమ్ ఒకే ఓవర్లో మూడు వికెట్లు తీసి సత్తా చాటగా.. మ్యాట్ హెన్రీ, రచిన్ రవీంద్ర తలా ఒక వికెట్ పడగొట్టారు.

*అహ్మదాబాద్‌లో బ్లూ సునామీ ఆవిష్కృతమైంది. బ్లూ బ్రిగేడ్ మొదట బ్యాటింగ్‌లో ధనాధన్ లాడిస్తే.. తర్వాత బౌలింగ్‌లో ప్రత్యర్థిని పేకమేడలా కూల్చారు. టీ20 ప్రపంచకప్‌లో చరిత్ర సృష్టించారు. ఫైనల్‌కు ముందు ఉన్న డౌట్స్ అన్నీ పటాపంచలు చేశారు. సౌతాఫ్రికాపై చెలరేగిన కివీస్‌ల ఆటలు బ్లూ బ్రిగేడ్ ముందు సాగలేదు.సూర్యసేన సూపర్ షోతో ముచ్చటగా మూడోసారి టీ20 ప్రపంచకప్ అందుకుంది. వరుసగా రెండోసారి కప్ సాధించింది.*

### తిప్పేసిన అక్షర్ పటేల్

అనంతరం భారీ లక్ష్య ఛేదనలో న్యూజిలాండ్ తడబడింది. సూపర్ ఫామ్‌లో ఉన్న ఓపెనర్లు టిమ్ సీఫెర్ట్(52), ఫిన్ అల్లెన్(9)ను బౌలర్లు చక్కగా కట్టడి చేశారు. అక్షర్ పటేల్ భారత్‌కు తొలి బ్రేక్ అందించాడు. ఫిన్‌ను తొందరగానే పెవిలియన్ పంపాడు. ఆ వెంటనే క్రీజ్‌లోకి వచ్చిన రచిన్ రవీంద్ర(1)ను బుమ్రా బోల్తా కొట్టించాడు. ఇషాన్ అద్భుత డైవ్‌తో క్యాచ్ అందుకున్నాడు. గ్లేన్ ఫిలిప్స్(5)ను అక్షర్ క్లీన్ బౌల్డ్ చేయడంతో కివీస్ 47 రన్స్‌కే మూడు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. అటు తర్వాత ఏస్థాయిలోనూ కివీస్ కోలుకోలేకపోయింది.

### బూమ్ బూమ్ బుమ్రా

సీఫెర్ట్ ధాటిగా ఆడాడు. అర్ధసెంచరీతో ఒంటరిపోరాటం చేశాడు. మరోఎండ్‌లో చాంప్‌మన్(17)ను హార్దిక్, డారెల్ మిచెల్(17)ను అక్షర్ పటేల్ అవుట్ చేశారు. చివర్లో కెప్టెన్ మిచెల్ సాంట్నర్ ధాటిగా ఆడాడు. 35 బంతుల్లో 43 రన్స్ చేశాడు. బుమ్రా ఒకే ఓవర్లో జేమ్స్ నీషామ్(8), మాట్ హెన్రీ(0)ను వరుస బంతుల్లో అవుట్ చేశాడు. సాంట్నర్‌ను కూడా క్లీన్ బౌల్డ్ చేశాడు. చివరి వికెట్ అభిషేక్ శర్మ తీయడంతో న్యూజిలాండ్ మరో ఓవర్ ఉండగానే 159 రన్స్‌కు ఆలౌటైంది. భారత బౌలర్లలో బుమ్రా 4 వికెట్లు, అక్షర్ పటేల్ మూడు వికెట్లు..హార్దిక్, వరుణ్ చక్రవర్తి, అభిషేక్ శర్మ తలా ఓ వికెట్ తీశారు.

ఫైనల్‌లో న్యూజిలాండ్‌పై 96 పరుగుల తేడాతో నెగ్గి టీమిండియా మూడోసారి ట్రోఫీని దక్కించుకొని చరిత్ర సృష్టించింది. మరే జట్టు కూడా మూడు టైటిళ్లను గెలుచుకోలేదు. ఎంఎస్ ధోనీ, రోహిత్ శర్మ తర్వాత భారత్‌కు కప్ అందించిన సారథిగా సూర్యకుమార్ యాదవ్ నిలిచాడు. ఆతిథ్య జట్టు స్వదేశంలో ట్రోఫీ గెలవడం ఇదే మొదటిసారి. 2007, 2024లో విశ్వవిజేతలుగా నిలిచింది. బ్లూ బ్రిగేడ్ కప్ సాధించడంతో దేశవ్యాప్తంగా సంబరాలు అంబరాన్ని అంటాయి.

## పరుగులు వచ్చాయిలా..

**ఓవర్1(7 రన్స్):** మాట్ హెన్రీ వేసిన ఈ ఓవర్ అయిదో బంతికి సంజూ మిడాన్ మీదుగా స్టాండ్‌లోకి పంపి భారత్ పరుగుల ఖాతా తెరిచాడు.
**ఓవర్2(5 రన్స్):** స్పిన్నర్ గ్లేన్‌ఫిలిప్స్ పొదుపుగా బౌలింగ్ చేశాడు. అభిషేక్ సింగిల్‌తో తన రన్స్ ఖాతా తెరిచాడు. మూడు సింగిల్స్ వచ్చాయి.
**ఓవర్3(15 రన్స్):**డఫీ ఓవర్‌లో అభిషేక్ రెండు,సంజూ ఓఫోర్ బాదారు.
**ఓవర్4(25 రన్స్):** ఫెర్గ్యూసన్ ఓవర్లో భారత్ స్కోరు 50రన్స్ దాటింది. ఈ ఓవర్లో అభిషేక్ కీపర్ మీదుగా బౌండరీ,మిడాఫ్ మీదుగా సిక్స్‌తో విరుచుకుపడ్డాడు. సంజూ కూడా తనవంతుగా సిక్స్, ఫోర్ బాదాడు.
**ఓవర్5(20 రన్స్):** హెన్రీ వేసిన ఈ ఓవర్లోనూ ఓపెనర్లు దంచికొట్టారు. ఇద్దరూ చెరో సిక్స్‌తో 20 రన్స్ సాధించారు.
**ఓవర్6(20 రన్స్):** డఫీ వేసిన ఈ ఓవర్లో అభిషేక్ ఒక్కడే 3బౌండరీలు, ఓ సిక్స్ బాదాడు. 18 బంతుల్లోనే అభిషేక్ 50 రన్స్ కంప్లీట్ చేశాడు. పవర్ ప్లేలో భారత్ వేగంగా 92 రన్స్ చేసింది.
**ఓవర్7(6 రన్స్):** కెప్టెన్ సాంట్నర్ పొదుపుగా 6 పరుగులే ఇచ్చాడు. మొదటి 3 బాల్స్ డాట్‌గా ఆడిన సంజూ.. స్వేర్ బౌండరీ సాధించాడు.
**ఓవర్8(12 రన్స్):** రచిన్ రవీంద్ర వస్తూనే తొలి బంతికే అభిషేక్(58)ను బోల్తా కొట్టించాడు. ఆఫ్ స్టంప్‌కు దూరంగా వేసిన బంతిని వేటాడబోయి కీపర్‌కు క్యాచ్ ఇచ్చాడు. ఇషాన్ కిషన్ వస్తూనే డబుల్‌తో ఖాతా తెరిచి బ్యాక్ టు బ్యాక్ బౌండరీలు బాదాడు. భారత్ స్కోరు వంద దాటింది.
**ఓవర్ 9(5 రన్స్):** సాంట్నర్ తన రెండో ఓవర్‌లోనూ సంజూ, అభిషేక్‌ను కట్టడిచేశాడు. ఈ ఓవర్లో అయిదు సింగిల్స్ మాత్రమే ఇచ్చాడు.
**ఓవర్10(12 రన్స్):** నీషమ్ వేసిన ఈ ఓవర్లో సంజూ, కిషన్ చెరో బౌండరీ బాదారు.సగం ఓవర్లు పూర్తయ్యే సరికి భారత్127రన్స్ చేసింది.
**ఓవర్ 11(10 రన్స్):** సాంట్నర్ మూడో బంతికి కిషన్ మిడ్ వికెట్ మీదుగా స్విప్ షాట్‌తో సిక్స్ బాదాడు. చివరి బంతికి సింగిల్ తీసి సంజూ మరో అర్ధసెంచరీ (33 బంతుల్లో) పూర్తిచేశాడు.
**ఓవర్12(24 రన్స్):** ఫెర్గ్యూసన్ వేసిన ఈ ఓవర్లో సంజూ జూలు విదిల్చాడు. బ్యాక్ టు బ్యాక్ సిక్స్‌లు బాదాడు. ఒకటి స్వేర్ లెగ్ మీదుగా, ఇంకొకటి సైట్ స్క్రీన్ వైపు. మరో ఎండ్‌లో ఇషాన్ కూడా లాంగ్‌ఆన్ సిక్స్ బాదడంతో 24 రన్స్ వచ్చాయి. భారత్ స్కోరు 150 మార్కు దాటింది.
**ఓవర్ 13(10 రన్స్):** హెన్రీ మొదటి బంతికే లాంగ్ ఆన్ మీదుగా ఇషాన్ సిక్స్ కొట్టాడు. మరో నాలుగు సింగిల్స్‌తో పది రన్స్ వచ్చాయి.
**ఓవర్ 14(20 రన్స్):** బౌలింగ్‌కు వచ్చిన స్పిన్నర్ రచిన్ రవీంద్ర వేసిన ఈ ఓవర్ చివరి మూడు బంతులను సంజూ స్టాండ్స్‌లోకి తరలించి స్టేడియాన్ని హోరెత్తించాడు. 20రన్స్ వచ్చాయి.
**ఓవర్ 15(12 రన్స్):** సాంట్నర్ వేసిన ఈ ఓవర్ రెండో బంతికి డీప్ మిడ్ వికెట్ మీదుగా ఇషాన్ కిషన్ సిక్స్‌గా మలిచాడు. సింగిల్‌తో హాఫ్ సెంచరీ(23 బంతుల్లో) పూర్తిచేశాడు. చివరి బంతికి బౌండరీ బాది టీమిండియా స్కోరును 200 మార్కు దాటించాడు.
**ఓవర్ 16(3 వికెట్లు, ఒక రన్):** నీషామ్ పేస్ మ్యాజిక్. ఈ ఓవర్లో మూడు వికెట్లు తీసి టీమిండియాను దెబ్బతీశాడు. హైఫుల్ టాస్ తో మొదట సంజూ(89)ను... లో ఫుల్ టాస్‌తో ఇషాన్(54)ను బోల్తా కొట్టించాడు. చివరి బంతికి సూర్యకుమార్(0)ను అవుట్ చేశాడు. చివరి రెండు బంతులకు రెండు వికెట్లు. కేవలం ఒకే రన్ వచ్చింది.
**ఓవర్17 (7 రన్స్):** డఫీ ఓవర్లో ధాటిగా ఆడడంలో హార్దిక్ పాండ్యా, తిలక్ వర్మ విఫలమయ్యారు.ఓ డబుల్, 5 సింగిల్స్‌తో 7రన్స్ వచ్చాయి.
**ఓవర్18 (9 రన్స్):** నీషామ్ వేసిన ఈ ఓవర్లోనూ పొదుపుగా పరగులిచ్చాడు. 16బంతుల తర్వాత భారత్ ఖాతాలో చివరకు బౌండరీ చేరింది. హార్దిక్ పాండ్యా బౌండరీ ఖాతా తెరిచాడు.
**ఓవర్ 19(11 రన్స్):** మాట్ హెన్రీ తొలి బంతికే డీప్ మిడ్‌వికెట్ మీదుగా స్టాండ్స్ లోకి పంపిన హార్దిక్‌ను స్లో బంతితో బోల్తా కొట్టించాడు. మూడు సింగిల్స్,ఓ డబుల్‌తో 11 రన్స్ వచ్చాయి. చివరి 4 ఓవర్లలో భారత్ 28 రన్స్ మాత్రమే సాధించి 4 వికెట్లు కోల్పోయింది.
**ఓవర్ 20(24 రన్స్):** నీషామ్ వేసిన ఈ ఓవర్లో శివమ్ దూబే జూలు విదిల్చాడు. మొదటి బంతికి బౌండరీ, ఆతర్వాతి రెండు బంతుల్లో బ్యాక్ ట బ్యాక్ సిక్స్‌లు, ఆ తర్వాత మరో రెండు బౌండరీలతో మొత్తం 24 రన్స్ పిండుకున్నాడు. దీంతో భారత్ స్కోరు 250 దాటింది.

## రన్నరప్‌గా నిలిచిన లక్ష్యసేన్




**బర్మింగ్హామ్:** భారత్ షట్లర్ లక్ష్యసేన్ చరిత్ర సృష్టించే అవకాశాన్ని తృటిలో చేజార్చుకున్నాడు. ఆల్ ఇంగ్లాండ్ ఓపెన్ ఛాంపియన్ షిప్ ఫైనల్‌కు రెండోసారి చేరుకున్నా రన్నరప్‌తోనే సరిపెట్టాడు.చైనీస్ తైపీ ప్లేయర్ లిన్ చున్‌యీ వరుస గేమ్‌ల్లో లక్ష్యసేన్‌పై నెగ్గి ట్రోఫీ అందుకున్నాడు.తొలి గేమ్‌ను 15-21 తో చేజార్చుకున్నాడు. రెండో గేమ్‌లో పుంజుకున్న లక్ష్యసేన్ 10-5తో ఆధిక్యంలో నిలిచాడు. ఆ తర్వాత నుంచి పోటాపోటీగా స్కోర్ చేస్తూ 20-20 తో సమంగా నిలిచారు.ఈ దశలో లక్ష్యసేన్ కొన్ని పొరపాట్లు చేయగా, 2 పాయింట్లు సాధించి లిన్ చున్‌యీ 22-20తో ముగించాడు.

## పెర్త్ టెస్ట్‌లో అమ్మాయిలకు ఓటమి



**పెర్త్:** వాకా స్టేడియం వేదికగా జరిగిన పింక్ బాల్ టెస్ట్ మ్యాచ్‌లో టీమిండియా మహిళల జట్టుకు పరాభవం ఎదురైంది.3రోజుల్లోనే ముగిసిన టెస్ట్‌లో ఆస్ట్రేలియా మహిళల జట్టు 10 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. మూడో రోజు ఓవర్ నైట్ స్కోరు 6 వికెట్లకు 105 పరుగులతో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన భారత్ విమెన్స్.. లంచ్ లోపే మిగతా నాలుగు వికెట్లను కోల్పోయింది.ఓవర్ నైట్ స్కోరుకు 44 పరుగులు మాత్రమే జోడించి 149 రన్స్‌కు ఆలౌటైంది. టెస్ట్ అరంగేట్రం చేసిన ప్రతీకా రావల్(63) అర్ధసెంచరీతో ఒంటరిపోరాటం చేసింది. శేహ్ రాణా 30 పరుగులు చేసింది.

# వాణిజ్యం

## అనిల్ అంబానీపై సిబిఐ కేసు

### పిఎన్బీని రూ.1085 కోట్లు మోసం చేశారని ఆరోపణ



**ముంబయి, మార్చి 8:** పారిశ్రామిక వేత్త అనిల్ అంబినిపై కేంద్ర దర్యాప్తుసంస్థ సిబిఐ మరోకేసునమోదుచేసింది. రిలయన్స్‌కమ్యూనికేషన్స్, మాజీ డైరెక్టర్ మంజరి అశోక్ కేకర్‌తో కలిసి సుమారు రూ.1085 కోట్ల బ్యాంకు మోసానికి సంబంధించి ఈ కేసునమోదుచేసింది. ఈనెల ఐదోతేదీ ఎఫ్ఐఆర్‌నమోదుచేసింది. పంజాబ్‌నేషనల్ బ్యాంకునుంచి అందిన ఫిర్యాదుమేరకు ఈ కేసునమోదుచేసినట్లు తెలిపింది. బ్యాంకు ముంబయి శాఖలోని సంక్లిష్ట ఆస్తుల నిర్వహణ విభాగం చీఫ్‌మేనేజర్ సంతోష్‌కృష్ణ అన్నవరపు ఈ ఫిర్యాదుచేసారు. పిఎన్‌బితోపాటు యునైటెడ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలను 2013, 2017 సంవత్సరాల్లో మోసంచేసారని దీనివల్ల 1085.19 కోట్లు రెండు బ్యాంకులకు నష్టం వాటిల్లిందని చీఫ్‌మేనేజర్ వివరించారు. ఈ నష్టంలో పిఎన్బీకి రూ.621.39 కోట్లు, యునైటెడ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు రూ.463.80 కోట్లు ఉందని బ్యాంకు చీఫ్‌మేనేజర్ ఫిర్యాదులో పేర్కొన్నారు.

నేరపూరిత కుట్ర, అనుచిత ధోరణితో బ్యాంకులనుంచి రుణాలు పొందేందుకు ప్రయత్నించారని ఆరోపణలపై కేసనమోదయింది. అలాగే ఈ రుణమొత్తాలను ఇతర ప్రయోజనాలకు మళ్లించి దుర్వినియోగంచేసారని, నిధుల దుర్వినియోగం, నేరపూరిత విశ్వాసఘాతుకం వంటి అభియోగాలను నమోదుచేసారు. 2017లోనే వీటిని ఎన్పీయేలుగా ప్రకటించారు. 2021లో మోసపూరిత ఖాతాగా ప్రకటించారు. బిడిఒ ఇండియా ఎల్ఎల్‌పి నిర్వహించిన ఆడిట్‌లో బ్యాంకు నిధులు లావాదేవీలు అన్నీ లోపాలతో ఉన్నట్లు తేలిందని సిబిఐ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఐపిసిలోని 120బి, 420, అవినీతినిరోధక చట్టం పరిధిలో ఈకేసునమోదయినట్లు సిబిఐ ప్రకటించింది.



## నాలుగు ట్రేడింగ్‌లలో రూ.21వేల కోట్ల ఎఫ్‌పిఐలు వెనక్కి!

**ముంబయి, మార్చి 8:** విదేశీ ఇన్వెస్టర్లు గడచిన నాలుగు ట్రేడింగ్‌లలో దేశీయ స్టాక్ మార్కెట్లనుంచి సుమారు రూ.21 వేలకోట్లు నిధులు వెనక్కి తీసుకుననట్లు తేలింది. పశ్చిమాసియా సంక్షోభం నేపథ్యంలో పెట్టుబడులకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని అంచనావేసిన విదేశీ ఇన్వెస్టర్లు అప్రమత్తం అయినట్లు మార్కె ట్ల ధోరణులు కనిపిస్తున్నాయి. విదేశ ఈపోర్టుఫోలియో ఇన్వెస్టర్లు భారతీయ ఈక్విటీల్లో ఫినరబవరి నెలలో రూ.22, 615 కోట్లు పెట్టుబడులుపెట్టారు. అంతకుముందు ఎఫ్‌పిఐలు మూడు సెషన్లలో తమ షేర్ల పెట్టుబడులు వెనక్కితీసుకున్నారు. రూ.35,962 కోట్లు జనవరిలోను, గత ఏడాది డిసెంబరులో రూ.22, 611 కోట్లు, నవంబరులో రూ.3765 కోట్లు వెనక్కి తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈనెల రెండు ఆరు తేదీలమధ్యలోనే ఎఫ్‌పిఐలు ఎక్కువ ఈక్విటీలను విక్రయించారు. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలే ఇందుకు కారణమని మార్కెట్ నిపుణులు చెపుతున్నారు. అమెరికా ఇజ్రాయెల్ రెండుదేశాలు కూడా ఇరాన్‌పై సంయుక్త దాడులుచేశి ఇరాన్‌సుప్రీం నేత అయతొల్లాఅలీఖమైనీని హత్యచేసినట్లు తేలింది. హార్మొజ్‌జలసంధిని మూసివేయడంతో బ్రెంట్‌ముడిచమురు కూడా బ్యారెల్‌కు 90 డాలర్లుగా కొనసాగింది. దీనికితోడు డాలర్ రూపాయి చెలామణి 92గా నడించింది. విదేశీ ఇన్వెస్టర్లు పెట్టుబడులు విత్‌డ్రాచేసినా మార్కెట్లకు దేశీయ ఇన్వెస్టర్లు కొంత దన్నుగా నిలిచారు. దేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు భారీ స్థాయిలోనే పెట్టుబడులు పెట్టారు.




## ప్రైమరీ మార్కెట్లకు 5 కంపెనీల ఐపిఓలు

**ముంబయి, మార్చి 8:** ప్రైమరీ మార్కెట్లకు మళ్లీ ఐపోలు వస్తున్నాయి. ఈ వారం ఏకంగా 5 కంపెనీలు పబ్లిక్ ఇష్యూలకు వస్తున్నాయి. స్టాక్ మార్కెట్ల నుంచి ఈ కంపెనీలు రూ. 6,578 కోట్లకు పైగా నిధులు సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నాయి. ఇటీవల వచ్చిన చివరి 8 ఐపీఓలలో 7 ఐపీఓలు నష్టాలు మిగిల్చాయి. ప్రస్తుతం మార్కెట్ బలహీనంగా ఉడమే ఇందుకు ప్రధాన కారణమని నిపుణుల అంచనా. గ్రే మార్కెట్ ప్రీమియం తక్కువగా ఉంది. అయితే, ఈ వారం వచ్చే ఐపీఓలు లాభాలు అందించవచ్చన్న అంచనాలున్నాయి. రాజ్‌పుతన స్టెయిన్‌లెస్ కంపెనీ పబ్లిక్ ఇష్యూ ఈనెల 9న రోజున సబ్‌స్క్రిప్షన్ కోసం ఓపెన్ అయి 11వ తేదీ వరకు కొనసాగుతుంది. మార్కెట్ నుంచి రూ. 255 కోట్లు సమీకరించనుంది. తాజా షేర్ల జారీతో పాటు ఆఫర్ ఫర్ సేల్ ద్వారానూ షేర్ల విక్రయాలు చేపడుతోంది. ఇష్యూధర రూ. 116రూ. 122 గా నిర్ణయించారు. ఈ కంపెనీ స్టెయిన్‌లెస్ స్టీల్ ప్రొడక్ట్స్, బిలెట్స్, బార్స్ వంటివి తయారు చేస్తోంది. గుజరాత్ నుంచి వ్యాపారం నిర్వహిస్తోంది. ఇన్నోవిజన్ కంపెనీ ఐపీఓ సబ్‌స్క్రిప్షన్ కోసం 10వ తేదీ ఓపెన్ అవుతుంది. 12 వ తేదీతో ముగుస్తుంది. మార్కెట్ నుంచి రూ. 323 కోట్లు సమీకరించనుంది. రూ. 255 కోట్లు విలువైన ఫ్రెష్ షేర్ల జారీతో పాటు ఆఫర్ ఫర్ సేల్ సైతం ఉంది. ఇక షేరు ధర రూ. 521-548 గా నిర్ణయించారు. ప్రభుత్వ రంగ సంస్థ ఎన్‌హెచ్ఏఐ అనుబంధ సంస్థ అయిన ఈ రాజ్‌మార్గ్ ఇన్‌ఫ్రా ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్ పబ్లిక్ ఇష్యూ సబ్‌స్క్రిప్షన్ 11వ తేదీనుంచి 13వ తేదీ వరకు కొనసాగనుంది. మార్కెట్ నుంచి రూ.ఆరువేల కోట్లు సమీకరించనుంది. ఈవారం వస్తోన్న ఐపీఓల్లో ఇదే అతిపెద్ద ఐపీఓగా నిలుస్తోంది. షేరు ధరల శ్రేణి రూ. 99-100 గా నిర్ణియించారు. ఈ కంపెనీ 5 టోల్ రోడ్ అసెట్లు కలిగి ఉంది. మొత్తం 260 కిలోమీటర్ల రోడ్లు నిర్వహిస్తోంది. ఈనెల 24వ తేదీన లిస్టింగ్ జరుగుతుంది. స్కైవేస్ ఎయిర్ సర్వీసెస్ కంపెనీ ఐపీఓ 18వ తేదీ నుంచి 20వ తేదీ వరకు కొనసాగుతుంది. ఈ సంస్థ 4.22 కోట్ల షేర్లను ఐపిఒకు తెస్తోంది. ప్రైస్ బ్యాండ్ ప్రకటించలేదు. ఈ సంస్థ ఎయిర్ ఫ్రైట్, ఓషన్ ఫ్రైట్, ట్రకింగ్, వేర్ హౌసింగ్, కస్టమ్స్ క్లియరెన్స్ వంటి సేవలు అందిస్తోంది. ఎయిర్ ఇండియా కార్గో, టర్కిష్ ఎయిర్‌లైన్స్, లుఫ్తాన్సా మొదలైన సంస్థలు ఈ కంపెనీకి క్లయింట్లుగా ఉన్నాయి. ఆప్సిస్ ఏరోకామ్ ఎస్ఎంఈ విభాగం నుంచి వస్తున్న ఐపీఓ ఇది. మార్చి 11వ తేదీనే సబ్‌స్క్రిప్షన్ ఓపెన్ అవుతుంది. మార్చి 13వ తేదీ వరకు కొనసాగుతుంది. ప్రైమరీ మార్కెట్ నుంచి రూ. 3536 కోట్లు సమీకరించనుంది. ప్రైస్ బ్యాండ్ రూ. 104-110 గా నిర్ణయించారు. ఈ కంపెనీ ఏరోస్పేస్, డిఫెన్స్, హెల్త్‌కేర్ సెక్టార్లకు ప్రెసిషన్ ఇంజినీరింగ్ కాంపోనెంట్స్ తయారు చేస్తుంది.



## ఫండ్స్ నిర్వహణలో మహిళలు టాప్

### 49 మంది మహిళలు రూ.13.45 లక్షలకోట్ల ఫండ్స్ పర్యవేక్షణ

**న్యూఢిల్లీ,మార్చి 8:** అసెట్‌మేనేజ్‌మెంట్ రంగంలోకూడా మహిళలు భారత్‌లో ద్విముఖంగా రాణిస్తున్నారు. మొత్తం49 మంది మూచువల్‌ఫండ్ మహిళా మేనేజర్లు సమిష్టిగా రూ.13.45 లక్షలకోట్ల ఫండ్స్‌ను నిర్వహిస్తున్నారు. వీరిలో టాప్ ఐదుగురు రూ.6.1 లక్షలకోట్ల ఫండ్స్ పర్యవేక్షిస్తున్నట్లు తేలింది. ఆర్థికసేవలు, ఫండ్స్, ఈక్విటీ రంగాల్లోకూడా మహిళల భాగస్వామ్యం పెరుగుతున్నది. అలాగే ఫండ్స్‌పర్యవేక్షణలో కూడా మహిళా చీఫ్‌ల సామర్థ్యం మరింత పెరుగుతున్నది. ఎస్‌బిఐ మూచువల్ ఫండ్‌లో మాన్సి సజేజా సుమారుగా రూ.1.4 లక్షలకోట్ల ఫండ్ నిర్వహిస్తున్నారు. హైబ్రిడ్ అసెట్ కేటాయింపు వ్యూహాల్లో ఆమెకు మంచి అనుభవం ఉంది. ఈక్విటీ డెట్ రంగాలపైనా మంచి పట్టు ఉంది. ఎస్‌బిఐ బ్యాలెన్స్‌డ్ అడ్వాంటేజ్‌ఫండ్ వంటి వాటిని సమర్థవంతంగా నిర్వహించారు. అలాగే ఐసిఐసిఐ ప్రుడెన్షియల్ సర్వీసెస్‌కు సంబంధించి అశ్విని షిండే రెండోస్థానంలోనిలిచారు. మొత్తం 47 విభిన్న స్కీమ్‌లు ఆమె నిర్వహిస్తున్నారు. ఈక్విటీ సేవింగ్స్, మద్యేమార్గ వ్యూహాలతో ఆమె ముందుకు వెళుతున్నారు. అలాగే నిప్పన్ ఇండియా మూచువల్‌ఫండ్ కింజాల్ దేశాయి కూడా రూ.1.37 లక్షలకోట్ల విలువైన 24 ఫండ్‌స్కీమ్స్ పర్యవేక్షిస్తున్నారు. మిడ్, స్మాల్‌క్యాప్ సెక్టార్లలోనే ఆమె మంచి పనితీరుచూపించారు.

అలాగే నిప్పన్‌లోనే మీనాక్షి దావార్‌కూడా టాప్ స్థానంలో ఉన్నారు నిప్పన్ ఇండియా మార్కెట్ విలువలను 15.92శాతం పెంచారు. ఆదిత్యబిర్లా సన్‌లైఫ్ సునైనా దా చున్హాకూడా మంచి అనుభవశాలి. క్రెడిట్‌రిస్క్ ఫండ్ నిర్వహణలో ఆమె 9.52శాతం వార్షిక రిటర్నులు సాధించారు. ఈ ఫండ్‌ను టాప్‌స్థాయిలోకి తెచ్చారు. ఫ్రాంక్లిన్ టెంపుల్టన్‌లో రాజసా కాకులవరపు కూడా సీనియర్ రీసెర్చి అనలిస్టుగా మంచి నితీరుచూపించారు. ఫ్రాంక్లిన్ ఇండియా ఫ్లెక్సీక్యాప్‌ఫండ్ ఆమె ఆధ్వర్యంలో 14.14శాతం వార్షిక రిటర్నులు తెచ్చిపెట్టింది. యాక్సిస్ ఎంఎఫ్‌లో కృష్ణా ఎన్ కూడా రూ.1.35 లక్షలకోట్ల ఫండ్ నిర్వహిస్తున్నారు. అలాగేఏక్తాగాలా కూడా మొత్తం 30 స్కీమ్‌లు నిర్వహించడం గమనార్హం.

## మహిళలకోసం బ్యాంకులు ప్రత్యేక పథకాలు!




**ముంబయి, మార్చి 8:** మహిళల కోసం స్పెషల్ శాలరీ అకౌంట్ ప్రారంభించినట్లు ప్రైవేటురంగంలోని యెస్ బ్యాంక్ ప్రకటించింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళల ఆర్థిక, జీవన శైలి అవసరాలకు అనుగుణంగా ఈప్రత్యేక ఖాతాను రూపొందించింది. యెస్ ఎసెన్స్ ఉమెన్స్ శాలరీ అకౌంట్లో మొదటి ఏడాది ఉచితలాకర్ సౌకర్యం, ఏడాది పాటు రూ.5లక్షల వరకు కాంప్లిమెంటరీ హెల్త్ కవర్ లభిస్తాయి. డెబిట్ కార్డు ద్వారా ఎంపిక చేసిన విభాగాల్లో 5 శాతం క్యాష్ బ్యాక్ ఏడాదికి రూ.6000 వరకు పొందవచ్చు. మొదటి ఏడాది రూ.5 లక్షల హెల్త్ ఇన్సూరెన్స్ లభిస్తుందని చెప్పింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలకు ప్రభుత్వ దిగ్గజ బ్యాంక్ ఎస్‌బిఐ మహిళల ఆర్థిక సాధికారత కోసం 500 మిలియన్ డాలర్లు అంటే భారత కరెన్సీలో రూ.4590 కోట్ల సామాజిక రుణ సౌకర్యాన్ని తీసుకొస్తున్నట్లు తెలిపింది. మహిళా పారిశ్రామికవేత్తల కోసం ఎల్ అండ్ టీ ఫైనాన్స్ సరికొత్త హోమ్ లోన్ స్కీమ్ తీసుకొచ్చింది. స్ఫూర్తి పేరుతో ఈ స్పెషల్ గృహ రుణ పథకాన్ని లాంచ్ చేసింది. హోమ్ లోన్స్ పై గరిష్ఠంగా 25 ఏళ్ల, పారిశ్రామిక ఆస్తుల హామీతో 12 ఏళ్ల వరకూ టెన్యూర్ వ్యవధితో ఈ రుణాలు అందిస్తున్నట్లు తెలిపింది. వ్యాపారంలో కనీసం 50 శాతం వాటా ఉండి, రూ.5 లక్షల వార్షిక లాభం పొందే మహిళలు ఈ రుణాలు పొందేందుకు అర్హులుగా పేర్కొంది. తక్కువ వడ్డీ రేట్లు, సడలించిన రూల్స్ తో రూ.75 లక్షల వరకు లోన్ పొందవచ్చని తెలిపింది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at Superior Printers (P) Ltd. and published at Plot No.4-40/1, Alugunuru, 'X' Roads, Karimnagar-505527. Ph:2223355,2277034, 35, FAX: 2277036; Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. RNI No.APTEL/2001/07563.